www.velthuru.com
RNI TEL TEL/ 2019 / 78609
మంగళవారం

# వెలుతురు

తెలుగు దిన పత్రిక

రంగారెడ్డి, 05, మార్చి 2024
సంపుటి: 5 సంచిక: 285, పేజీలు: 12, వెల: రూ.5/-

బ్యూరోలు, స్టాఫ్ రిపోర్టర్లు
కావలెను
తెలంగాణ రాష్ట్రంలో వెలుతురు తెలుగు దిన పత్రిక,
యందు పని చేయుటకు బ్యూరోలు,
స్టాఫ్ రిపోర్టర్లు కావలెను
86398 40328
రంగారెడ్డి, వికారబాద్, మేడ్చల్, హైదరాబాద్, నల్లగొండ,
సూర్యాపేట, యాదాద్రి, సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట.
జిల్లా కేంద్రాల్లో ఉండి పనిచేసేవారికి ప్రాధాన్యత




## తెలంగాణ అభివృద్ధికి
# కట్టుబడి ఉన్నాం...

### రాష్ట్రాభివృద్ధిలో రాజీలేదు

- ఘర్షణాత్మక వైఖరి సరికాదు
- కేంద్రంతో సయోధ్యనే కోరుకుంటున్నాం
- ఆదిలాబాద్ సభలో సిఎం రేవంత్ రెడ్డి

**ఆదిలాబాద్,మార్చి4(వెలుతురు):** ప్రధాని మోదీ రాకను నాలుగు కోట్ల మంది ప్రజలు స్వాగతిస్తున్నారని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సత్సంభందాలు కలిగి ఉండాలని తెలిపారు. ఘర్షణ వాతావరణం వస్తే

మిగతా.. 2లో



- అన్ని విధాలా సహకారం అందిస్తాం
- ఆదిలాబాద్ కేంద్రంగా 6వేల కోట్ల పనులకు శ్రీకారం
- విద్యుత్, రైల్వే ప్రాజెక్ట్ పనులు ప్రారంభించిన ప్రధాని మోడీ
- తెలంగాణకు పెద్దన్నలా సహకరించాలన్న సిఎం రేవంత్
- ఆదిలాబాద్ పర్యటనలో ప్రధానికి ఘనంగా స్వాగతం

**ఆదిలాబాద్,మార్చి4(వెలుతురు):** కేంద్రంలోని భాజపా ప్రభుత్వం దేశాభివృద్ధికి కృషి చేస్తోందని ప్రధాని మోదీ అన్నారు. ఆదిలాబాద్‌లో రూ. 7వేల కోట్ల విలువైన పలు అభివృద్ధి పనులను ఆయన వర్చువల్‌గా ప్రారంభించారు. రామగుండం ఎన్టీపీసీలో 800 మెగావాట్ల విద్యుత్ కేంద్రాన్ని జాతికి అంకితం చేశారు. దీంతో పాటు రైల్వే అభివృద్ధి పనులను ప్రారంభించారు. దేశంలోని అనేక రాష్ట్రాలు అభివృద్ధిలో దూసు కెళ్తున్నాయి. తెలంగాణ ఏర్పడి పదేళ్లు అయింది. ఈ రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం సహకరిస్తుందని అన్నారు. పేదలు, దళితులు, ఆదివాసీల అభివృద్ధికి కృషి చేస్తుంది. గత

మిగతా.. 2లో

## విద్యార్థులను ఉత్తమ పౌరులుగా
# తీర్చిదిద్దాలి..




- సమాజం గౌరవించేలా చేయండి
- గంజాయి లాంటి మత్తు పదార్థాలకు దూరం చేయండి
- ఉద్యోగాల కోసం కాదు.. సమాజం కోసం పనిచేయండి
- పనిచేస్తున్న ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి
- నేను కూడా ప్రభుత్వ స్కూల్ నుంచే వచ్చారు
- ఎల్బీ స్టేడియంలో టీచర్లకు ఉద్యోగ నియామక పత్రాలు
- భారీ సభలో అందజేసిన సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్,మార్చి4(వెలుతురు):** విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చి దిద్దే క్రమంలో టీచర్లు వారికి మంచి సుగుణాలు అలవడేలా తీర్చిదిద్దాలని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. గురుకుల టీచర్లుగా నియామకాలు అందుకున్న వారు తమ ఉద్యోగం కోసం అని కాకుండా సామాజిక బాధ్యతగా పౌరులను తీర్చిదిద్దే పని చేపట్టాలన్నారు. తెలంగాణ తులసివనంలో ఒక్క గంజాయివనం కూడా ఉండరాదని కఠినంగా నిర్ణయించామని, విద్యార్థులు గంజాయి మత్తులకు అలవాటు పడకుండా వారిని సక్రమ మార్గంలో పెట్టే బాధ్యత టీచర్లదేనని అన్నారు. మీ చేతుల్లోనే వారి భవిష్యత్ ఆధారపడి వుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలోనే చదివి తాను ఈ స్థాయికి ఎదిగానని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. ఎల్బీ స్టేడియంలో లెక్చరర్లు, టీచర్లు ఉద్యోగాలకు ఎంపికైన 5,192 మందికి నియామక పత్రాలను ఆయన అందజేశారు. మూడు నెలల్లోనే 30 వేల మందికి ఉద్యోగ నియామక పత్రాలు ఇచ్చామని పేర్కొన్నారు. ఎల్బీ స్టేడియంలోనే రైతును రాజుగా చేసే పాలనకు నాంది పడిందని చెప్పారు. తెలంగాణ సాధనలో నిరుద్యోగులు, యువత పాత్ర ఎంతో గొప్పది. వారి త్యాగాలు, బలిదానాలతోనే స్వరాష్ట్రం సాకారమైంది. ప్రత్యేక తెలంగాణ ఏర్పడితే న్యాయం జరుగుతుందని భావించారు. కానీ, కుటుంబ పాలనలో యువత ఆకాంక్షలు నెరవేరలేదు. కేసీఆర్, ఆయన కుటుంబ సభ్యుల పదవులు ఊడగొడితేనే.. తమకు ఉద్యోగాలు వస్తాయని యువత భావించారు. అనుకున్నట్టే చేయడంతో.. ఇప్పుడు ఉద్యోగాలు వస్తున్నాయని అన్నారు. ఈ ప్రభుత్వం ప్రజా ప్రభుత్వమని నిరూపించామని, ఇకముందు మరింతగా వెళ్లేందుకు తమకు ఆశీర్వదించాలని అన్నారు. నాకు ఇంగ్లిష్ రాదని కొందరు అవహేళన చేస్తున్నారు. నేను జిల్లా పరిషత్ పాఠశాలలో తెలుగు మీడియంలో చదివా. గుంటూరు, గుడివాడకు వెళ్లి కార్పొరేట్ పాఠశాలల్లో చదవలేదు.

మిగతా.. 2లో

## వికసిత భారత్‌కు
# మీ మద్దతు కావాలి

- అభివృద్ధిలో మీ భాగస్వామ్యం ఎంతో ముఖ్యం
- కాళేశ్వరం అవినీతిలో విచారణపై అనుమానాలు
- ఆదిలాబాద్ విజయ సంకల్ప సభలో ప్రధాని మోడీ

**ఆదిలాబాద్,మార్చి4(వెలుతురు):** వికసిత్ భారత్ కోసం తమ పార్టీ కృషి చేస్తోందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఇందుకోసం అనేక కార్యక్రమాలతో ముందుకు పోతున్నామని అన్నారు. ఈ పదిహేను రోజుల్లోనే చేపట్టిన అనేక అభివృద్ధి కార్యక్రమాలను ప్రధాని మోడీ ఈ సందర్భంగా వివరించారు. అభివృద్ధికి తాము ఎంతగా కట్టుబడి ఉన్నామో తెలిపారు. ప్రజలంతా తమ వికసిత్ భారత్ కార్యక్రమంలో భాగం కావాలని పిలుపునిచారు. ఆదిలాబాద్‌లో భాజపా ఆధ్వర్యంలో నిర్వహించిన 'విజయ సంకల్ప సభ'లో ఆయన మాట్లాడారు. ఇది ఎన్నికల సభ కాదని.. అభివృద్ధి ఉత్సవమని చెప్పారు. 15 రోజుల్లో 5 ఎయిమ్స్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. ఆదివాసీ మహిళను రాష్ట్రపతిని చేశామన్నారు. త్వరలో జరిగే లోక్‌సభ ఎన్నికల్లో భాజపా 400 సీట్లు గెలవాలన్నారు.

మిగతా.. 2లో



## లంచం కేసుల్లో ఎంపిలు, ఎమ్మెల్యేలకు షాక్

- ఎవరు అవినీతికి పాల్పడ్డా విచారణకు అర్హులే
- వారికి ఎలాంటి మినహాయింపు లేదు
- సంచలన తీర్పు వెలువరించిన సుప్రీం ధర్మాసనం
- చట్టసభ సభ్యుల అవినీతిపై సుప్రీం తీర్పు
- వ్యవస్థపై ప్రజల్లో నమ్మకం పెరుగుతుందన్న మోడీ
- ఎక్స్ వేదికగా తీర్పును స్వాగతించిన ప్రధాని

**న్యూఢిల్లీ,మార్చి4(వెలుతురు):** చట్టసభ సభ్యుల అవినీతిపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును దేశ ప్రధాని నరేంద్ర మోదీ స్వాగతించారు. ఈ మేరకు ఆయన తన ఎక్స్‌ఖాతాలో స్పందించారు. 'గౌరవ సుప్రీం కోర్టు అద్భుతమైన తీర్పును ఇచ్చింది. అది భవిష్యత్తులో స్వచ్ఛమైన రాజకీయాలకు కారణమై.. వ్యవస్థపై ప్రజల్లో నమ్మకాన్ని పెంచుతుంది' అని అభిప్రాయపడ్డారు. ఈ పోస్టుకు సుప్రీం తీర్పునకు సంబంధించిన కథనాన్ని జత చేశారు. లంచం కేసుల్లో ఎంపీ, ఎమ్మెల్యేలకు ఎలాంటి మినహాయింపు ఇవ్వకూడదని నేడు సుప్రీం కోర్టు తేల్చి చెప్పింది. చట్టసభల్లో ప్రశ్నలు అడిగేందుకు, ప్రసంగించేందుకు, ఓట్లు వేసేందుకు లంచం తీసుకుంటే రక్షణ



మిగతా.. 2లో

## నాలుగు స్థానాలకు
# బీఆర్ఎస్ అభ్యర్థుల ప్రకటన

- కరీంనగర్‌కు వినోద్ కుమార్.. ఖమ్మంనకు నామా
- మహబూబాబాద్ దక్కించుకున్న మాలోత్ కవిత
- పెద్దపల్లికి మాజీమంత్రి కొప్పుల ఈశ్వర్

**హైదరాబాద్,మార్చి4(వెలుతురు):** త్వరలో జరుగనున్న పార్లమెంట్ ఎన్నికల కోసం బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖరరావు అభ్యర్థులను ప్రకటించారు. తొలి జాబితాలో నాలుగు పార్లమెంట్ నియోజకవర్గాలకు అభ్యర్థులను ఖరారు చేశారు. కరీంనగర్‌కు మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్, పెద్దపల్లికి మాజీమంత్రి కొప్పుల ఈశ్వర్, ఖమ్మంకు ప్రస్తుత నామా నాగేశ్వరరావు, మహబూబాబాద్ స్థానానికి ఎంపి మాలోత్ కవిత పేర్లను ప్రకటించారు. ఆది, సోమవారాల్లో నాలుగు పార్లమెంట్ నియోజకవర్గాలకు చెందిన నేతలతో బీఆర్ఎస్ అధినేత వరుస సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా లోక్‌సభ ఎన్నికలపై నేతలతో చర్చించి.. అభ్యర్థుల ఎంపికపై అభిప్రాయాలను సేకరించారు. ఈ క్రమంలో ముఖ్యనేతల అభిప్రాయం మేరకు.. సమష్టి నిర్ణయంతో తొలి విడుదతలో నలుగురు అభ్యర్థుల పేర్లను ప్రకటించారు. ఈ



సందర్భంగా పార్లమెంట్ ఎన్నికల బరిలో నిలువబోతున్న అభ్యర్థులకు కేసీఆర్ శుభాకాంక్షలు తెలిపారు. తొలుత మానుకోటకు సంబంధించి పలు పేర్లను పరిశీలించారు. చివరకు కవిత పేరునే ఖరారు చేశారు. ఈ సమావేశంలో పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, హరీశ్‌రావు, ఎంపీలు కేశవరావు, నామా నాగేశ్వరరావు, కవిత పాల్గొన్నారు. భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకటరావు

మిగతా.. 2లో

## క్యాన్సర్ బారిన ఇస్రో చైర్మన్

- స్వయంగా వెల్లడించిన సోమనాథ్



**బెంగలూరు,మార్చి4(వెలుతురు):** భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ చీఫ్ సోమనాథ్ క్యాన్సర్ బారినపడ్డారు. ఈ విషయాన్ని ఆయనే స్వయంగా వెల్లడించారు. సూర్యుడిని అధ్యయనం చేసేందుకు రూపొందించిన 'ఆదిత్య ఎల్ 1 ప్రయోగం చేపట్టిన రోజే వ్యాధి నిర్ధరణ అయినట్లు తెలిపారు. ఓ మలయాళం వెబ్ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడిన ఆయన.. ప్రస్తుతం పూర్తిగా కోలుకున్నట్లు చెప్పారు. 'చంద్రయాన్-3 ప్రయోగం సమయంలోనే ఆరోగ్య సమస్యలు వచ్చాయి. ఆ సమయంలో దాని గురించి నాకు స్పష్టమైన అవగాహన లేదు. కానీ, ఆదిత్య-ఎల్1 మిషన్ ప్రయోగించిన ఉదయమే వైద్య పరీక్షలు చేయించుకున్నా. కొద్ది సమస్య ఉన్నట్లు గుర్తించారు. ప్రయోగం ముగిసిన తర్వాత చెన్నై వెళ్లి మరిన్ని స్కాన్‌లు చేయించాను. అప్పుడే నాకు అర్థమైంది. నా కడుపులో కణితి పెరిగిందని. మరో రెండు, మూడు రోజుల తర్వాత నిర్ధరణ అయ్యింది. అది వంశపారంపర్యంగా వచ్చే వ్యాధి' అని ఇస్రో చైర్మన్ సోమనాథ్ వెల్లడించారు. ఈ విషయం తెలిసిన వెంటనే కుటుంబసభ్యులతో పాటు సహోద్యోగులు షాక్‌కు గురయ్యారన్నారు. 'సెప్టెంబర్ 2, 2023న ఆదిత్య ఎల్1 ప్రయోగం చేపట్టిన తర్వాత ఆపరేషన్ చేయించుకోవాలని వైద్యులు సూచించారు. అనంతరం శస్త్రచికిత్సతోపాటు కీమోథెరపీ కూడా చేయించుకున్నా. అలా అవన్నీ భరించాల్సి వచ్చింది. అయితే, మొత్తంగా నాలుగు రోజులే ఆసుపత్రిలో ఉన్నా. ఐదోరోజు నుంచి ఇస్రోలో రోజూవారీ బాధ్యతల్లో నిమగ్నమయ్యా. తొలుత కాస్త కంగారు పడినప్పటికీ క్యాన్సర్‌కు పూర్తి పరిష్కారంగా చికిత్స ఉందన్న విషయంపై ఇప్పుడు పూర్తి అవగాహన వచ్చింది' అని ఇస్రో చీఫ్ పేర్కొన్నారు.

## ప్రజలకు అండగా
# కాంగ్రెస్ ప్రభుత్వం

- 11న భద్రాద్రిలో ఇందిరమ్మ ఇళ్ల పథకం
- సీఎం రేవంత్ చేతుల మీదుగా ప్రారంభం

**ఖమ్మం,మార్చి4(వెలుతురు):** పేదవాడికి తోడు నీడగా ఉండాలనేదే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. విద్యా, వైద్యం, మౌలిక సదుపాయాలు కల్పించడమే ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమని అన్నారు. త్వరలో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని సీఎం రేవంత్‌రెడ్డి భద్రాద్రి రాములవారి సన్నిధిలో ప్రారంభి స్తారని మంత్రి పొంగులేటి తెలిపారు. సోమవారం నాడు సత్తుపల్లిలో సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ... ప్రజలు ఆశించిన మేరకు పరిపాలన సాగిస్తున్నామని చెప్పారు. సింగరేణి ప్రభావిత ప్రజలను సింగరేణి అధికారులు ఆదుకోవాలని చెప్పారు. రెవిన్యూ సెక్టార్‌లో అవినీతికి పాల్పడకుండా అధికారులు పనిచేయాలని సూచించారు. టీఎస్పీఎస్సీ ద్వారా పారదర్శకంగా నియామకాలు చేపడతామని



అన్నారు. ఇప్పటికే సుమారు 22 వేల ఉద్యోగాల ఇచ్చామని చెప్పారు. మెగా డీఎస్సీని ప్రకటించామని.. 11 వేల ఉద్యోగ నియామకాలను పార్లమెంట్ ఎన్నికల కోడ్‌కు ముందుగానే చేపడతామని స్పష్టం చేశారు.

మిగతా.. 2లో



## మెట్రో రెండో దశకు
# ముహూర్తం ఖరారు

- ఎంజీబీఎస్ నుంచి ఫలక్‌నుమా వరకు 5.5.కిలోమీటర్ల మెట్రో
- 8న శంకుస్థాపన చేయనున్న సిఎం రేవంత్

**హైదరాబాద్,మార్చి4(వెలుతురు):** మెట్రో రైలు రెండో దశ నిర్మాణానికి ముహూర్తం ఖరారైంది. ఈ నెల 8న పాతబస్తీలో రెండో దశకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేయనున్నారు. ఎంజీబీఎస్ నుంచి ఫలక్‌నుమా వరకు 5.5.కిలోమీటర్ల మెట్రో మార్గానికి పనులు మొదలుపెట్టనున్నారు. సాలార్‌జంగ్ మ్యూజియం, చార్మినార్, శాలిబండ, ఫలక్‌నుమా మధ్య నాలుగు స్టేషన్లతో ఈ కారిడార్ అందుబాటులోకి రాబోతోంది. రెండో దశలో మొత్తం 70 కి.మీ.

మిగతా.. 2లో

## నాలుగు స్థానాలకు బిఆర్ఎస్ అభ్యర్థుల ప్రకటన

మొదటిపేజీ తరువాయి..

సమావేశానికి హాజరు కాకపోవడం చర్చనీయాంశమైంది. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో రెండు రోజులుగా ఆయా పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని ముఖ్యనేతలతో కేసీఆర్ కీలక అంశాలపై చర్చించారు. అభ్యర్థులను ప్రకటించిన అనంతరం కేసీఆర్ మీడియాతో మాట్లాడారు. కరీంనగర్ తర్వాత ఖమ్మంలో కూడా సభ పెడతాం. త్వరలోనే ఖమ్మంలో భారీ బహిరంగ సభ ఉంటుంది. జిల్లాలో పార్టీ ఓడిపోయిందని ఎవరూ అధైర్యపడొద్దు. పార్టీ వీడి వెళ్లే నేతలతో బీఆర్ఎస్‌కు ఎలాంటి నష్టం లేదు. రాబోయే కాలం మనదే. నేతలు కలిసికట్టుగా పనిచేసి ఎంపీ అభ్యర్థులను గెలిపించుకోవాలి. ఒక్కో నియోజకవర్గానికి ముగ్గురు సమన్వయకర్తలను నియమిస్తాం. దివంగత ముఖ్యమంత్రి ఎన్టీఆర్ లాంటి నేతకు రాజకీయాల్లో ఒడిదుడుకులు తప్పలేదు. మనమెంత మనకూ గెలుపు, ఓటమిలు వస్తాయి. కాంగ్రెస్ పార్టీపై అప్పుడే ప్రజల్లో వ్యతిరేకత మొదలయింది. కాంగ్రెస్ వ్యతిరేకతను మనం సద్వినియోగం చేసుకోవాలి. కాంగ్రెస్ ప్రభుత్వానికి పాలనపై అవగాహన రావడం లేదని కేసీఆర్ పేర్కొన్నారు.

## మెట్రో రెండో దశకు ముహూర్తం ఖరారు

మొదటిపేజీ తరువాయి..

కొత్త రైలు మార్గాన్ని నిర్మించాలని నిర్ణయించిన రాష్ట్ర ప్రభుత్వం.. రూట్‌మ్యాప్‌లను ఖరారు చేసింది. అందులో భాగంగా ఈ నెల 8న రెండో దశలోని 5.5 కి.మీ మార్గానికి సీఎం శంకుస్థాపన చేయనున్నట్లు మెట్రో అధికారులు వెల్లడించారు. హైదరాబాద్‌లో ప్రస్తుతం మెట్రో రైలు మూడు కారిడార్‌లో 69 కి.మీ మేర అందుబాటులో ఉంది. మియాపూర్ నుంచి ఎల్బీనగర్, జేబీఎస్ నుంచి ఎంజీబీఎస్, నాగోల్ నుంచి రాయదుర్గం వరకు కనెక్టివిటీ ఉంది. కొత్తగా నిర్మించే 5.5 కి.మీ. అందుబాటులోకి వస్తే సికింద్రాబాద్, జేబీఎస్ నుంచి ఎంజీబీఎస్ మీదుగా నేరుగా ఫలక్‌నుమాకు చేరుకోవచ్చు. కారిడార్ 4, 5, 6, 7 మార్గాల్లో రూట్ మ్యాప్‌ను సిద్ధం చేసిన ప్రభుత్వం.. వాటి నిర్మాణానికి శంకుస్థాపన ఎప్పుడనేది వెల్లడించాల్సి ఉంది. ఈ మార్గం రాకతో నిత్యం రద్దీగా ఉండే ఏరియాలో ట్రాఫిక్ తిప్పలు తప్పించడానికి మెట్రో ట్రైన్ మంచి మార్గం సుగమం కానుంది.. మూడు లైన్లుగా గ్రేటర్ హైదరాబాద్ లో 2017 నుంచి మెట్రో సేవలు అందుబాటులోకి వచ్చాయి. ప్రస్తుతం 69కి. మీటర్ల పొడవు ఉన్న లైన్ మార్గాన్ని మొదటి దశ విస్తరణలో భాగంగా 74 కి. మీటర్లుకు పెంచుతున్నారు. ఎన్నో ఏళ్లుగా హైదరాబాద్ లో పాత బస్తీ ప్రాంతంలో ప్రయాణీకులు ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. అయితే హైద్రాబద్ మెట్రో రైల్ సంస్థ తీసుకున్న నిర్ణయంతో పాతబస్తీకి మెట్రో మోక్షం కలగనుంది. జేబీఎస్ నుండి ఎంజిబిఎస్ వరకు ఉన్న గ్రీన్ లైన్ మెట్రో మార్గాన్ని ఓల్డ్ సిటీ మీదుగా ఫలక్ నుమా వరకు పొడిగించ నున్నారు. ఈ మేరకు మార్చి 8న ఓల్డ్ సిటీలో 5 కి.మీ మెట్రో లైన్ నిర్మాణ ప్రాజెక్టుకు భూమి పూజ చేయనున్నట్లు హైద్రాబద్ మెట్రో రైల్ సంస్థ వెల్లడించింది. ఇది పూర్తి అయితే ఓల్డ్ సిటీ, ఫలక్ నుమా వైపు వెళ్లే ప్యాసింజర్స్ కు ట్రాఫిక్ ఇబ్బందులు తగ్గనున్నాయి.

## ప్రజలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

మొదటిపేజీ తరువాయి..

గత బీఆర్ఎస్ ప్రభుత్వ పద్ధతులు మానుకోవాలని.. ఇందిరమ్మ రాజ్యంలో ప్రజలకు మంచి చేసేలా అధికారులు ముందుకు వెళ్లాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న ధరణి అప్లికేషన్లను యుద్ధప్రాతిపదికన పరిష్కరించేలా మండల స్థాయిలో అధికారులతో కమిటీ ఏర్పాటు చేస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఓ వైపు అభివృద్ధి పథకాలతో ముందుకు సాగుతుంటే బిఆర్ఎస్ తన తప్పులను కప్పిపుచ్చుకునేందుకు అడ్డుపుల్లలు వేస్తోందని , బీఆర్ఎస్ వైఖరిని ప్రజలు అసహ్యించుకుంటున్నారని.. పార్లమెంట్ ఎన్నికల్లో ఒక్క ఎంపీ సీటును గెలవనీయబోమని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హెచ్చరించారు. అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించి తీరుతామని.. ఇది దొరల ప్రభుత్వం కాదు.. ఇందిరమ్మ రాజ్యం అన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో గత ప్రభుత్వ దోపిడీ, దౌర్జన్యాలకు అడ్డుకట్ట వేశామని చెప్పారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన 6 గ్యారెంటీల్లో 4 హామీలను అమల్లోకి తీసుకువచ్చామని తెలిపారు. మహిళలకు మహాలక్ష్మి హామీలో భాగంగా ఉచిత బస్సు, రూ.10 లక్షల మెడికల్ బీమా, రూ.500 గ్యాస్, రూ.200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నామని అన్నారు. మూడు నెలల్లో 25 వేల ఉద్యోగాలు, మెగా డీఎస్సీకి నోటిఫికేషన్ వేశామని చెప్పారు. 2 లక్షల ఉద్యోగాలు ఇచ్చి తీరుతాం, పేపర్ లీకేజీలు లేని పరీక్షలు నిర్వహిస్తామని స్పష్టం చేశారు. గత ప్రభుత్వాల వైఫల్యాలపై శ్వేతపత్రాల్లో అసెంబ్లీ సాక్షిగా గత ప్రభుత్వ అవినీతిని బహిరంగ పరిచామని అన్నారు. తాము కాళేశ్వరం వెళ్తే కేసీఆర్ దుర్భాషలాడారని.. ఇప్పుడు బీఆర్ఎస్ నేతలు ఎందుకు వెళ్తున్నారని ప్రశ్నించారు. ప్రజలకు నిత్యం సీఎం సహా ప్రతి మంత్రి అందుబాటులో ఉంటామని అన్నారు.

## లంచం కేసుల్లో ఎంపిలు, ఎమ్మెల్యేలకు షాక్

మొదటిపేజీ తరువాయి..

కల్పించలేమని ఏడుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం ఏకగ్రీవంగా తీర్పు వెలువరించింది. ఎంపీలు, ఎమ్మెల్యేల లంచాల కేసులో సర్వోన్నత న్యాయస్థానం.. సుప్రీంకోర్టు సంచలన తీర్పును వెలువరించింది. లంచం కేసులో చట్టసభల సభ్యులకు మినహాయింపు లేదని సుప్రీంకోర్టు స్పష్టంచేసింది. ప్రశ్నలకైనా, ఓటుకైనా డబ్బులు తీసుకుంటే విచారణ ఎదుర్కోవాల్సిందేనని తీర్పును వెలువరించింది. ఏకగ్రీవ తీర్పు చెప్పిన ఏడుగురు సభ్యుల ధర్మాసనం.. చట్టసభల్లో ప్రశ్నలకు డబ్బులు తీసుకుంటే.. ప్రజాప్రతినిధులు విచారణ నుంచి తప్పించుకోలేరని పేర్కొంది. 1998లో ఇదే కేసులో ఐదుగురు సభ్యుల ధర్మాసనం ఇచ్చిన.. తీర్పును కొట్టేస్తూ సుప్రీం బెంచ్ తీర్పును వెలువరించింది. సీతా సోరెన్ వర్సెస్ కేంద్రప్రభుత్వం కేసులో సుప్రీంకోర్టు ఈ తీర్పును వెల్లడించింది. పీవీ నరసింహారావు కేసులో 1998 నాటి సుప్రీంకోర్టు తీర్పును, సోమవారం ధర్మాసనం కొట్టేసింది.. చట్టసభల్లో సభ్యులు డబ్బులు తీసుకున్నా, విచారణకు మినహాయింపు ఉంటుందని అప్పట్లో సుప్రీంకోర్టు తన తీర్పులో తెలిపింది. రాజ్యాంగంలోని 105(2), 194 (2) ఆర్టికల్స్ ప్రకారం చట్టసభ సభ్యులకు ప్రివిలేజ్ విషయంపై సుప్రీంకోర్టు ఇవాళ భాష్యం చెప్పింది. పార్లమెంటులో ఓటింగ్ కోసం లంచం తీసుకున్నందుకు ఎంపీలు/ఎమ్మెల్యేలకు ప్రాసిక్యూషన్ నుంచి మినహాయింపునిస్తూ 1998లో ఇచ్చిన తీర్పును బెంచ్ ఏకగ్రీవంగా తిరస్కరించింది. పీవీ నరసింహారావు కేసులో తీర్పుతో విభేదిస్తున్నామని సుప్రీంకోర్టు తెలిపింది. ఎంపీలు, ఎమ్మెల్యేల అవినీతి, లంచాలు భారత పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థ పనితీరును నాశనం చేస్తాయని సుప్రీంకోర్టు పేర్కొంది. సుప్రీంకోర్టు పేర్కొన్న పివి నరసింహ కేసు జార్ఖండ్ ముక్తి మోర్చా లంచాల కుంభకోణానికి సంబంధించినది. 1993లో జేఎంఎం సభ్యులు లంచం తీసుకోని.. కాంగ్రెస్ ప్రభుత్వానికి మద్దతు తెలపడం దేశ రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టించింది. సిపిఐ(ఎం) ఎంపీలు నర్సింహరావు ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం పెట్టగా.. నగదు తీసుకుని జేఎంఎం ఎంపీలు ప్రభుత్వానికి మద్దతు తెలిపారంటూ అభియోగాలు మోపారు

## వికసిత భారత్‌కు మీ మద్దతు కావాలి

మొదటిపేజీ తరువాయి..

కాంగ్రెస్, భారాసపై ఈ సందర్భంగా మోదీ పలు విమర్శలు చేశారు.'భారాస ప్రభుత్వం నిర్మించిన కాళేశ్వరం కుంగింది. ఈ విషయంలో ఆ పార్టీతో కాంగ్రెస్ కుమ్మక్క వుతోంది. గతంలో మీరు తిన్నారు.. ఇప్పుడు మేం తింటాం అన్నట్లు కాంగ్రెస్ పరిస్థితి ఉందని విమర్శలు చేశారు. ఈ అవినీతిపై విచారణలో కాంగ్రెస్ చిత్తశుద్ధితో ముందుకు సాగడం లేదన్నరు. భారాస పోయి కాంగ్రెస్ వచ్చినా పాలనలో ఎలాంటి మార్పు రాలేదు. రాష్ట్రంలో సమ్మక్క-సారక్క పేరుతో గిరిజన విశ్వవిద్యాలయాన్ని స్థాపించాం. 140 కోట్ల మంది ప్రజలే నా కుటుంబం. ప్రజల కలల సాకారం కోసం నేను పనిచేస్తా. మోదీ గ్యారంటీ అంటే.. కచ్చితంగా అమలయ్యే గ్యారంటీ. దేశంలో 7 మెగా టెక్స్‌టైల్ పార్కులు ఏర్పాటు చేయబోతున్నాం. అందులో ఒకటి తెలంగాణలో పెడతాం అని మోదీ అన్నారు. ఈ సందర్భంగా మోదీ కాంగ్రెస్ ప్రభుత్వం, బీఆర్ఎస్‌పై తీవ్ర విమర్శలు చేశారు. తెలంగాణ తన ప్రసంగాన్ని ప్రారంభించిన ప్రధానమంత్రి మోదీ... పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. ఇప్పుడు కాంగ్రెస్ పాలనలో కూడా వచ్చే మార్పు ఏమీ ఉండబోదని పెదవి విరించారు. రెండు పార్టీల విధానం ఒక్కటేనని విమర్శించారు. కుటుంబ పాలనలో ఒకటి దోచుకోవడం రెండు అబద్దాలు వ్యాప్తి చేయడమే వారి విధానాలు అని విమర్శలు చేశారు. కాళేశ్వరంలో అవినీతి జరిగిందని విమర్శలు చేసిన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఏం చేస్తోందని ప్రశ్నించారు మోదీ. కుటుంబ పాలనలో ఉన్న పార్టీలన్నీ ఒక్కటవుతాయని వారిని నమ్మొద్దని ప్రజలకు మోదీ సూచించారు. బీజేపీ మాత్రమే దేశాభివృద్ధి లక్ష్యంతో పాలన చేస్తుందని తెలిపారు. ప్రస్తుతం తాను చేస్తున్న పర్యటనలు ఎన్నికలకు సంబంధం లేదన్న మోదీ... తాను వికసిత్ భారత్‌లో భాగమవ్వాలని ప్రజలను కోరేందుకే వస్తున్నట్టు ప్రకటించారు. పదేళ్ల బీజేపీ పాలనలో ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. వాటిలో చాలా ప్రాజెక్టులు తెలంగాణకు కేటాయించినట్టు వివరించారు మోదీ. రెండు ఐఐటీలు, ఓ ట్రిపుల్ ఐటీ, ఒక ఐఐఎం, ఎయిమ్స్ ఇవాళ ప్రారంభంచిన మరికొన్ని ప్రాజెక్టులు అన్నింటిని కూడా ప్రజలకు తెలిపారు. ఆదిలాబాద్‌కు చాలా చరిత్ర ఉందని ఎందరో స్ఫూర్తినిచ్చే నేతలు ఉన్నారని అన్నారు మోదీ. ఇలాంటి ప్రాంతం నుంచే ముర్ము అనే మహిళ రాష్ట్రపతి అయ్యారని తెలిపారు. తెలంగాణలోని గిరిజన నేతల్లో కూడా పేరున్న వాళ్లు ఉన్నారని వివరించారు. రాంజీ గోండు పేరుతో హైదరాబాద్‌లో మ్యూజియం ఏర్పాటు చేస్తున్నామని... సమ్మక్క సారలమ్మ ట్రైబల్ యూనివర్సిటీ, పసుపు బోర్డు ఇలా చాలా విషయాల్లో తెలంగాణకు తోడ్పాటు అందిస్తున్నామన్నారు.

ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, ఎంపిలు సోయం బాపూరావు, బండి సంజయ్, అర్వింద్, ఈటెల రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం...

మొదటిపేజీ తరువాయి..

పదేళ్లలో పేదరికం నుంచి 25 కోట్ల మంది బయటపడ్డారని మోదీ అన్నారు. ఆదిలాబాద్‌లో వర్చువల్ విధానంలో రూ.6 వేల కోట్ల ప్రాజెక్టుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేసిన ఆయన.. అనంతరం ఏర్పాటు చేసిన సభలో మాట్లాడారు. 'రాష్ట్రాభివృద్ధికి సీఎం రేవంత్‌కు సంపూర్ణంగా సహకరిస్తాం. తెలంగాణలో గడిచిన పదేళ్లలో రూ.56 వేల కోట్లకుపైగా పనులు ప్రారంభించాం. అభివృద్ధిలో కొత్త అధ్యయనాన్ని లిఖించాం అని అన్నారు. అంబారీ - ఆదిలాబాద్ - పింపాలకుట్టీ రైల్వే విద్యుదీకరణను జాతికి అంకితం చేశారు. మంచిర్యాల జిల్లా రామగుండంలోని ఎన్టీపీసీ రెండో థర్మల్ పవర్ యూనిట్‌ని ప్రారంభించారు. దేశంలో నేడు జరుగుతున్న అభివృద్ధికి ఆదిలాబాద్ ఓ ఉదాహరణగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అభివర్ణించారు. రామగుండం ఎన్టీపీసీ స్టేజ్ వన్ పవర్ ప్లాంట్‌ను జాతికి అంకితం చేసిన ప్రధాన మంత్రి వర్చువల్‌గా పలు శంకుస్థాపనలు చేశారు. ములుగు, బేలాలో రెండు జాతీయ రహదారులకు, ఆరు ప్రాజెక్టులకు వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. అనంతరం మాట్లాడిన ప్రధాని తెలంగాణ ప్రజల కలల సాకారానికి కేంద్రం ఎప్పుడూ ముందే ఉంటుందని తెలియజేశారు. తెలంగాణ ఏర్పడి పదేళ్లు పూర్తవుతుందని... అన్ని రంగాల్లో రాష్ట్రం అభివృద్ధి చెందాలని తాము ఆకాంక్షిస్తున్నట్టు పేర్కొన్నారు.అందుకే హైవేల నుంచి అన్ని విభాగాల్లో సహాయ సహకారాలు ఉంటాయని తెలిపారు. అందులో భాగంగా 56 వేల కోట్లు అభివృద్ధి పనులు చేపట్టామని తెలియజేశారు. ఆర్థిక వ్యవస్థ బలోపేతం అయితేనే రాష్ట్రాలు అభివృద్ధి చెందుతాయని దాని ద్వారా దేశం బలపడుతోందని వివరించారు. తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వచ్చిన మోదీకి ఘన స్వాగతం పలికినట్టు రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. వివిధ ప్రాజెక్టులకు వర్చువల్‌గా శంకుస్థాపన చేసే వేదికపై మాట్లాడిన రేవంత్... మోదీని పెద్దన్నగా అభివర్ణించారు.. గత ప్రభుత్వ నిర్ణయాలతో విద్యుత్ సహా చాలా రంగాల్లో వెనుకబడ్డామని తెలిపారు. కేంద్రంతో ఘర్షణపూరిత వైఖరితో ఉంటే రాష్ట్రం అభివృద్ధిలో వెనుబడుతుందని అభిప్రాయ పడ్డారు. రాష్ట్రానికి పెద్దన్నగా భావించి పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను త్వరితగతిన అనుమతులు ఇవ్వాలని వేడుకున్నారు. పాలన విషయంలో, తెలంగాణ ప్రజల బాగోగుల విషయంలో తమకు ఎలాంటి భేషజాలు లేవని రేవంత్ అన్నారు. గుజరాత్‌లా అభివృద్ధి సాధించాలంటే తెలంగాణకు ప్రధానమంత్రి మోదీ సాయం కావాలని విజ్ఞప్తి చేశారు ప్రధానమంత్రి తమకు పెద్దన్న లాంటి వ్యక్తి అని విభజన చట్టంలోని చాలా విషయాలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. అలాంటి వాటిలో విద్యుత్ ఒకటని పేర్కొన్నారు. నాలుగువేల మెగావాట్లకు బందులు కేవలం 1600 మెగావాట్ల విద్యుత్ మాత్రమే సాధించామని పేర్కొన్నారు. మిగిలిన వాటిని త్వరగా క్లియర్ చేయాలని విజ్ఞప్తి చేశారు.

భారత్ ఐదు ట్రిలియన్ ఎకానమిని సాధించేందుకు తెలంగాణ ప్రభుత్వం సహకరిస్తుందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రానికి కంటోన్మెంట్‌లో రక్షణ శాఖ భూములు బదలాయించడం అభివృద్ధిలో మరో అడుగుగా అభివర్ణించారు. స్కైవేల నిర్మాణానికి ఎంతో సహకారిస్తుందన్నారు. అంతకు ముందు మాట్లాడిన కేంద్రమంత్రి కిషన్ రెడ్డి...తెలంగాణ ఏర్పడినప్పటి నుంచి కేంద్రం అనేక విధాలుగా సాయం చేస్తుందని తెలిపారు. భవిష్యత్‌లో కూడా అలాంటి సాయం అందుతుందని భరోసా ఇచ్చారు. అన్ని విధాలా తెలంగాణ అభివృద్ధికి సహాయ సహకారాలు అందిస్తున్న ప్రధానమంత్రికి ప్రజల తరుఫున కిషన్ రెడ్డి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి, తెలంగాణ బీజేపీ చీఫ్ కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. రామగుండంలో యూరియా కంపెనీని మోదీ ప్రారంభించారని తెలిపారు. వరంగల్‌లో వ్యాగన్ తయారీ కంపెనీకి శంకుస్థాపన చేశారన్నారు. రాష్ట్రంలో రూ.30 వేల కోట్ల విలువైన రైల్వే ప్రాజెక్టులు, తెలంగాణ నుంచి మూడు వందేభారత్ రైళ్లు ప్రారంభించారన్నారు. రాష్ట్రాభివృద్ధికి కేంద్రం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వెల్లడించారు.రెండు రోజుల పర్యటన నిమితం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలంగాణ చేరుకున్నారు. వివిధ అభివృద్ధి కార్యక్రమాలు పాల్గొనేందుకు ఆదిలాబాద్ వచ్చిన ప్రధానమంత్రికి తెలంగాణ గవర్నర్ తమిళిసై, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, ఇతర నేతలు స్వాగతం పలికారు. సోమవారం ఉదయం జిల్లాకు చేరుకున్న ప్రధానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి సీతక్క స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆదిలాబాద్ ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో నిర్వహించిన సభలో మోదీ పాల్గొన్నారు. పర్యటనలో భాగంగా మోదీ పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. రామగుండం ఎన్‌టీపీసీ పవర్ ప్లాంట్‌ను ప్రధాన మంత్రి జాతికి అంకితం చేశారు. ఒక ప్రధాన మంత్రి ఆదిలాబాద్‌కు రావడం 41 ఏళ్ల తర్వాత ఇదే తొలిసారి.

## రాష్ట్రాభివృద్ధిలో రాజీలేదు

మొదటిపేజీ తరువాయి..

ప్రజలకు మంచిది కాదని చెప్పారు. ఎన్నికలప్పుడే రాజకీయాలని, తరవాత అభివృద్ధి ఎజెండా కావాలన్నారు. పదేపదే ఘర్షణాత్మక వైఖరి వల్ల నష్టపోయేది రాష్ట్రాల ప్రజలేనని అన్నారు. తమ ప్రభుత్వం ఏర్పడ్డ తరవాత అనేక విషయాలను ప్రధాని దృష్టికి తీసుకని వెళ్లామన్నారు. రోణభూములు సహా అనేక విషయాలను పరిష్కరించారని అన్నారు. అదిలాబాద్‌లో పలు అభివృద్ధి పనులకు ప్రధాని మోదీ శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అభివృద్ధిలో రాష్ట్రానికికి మోదీ పెద్దన్న లాగా ఉన్నారని అన్నారు. రాష్ట్ర అభివృద్ధికి రక్షణ శాఖ భూములు ఇచ్చినందుకు సిఎం రేవంత్ రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. తమ రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం సహకారం మరింత కావాలని కోరారు. రాష్ట్రాన్ని మరింత ముందుకు తీసుకెళ్లడానికి అవసరమైన కార్యాచరణ తీసుకున్నామని అందుకు సహకరించాలని కోరారు. ఎన్టీపీసీకి రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా సహకరిస్తుందని చెప్పారు. 'మా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మొదటిసారి తెలంగాణకు వచ్చిన ప్రధానికి స్వాగతం.. గత ప్రభుత్వ నిర్ణయాలతో విద్యుత్ ఉత్పత్తిలో వెనకబడ్డాం.. విభజన చట్టంలో 4 వేల మెగావాట్లకు బదులు 1600 మెగావాట్ల విద్యుత్ మాత్రమే సాధించాం.. మిగిలిన 2,400 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి కేంద్రం సహకరించాలి' అని రేవంత్ రెడ్డి అన్నారు. కేంద్ర ప్రభుత్వంతో ఘర్షణ వైఖరి ఉంటే రాష్ట్రాభివృద్ధికి ఆటంకమని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఆదిలాబాద్‌లో వివిధ అభివృద్ధి పనులను సోమవారం ప్రధాని మోదీ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రధానితో పాటు గవర్నర్ తమిళిసై, సీఎం పాల్గొన్నారు. ఈ సందర్భంగా రేవంత్ మాట్లాడుతూ.. రాష్ట్ర అభివృద్ధికి కేంద్రంతో కలిసి ముందుకెళ్తామన్నారు. ఎన్నికల సమయంలోనే రాజకీయాలు చేయాలన్నారు. ఎన్టీపీసీకి కాంగ్రెస్ ప్రభుత్వం సహకరిస్తుందని చెప్పారు. కంటోన్మెంట్ స్థలాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి బదిలీ చేసినందుకు ప్రధానికి సీఎం కృతజ్ఞతలు తెలిపారు. పెద్దన్నలా మోదీ సహకారం అందించాలని కోరారు. సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ అభివృద్ధిలో సహకరిస్తున్న ప్రధాని మోదీకి కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ ప్రజల తరఫున ప్రధాని మోదీకి కృతజ్ఞతలు. ప్రాజెక్ట్‌లో మిగిలిన వాటికి అన్ని విధాలుగా సహకరిస్తాం. మా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మొదటిసారి తెలంగాణకు వచ్చిన ప్రధానికి సాదర స్వాగతం. గత ప్రభుత్వ నిర్ణయాలతో విద్యుత్ ఉత్పత్తిలో వెనుకబడ్డాం. కేంద్రంతో పదేపదే ఘర్షణాత్మకమైన వైఖరితో ఉంటే రాష్ట్ర అభివృద్ధి వెనుకబడు తుంది. రాష్ట్రాభివృద్ధి కార్యాచరణతో ముందుకెళ్తాం. మావైపు నుంచి ఎలాంటి భేషజాలు లేవు. గుజరాత్‌లా తెలంగాణ అభివృద్ధి చెందేందుకు మీ సహకారం కావాలి. ప్రధానమంత్రి అంటే మాకు పెద్దన్నలాంటివారు. విభజన చట్టంలో నాలుగువేల మెగావాట్లకు బదులు కేవలం 1600 మెగావాట్ల విద్యుత్ మాత్రమే సాధించాం. దేశంలో ఐదు ట్రిలియన్ ఎకానమీ సాధనకు తెలంగాణ సహకరిస్తుంది. కంటోన్మెంట్ రక్షణ శాఖ భూములను రాష్ట్రానికి బదలాయించారు.

ఇది తెలంగాణ అభివృద్ధిలో కీలకమైన స్కైవేల నిర్మాణానికి ఇది ఉపయోగ పడుతుంది. ఆదిలాబాద్‌కు నీళ్లు ఇవ్వాలంటే తుమ్మిడిహట్టి నిర్మించాలి. దీని కోసం భూసేకరణకు కావాల్సిన పరిహారాన్ని తెలంగాణ ప్రభుత్వం చెల్లిస్తుంది. రాష్ట్ర అభివృద్ధికి సహకరించండని కోరారు.

# విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలి..

మొదటిపేజీ తరువాయి..

వేలాది గురుకులాలు నిర్మించామని గత పాలకులు గొప్పగా చెబుతున్నారు. ఎక్కడా వాటికి శాశ్వత భవనాలు నిర్మించలేదు. వసతులు లేని అదె భవనాల్లో పేద విద్యార్థులు అవస్థలు పడ్డారు. రేషనైలేజేషన్ పేరిట కేసీఆర్ 6 వేల పాఠశాలలను మూసివేశారు. కులవృతుల వారి పిల్లలు ఆ పనులే చేసుకోవాలని భావించారు. పేదలు గొర్రెలు, బర్రెలు, చేపలు మాత్రమే పెంచాలనట్టుగా వ్యవహరించారు. ఆయన మనవడి పెంపుడు కుక్క చనిపోతే వెటర్నరీ డాక్టర్ మీద కేసీఆర్ కేసు పెట్టారని విమర్శించారు. అయితే ఉద్యోగాలు రాక ఆత్మహత్య చేసుకున్న వారు ఎన్ని కేసులు పెట్టాలో చెప్పాలన్నారు. నూతనంగా నియమించిన 5,192 మంది లెక్చరర్లు, టీచర్లు, కానిస్టేబుల్, మెడికల్ సిబ్బందికి ఎల్బీ స్టేడియంలో నియామక పత్రాలను రేవంత్ రెడ్డి అందజేశారు. నేను కూడా ప్రభుత్వ పాఠశాలల్లోనే చదువుకున్నా. నేను ఈ రోజు రాష్ట్ర ముఖ్యమంత్రి అయ్యానంటే నాడు ప్రభుత్వ పాఠశాలలో అందించిన విద్యనే కారణం. నేను గుంటూరులోనో, గుడివాడ లోనో చదువుకోలేదు.. గుంటూరులోనో, గుంటూరు మరెక్కడో చదువుకున్న కొందరు నాకు ఇంగ్లీష్ రాదని అవహేళన చేస్తున్నారు. చైనా, జపాన్, జర్మనీలో వారికి ఇంగ్లీష్ రాదు. కానీ ప్రపంచంతోనే పోటీపడే అభివృద్ధి, ఉత్పత్తులను ఆయా దేశాలు అందిస్తున్నాయి. ఇంగ్లీష్ అనేది ఓ భాష, ప్రపంచంలో ఉద్యోగం, ఉపాధికి ఉపయోగపడుతుంది. మా రోజుల్లో నాడు ఉన్న అవకాశాలను పట్టి మేం నేర్చినంత చదువులు నేర్చుకున్నాం. నేడు ప్రపంచంలో ఉద్యోగ అవకాశాలు వచ్చే ఇంగ్లీషును నేర్పండి. మీ దగ్గర చదువుకునే పిల్లలకు ఇంగ్లీష్ రాదని అవహేళన చేసే పరిస్థితి రావద్దు. మీ దగ్గర చదువుకునే పిల్లలకు మంచి భాషను, భావాన్ని దేశభక్తిని నేర్పండి. వారే రేపటి పాలకులు అవుతారు. రాష్ట్రంలో గురుకుల పాఠశాలలు ఇచ్చామని గత పాలకులు చెబుతున్నారు. వాటిలో ఎక్కడైనా మౌలిక వసతులు కల్పించారా? అందుకే మోడల్ గురుకుల పాఠశాల తీసుకురావాలని రూ.25 ఎకరాల్లో కొడంగల్ నియోజకవర్గంలో రూ.150 కోట్లతో ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ గురుకులాన్ని ఏర్పాటు చేస్తున్నాం' అని రేవంత్ రెడ్డి తెలిపారు. తెలంగాణ నిరుద్యోగులకు మూడు నెలల్లో 30 వేల ఉద్యోగాలిచ్చా మన్నారు సీఎం రేవంత్ రెడ్డి. ఎల్బీ స్టేడియంలో ఉద్యోగ నియామకపత్రాలు అందించే కార్యక్రమం జరుగుతోంది. ఇక్కడి నుంచే ఇంది రమ్మ పాలనకు శ్రీకారం చుట్టామన్నారు. ఎల్బీ స్టేడియం వేదికగా ఉద్యోగ నియామక పత్రాలు అందిస్తున్నా మన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం పెద్ద ఎత్తున ఉద్యోగాల జాతర నిర్వహిస్తోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. రాష్ట్రంలో దాదాపు 25 వేల మందికి ఉద్యోగ నియామక పత్రాలను ఇప్పటివరకు అందించారని చెప్పారు. గతంలో సంవత్సరాల తరబడి ఉద్యోగాల కోసం కొట్లాడేవారు.. ఇప్పుడు ప్రతి వారం ఏదో ఒక ఉద్యోగ నియామకాలు జరుగుతున్నాయని తెలిపారు. ప్రతిపక్షాలు ఎన్ని విమర్శలు చేసినా.. ఇచ్చిన హామీలను నెరవేరుస్తామని ధీమా వ్యక్తం చేశారు. ప్రతిపక్షాలు సోషల్ మీడియా ద్వారా ప్రభుత్వం పై తప్పుడు ప్రచారం చేసే ప్రయత్నం చేస్తున్నాయని విమర్శించారు. బీఆర్ఎస్ పదేళ్లపాటు గ్రూప్ 1 కి సంబంధించి ఒక్క నోటిఫికేషన్ ఇవ్వలేదని మండిపడ్డారు. కానీ కాంగ్రెస్ వచ్చిన మూడు నెలల్లోనే గ్రూప్ 1 నియామకానికి సంబంధించి నోటిఫికేషన్ ఇచ్చిందన్నారు. నిరుద్యోగులకి నోటిఫికేషన్లు ఇవ్వడంతోపాటు.. ఉచితంగా ఎగ్జామ్స్ లో ప్రిపేర్ అవ్వటానికి ప్రతి నియోజకవర్గంలో నాలెడ్జ్ సెంటర్ల ఏర్పాటు చేయబోతున్నామని తెలిపారు. కార్యక్రమంలో మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఎల్‌ఆర్ఎస్ ఉచితంగా అమలు చేయాలి

**ప్రభుత్వం నిర్ణయంపై 6న హైదరాబాద్‌లో ధర్నాలు**

**7న కలెక్టర్, ఆర్డీవోలను కలిసి ద వినతి పత్రాలు సమర్పణ**

**బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్ వెల్లడి**

హైదరాబాద్,మార్చి4(వెలుతురు): ఎల్ఆర్ఎస్‌పై తెలంగాణ సర్కార్ తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా బీఆర్ఎస్ పోరుబాటకు దిగింది. 6న అన్ని నియోజకవర్గాల్లో, హైదరాబాద్‌లో జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ కార్యాలయాల వద్ద రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలకు పిలుపునిచ్చింది. 7న జిల్లా కలెక్టర్, ఆర్డీవోలను కలిసి వినతి పత్రాలు సమర్పించాలని నిర్ణయించింది. ఈ సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజలపై ఆర్థిక భారం మోపడానికి కాంగ్రెస్ ప్రభుత్వం రంగం సిద్ధం చేసిందన్నారు. తాము తెచ్చిన పథకాలకు ఆనాడు అడ్డు చెప్పి ఇప్పుడు అవే పనులు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తోందన్నారు. ఎల్ఆర్ఎస్‌పై కాంగ్రెస్ నేతలు నాలుక మడతేశారని విమర్శించారు. తాము ఎల్ఆర్ఎస్ తెస్తే కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆనాడు కోర్టులో కేసు వేశారని గుర్తుచేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఎల్ఆర్ఎస్ రద్దు చేస్తామని భట్టి విక్రమార్క అన్నారని.. ఉచితంగా భూములు క్రమబద్ధీకరిస్తామని ఉత్తమ్ చెప్పారన్నారు. దోచుకోవడానికి ఎల్ఆర్ఎస్ తెచ్చారని సీతక్క కూడా అన్నారని తెలిపారు. ప్రజల నుంచి 20వేల కోట్లు భారం ప్రజలపై వేయడానికి ఎత్తుగడ వేశారని మండిపడ్డారు. ఎల్ఆర్ఎస్‌పై వేసిన పిల్ ఏమైంది కోమటిరెడ్డి అని ప్రశ్నించారు. భట్టి, సీతక్క కూడా ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఎల్ఆర్ఎస్‌పై ప్రభుత్వం వైఖరి మార్చుకోవాలని హితవుపలికారు. మార్చి31లోపు వసూలు చేయాలని టార్గెట్ పెట్టుకున్నారన్నారు. ఇచ్చిన మాట ప్రకారం ఎల్ఆర్ఎస్ ఉచితంగా చేయాలని డిమాండ్ చేశారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఒకలా అధికారంలో ఉన్నప్పుడు ఒకలా ఉన్న కాంగ్రెస్ వైఖరిని ప్రజలు గమనిస్తున్నారన్నారు. ఎల్ఆర్ఎస్‌కు నిరసనగా 6న అన్ని నియోజక వర్గాల్లో, హైదరాబాద్‌లో జీహెచ్ఎంసీ, హెచ్ఎంసడీ కార్యాలయాల వద్ద రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలు చేపడతామని. 7న జిల్లా కలెక్టర్, ఆర్డీవో లను కలిసి వినతి పత్రాలు ఇస్తామని, పార్టీ పక్షాన



న్యాయ పోరాటం కూడా చేస్తామని కేటీఆర్ వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా 2020 నుంచి పెండింగ్‌లో ఉన్న ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన పూర్తి చేసి మార్చి 31లోగా క్రమబద్ధీకరణ ప్రక్రియను ముగించాలని ఆయా శాఖలకు ఆదేశాలు జారీ చేసింది. ప్రజల నుంచి ఎలాంటి చార్జీలు లేకుండా ఎల్ ఆర్ ఎస్ కార్యక్రమం ద్వారా ప్లాట్ల రెగ్యులరైజేషన్ చేయాలని భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గతంలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ముఖ్యమంత్రి రేవంత్ తో సహా ఉప ముఖ్యమంత్రి, మంత్రులు అందరు కూడా ఎల్ఆర్ఎస్ రద్దు చేస్తామని, ప్రజల దగ్గర ఎలాంటి చార్జీలు వసూలు చేయకుండానే రెగ్యులరైజ్ చేస్తామని ఇచ్చిన హామీకి కట్టుబడి ఉండాలని కేటీఆర్ అన్నారు. గత ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ క్రమబద్ధీకరణ కోసం మార్గదర్శకాలు రూపొందించినప్పుడు, ఇదే కాంగ్రెస్ నేతలు అడ్డగోలుగా మాట్లాడిన విషయాన్ని కేటీఆర్ సాక్షాలతో సహా మీడియా ముందు ఉంచారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో కేటీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ రాష్ట్ర ప్రభుత్వం ఆగమేఘాల మీద మార్చి 31వ తేదీ లోపల ఎల్ఆర్ఎస్ డబ్బులు కట్టాలని దరఖాస్తుదారులకు నేరుగా ఫోన్ కాల్స్ చేయడం జరుగుతుందని, మరీ ఇది రాష్ట్ర ప్రజల రక్తాన్ని తాగడం కాదా అన్నారు. అప్పుడు ఉచితంగా క్రమబద్ధీకరిస్తామని తెలిపిన ఉత్తంకుమార్ రెడ్డి, ఈరోజు ప్రభుత్వం అడ్డగోలుగా రాష్ట్ర ప్రజల దగ్గర ఎల్ఆర్ఎస్ పేరుతో డబ్బులు లాక్కోవడం పైన స్పందించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా కాంగ్రెస్ పార్టీ ఎన్నికలలో గెలవడం కోసం అడ్డగోలుగా ఇచ్చిన హామీల అన్నింటిని తూ.చా తప్పకుండా అమలు చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఎల్ఆర్ఎస్ కార్యక్రమంలో భాగంగా దరఖాస్తు చేసుకున్న 25 లక్షల 44 వేలమంది లబ్ధిదారుల పైన కనీసం లక్ష రూపాయల చొప్పున భారాన్ని మోపేందుకు ఈ ప్రభుత్వం సిద్ధమైందన్నారు. మొత్తం రాష్ట్ర ప్రజల నుంచి ఈ ఎల్ఆర్ఎస్ ద్వారా 20వేల కోట్ల రూపాయలను దోచుకునేందుకు కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం సిద్ధమైందని విమర్శించారు. అధికారంలో లేనప్పుడు ఒక తీరుగా అధికారంలో ఉన్నప్పుడు మరొక తీరుగా మాట్లాడు తున్న కాంగ్రెస్ పార్టీ నేతలు, మంత్రుల వైఖరి పైన కేటీఆర్ తీవ్రంగా మండిపడ్డారు. నిరసన కార్యక్రమాల అనంతరం రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా ఎల్ఆర్ఎస్ ను అమలు చేయాలని కోరుతూ ప్రతి జిల్లా కలెక్టర్ కి, అర్డీవోలకు ఒక విజ్ఞాపన పత్రాన్ని కూడా అందిస్తామని కేటీఆర్ తెలిపారు. హైదరాబాద్ నగరంలో ప్రత్యేకంగా హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్మెంట్ అథారిటీ హెచ్ఎండిఏ) కార్యాలయం ముందు, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జిహెచ్ఎంసి) కార్యాలయం ముందు ప్రత్యేక నిరసన కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఇచ్చిన హామీ మేరకు ఎల్ఆర్ఎస్ కార్యక్రమంలో ఎలాంటి చార్జీలు వసూలు చేయబోమని ప్రకటించాలని, లేకుంటే భవిష్యత్తులో న్యాయస్థానాలను కూడా ఆశ్రయిస్తామని కేటీఆర్ హెచ్చరించారు.

# వినూత్న ఆవిష్కరణ ద్వారా ఆరోగ్య సంరక్షణ

## భారతదేశంలో మెడ్‌టెక్ విప్లవం

అనిష్ బఫ్నా,
CEO & MD, Healthium Medtech Ltd.మెడ్‌టెక్

హైదరాబాద్ వెలుతురు మార్చి 04:
ఆరోగ్య సంరక్షణ రంగంలో స్వావలంబన సాధించడానికి భారతదేశం వేగంగా అడుగులు వేస్తోంది. భారతదేశంలో వైద్య సంరక్షణ సంరక్షణ రంగం వైవిధ్యంగా ఉంది. దేశ అవసరాలకు అనువైన ఆరోగ్య సంరక్షణ చర్యలు అమలు చేయడంలో మెడ్‌టెక్ రంగం పాత్ర కీలకంగా ఉంటుంది. దేశ అవసరాలకు అవసరమైన పటిష్ట ఆరోగ్య వ్యవస్థ అభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన, స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధిలో మెడ్‌టెక్ రంగం సహకారం అందిస్తుంది. గత పది సంవత్సరాల కాలంలో మెడ్‌టెక్ రంగం అభివృద్ధికి భారత ప్రభుత్వం అనేక చర్యలు అమలు చేసింది. స్వదేశంలో నైపుణ్యాలను గుర్తించి ప్రోత్సహించడం, అంగం అభివృద్ధికి దోహదపడే విధానాల అమలు, పెట్టుబడులు ఆకర్షించడం కోసం ప్రభుత్వం కార్యక్రమాలు అమలు చేస్తోంది. ప్రభుత్వం అమలు చేస్తున్న చర్యలు, కార్యక్రమాలు వైద్య పరికరాల ఆవిష్కరణకు ప్రముఖ కేంద్రంగా భారతదేశాన్ని ప్రపంచ వేదికపైకి నడిపించే లక్ష్యంతో ఉన్నాయి.

మారుతున్న పరిస్థితుల నేపథ్యంలో భారతదేశం క్లిష్టమైన వైద్య సాంకేతికత అవసరాల కోసం విదేశాలపై ఎక్కువగా ఆధారపడటాన్ని తగ్గించాల్సిన ఆవశ్యకతను గుర్తించింది. ఈ మార్పు కేవలం ఆర్థిక స్వయం ప్రతిపత్తి కి సంబంధించిన అంశం మాత్రమే కాదు. ప్రాథమికంగా ఆరోగ్య సంరక్షణ సవాళ్లకు వేగంగా ప్రతిస్పందించే వ్యవస్థ సామర్థ్యాన్ని పెంపొందించడానికి, దేశ ప్రజల ఆరోగ్యం, శ్రేయస్సు సంరక్షణకు ఉపయోగపడుతుంది. ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలు భారతదేశ ఆరోగ్య సంరక్షణ రంగంలో కీలకమైన మార్పు సాధించడానికి దోహదపడతాయి. ఆరోగ్య రంగంలో స్వావలంబన సాధించడానికి ప్రభుత్వం చేస్తున్న కృషికి, చిత్తశుద్ధికి నిదర్శనంగా ఉన్నాయి.

### ఆవిష్కరణ మరియు సహకారాన్ని ప్రోత్సహించడం:

భారతదేశంలో మెడ్‌టెక్ రంగం సాధించిన అభివృద్ధి వెనుక స్వదేశీ ప్రతిభను గుర్తించడం, ప్రోత్సహించడం కీలక పాత్ర పోషించాయి. దేశంలో అవసరమైన మేధో సంపత్తి ఉందని ప్రభుత్వం గుర్తించింది. గుర్తించిన మేధో సంపత్తిని పెంపొందించడానికి, ఉపయోగించుకోవడానికి ప్రభుత్వం ఆవిష్కర్తలు, వ్యవస్థాపకులను ప్రోత్సహించడానికి పటిష్టమైన పర్యావరణ వ్యవస్థను అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం కారయ్క్రామ్రాలు రూపొందించి అమలు చేసింది. సహకారం కోసం వ్యూహాత్మక మద్దతు, మార్గదర్శకత్వం , మార్గాలను అందించడం ద్వారా మెడ్‌టెక్ విప్లవానికి మూలస్తంభంగా పనిచేసే ఆవిష్కరణల సంస్కృతిని ప్రోత్సహించి దేశంలో ప్రతిభావంతుల పూర్తి సామర్థ్యాన్ని వెలికి తీయడానికి చర్యలు అమలు చేసింది.

ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడానికి ప్రభుత్వం పలు కార్యక్రమాలు అమలు చేసింది. ఫార్మా, మెడ్‌టెక్ రంగంలో పరిశోధన, అభివృద్ధి కార్యకలాపాలను ప్రోత్సహించడానికి జాతీయ విధానం రూపొందించిన ప్రభుత్వం గ్లోబల్ హెల్త్ ఇన్నోవేషన్ ఫెలోషిప్ వంటి కార్యక్రమాలు అమలు చేసింది. ప్రతిభను పెంపొందించడానికి, సహకారాన్ని పెంపొందించడానికి, ఆరోగ్య సంరక్షణ రంగంలో ఆవిష్కరణలు ప్రోత్సహించడానికి భారతదేశంలో కార్యక్రమాలు అమలు జరుగుతున్నాయి. విద్యాసంస్థలు, పరిశ్రమలు , ప్రభుత్వం మధ్య సహకారాన్ని ప్రోత్సహించే పర్యావరణ వ్యవస్థను అభివృద్ధి చేయడం ద్వారా ఆవిష్కరణల వేగాన్ని వేగవంతం చేయాలని, కీలకమైన ఆరోగ్య సంరక్షణ సవాళ్లను పరిష్కరించాలని భారతదేశం లక్ష్యంగా పెట్టుకుంది. మెడ్‌టెక్ రంగంలో స్టార్టప్‌లు, ఆవిష్కర్తలను ప్రోత్సహించడానికి పటిష్ట వ్యవస్థను అభివృద్ధి చేయడానికి నైపుణ్య అభివృద్ధి, సామర్థ్య నిర్మాణం మరియు వ్యవస్థాపకత శక్తి కీలకంగా ఉంటాయి.

### మెడ్‌టెక్ ఆవిష్కర్తలకు సాధికారత:

దేశంలో మెడ్‌టెక్ ఆవిష్కర్తలకు సాధికారత కల్పించి, దిగుమతి చేసుకున్న వైద్య పరికరాలపై ఆధారపడటాన్ని తగ్గించడానికి రూపొందించిన వ్యూహాత్మక కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం ఇటీవల మెడ్‌టెక్ మిత్ర ప్లాట్‌ఫారమ్‌ను ప్రారంభించింది. సహకారాన్ని పెంపొందించడానికి, నైపుణ్యాన్ని పంచుకోవడానికి, మెడ్‌టెక్ స్టార్టప్‌లు, వ్యవస్థాపకులకు అందించడానికి అందించడానికి మెడ్‌టెక్ మిత్ర ప్లాట్‌ఫారమ్ కీలక వేదికగా పనిచేస్తుంది. వనరులు, మెంటర్‌షిప్, మార్కెట్ అవకాశాలకు ప్రాప్యతను సులభతరం చేయడం ద్వారా మెడ్‌టెక్ మిత్ర ప్లాట్‌ఫారమ్ ఆవిష్కరణను ప్రోత్సహించడానికి, స్వదేశీ మెడ్‌టెక్ పర్యావరణ వ్యవస్థ వృద్ధిని సాధించడానికి సిద్ధంగా ఉంది.

మెడ్‌టెక్ రంగం వృద్ధి, అభివృద్ధిని వేగవంతం చేసేందుకు ప్రభుత్వం పటిష్ట చర్యలు అమలు చేస్తోంది. వైద్య పరికరాల తయారీ రంగానికి పిఎల్ఐ పథకం అమలు చేయడం, వైద్య పరికరాల పార్కుల స్థాపనతో భారతదేశంలో మెడ్‌టెక్ రంగం గణనీయమైన అభివృద్ధి సాధించేందుకు సిద్ధంగా ఉంది. రాబోయే ఐదేళ్లలో రూ. 5,000 కోట్ల కేటాయింపులు ప్రతిపాదించడం ఫార్మా మెడ్‌టెక్ రంగాలలో ఆవిష్కరణలు, వృద్ధిని ప్రోత్సహించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది అన్న అంశం స్పష్టంగా తెలుస్తోంది. పెట్టుబడులు, వ్యవస్థాపకత, ఆవిష్కరణలకు అనుకూలమైనవాతావరణాన్ని అభివృద్ధి చేసి భారత దేశం వైద్య సాంకేతిక ఆవిష్కరణ, తయారీలో ప్రపంచ నాయకుడిగా ఎదగాలి అన్న లక్ష్య సాధన దిశగా భారతదేశం అడుగులు వేస్తోంది.

### నియంత్రణ వ్యవస్థ క్రమబద్దీకరణ :

మెడ్‌టెక్ రంగంలో భద్రత, సమర్థత, పారదర్శకత అంశాలలో అత్యున్నత ప్రమాణాలు సాధించాలని నిర్ణయించిన ప్రభుత్వం నియంత్రణ వ్యవస్థ క్రమబద్దీకరించింది. పటిష్టమైన నిబంధనలు అమలు చేయడం వల్ల వినియోగదారులకు నమ్మకం కుదురుతుంది. ఆవిష్క రణలు, పెట్టుబడికి అనుకూలమైన వాతావరణాన్ని పెంపొందిస్తుంది. నియంత్రణ మార్గదర్శకాలను ఖచిత్తంగా అమలు చేయడం వల్ల భారతదేశం ప్రజారోగ్య ప్రయోజనాలను కాపాడుతూ, ఆవిష్కరణలను ప్రోత్సహిస్తూ సున్నితమైన సమతుల్యతను సాధించడానికి అవకాశం కలుగుతుంది.

2017లో సవరించిన మెడికల్ డివైజెస్ రూల్స్ అమల్లోకి రావడంతో భారతదేశంలో పటిష్టమైన నియంత్రణ వ్యవస్థ పని చేయడం ప్రారంభించింది. వైద్య పరికరాల భద్రత, సమర్థత, పారదర్శకతను



నిర్ధారించే లక్ష్యంతో రూపొందిన ఈ నియమాలు వినియోగదారులకు మరింత రక్షణ కల్పించాయి. ఆరోగ్య సంరక్షణ ఉత్పత్తుల నాణ్యతపై నమ్మకాన్ని ఎక్కువ చేశాయి.

అంతేకాకుండా,ఇటీవల ఆమోదం పొందిన జాతీయ వైద్య పరికరాల విధానం వల్ల నిబంధనలను క్రమబద్ధీకరించడానికి, మౌలిక సదుపాయాలను పెంపొందించడానికి, వైద్య పరికరాల రంగంలో పరిశోధన, అభివృద్ధిని ప్రోత్సహించడానికి ప్రభుత్వ చేస్తున్న కృషికి నిదర్శనంగా ఉన్నాయి. నియంత్రణ ప్రక్రియలలో స్పష్టత, స్థిరత్వం, పారదర్శకతను అందించడం ద్వారా భారతదేశం మెడ్‌టెక్ పరిశ్రమలో ఆవిష్కరణ,పెట్టుబడికి అనుకూల మైన వాతావరణాన్ని అభివృద్ధి చేయాలని నిర్ణయించింది.

### వ్యూహాత్మక పెట్టుబడులు, ప్రోత్సాహకాలు:

గ్లోబల్ మెడ్‌టెక్ హబ్‌గా అభివృద్ధి సాధించడానికి చేస్తున్న ప్రయత్నాల్లో భాగంగా పెట్టుబడులను ఆకర్షించడానికి భారతదేశం ప్రాధాన్యత ఇస్తోంది. దీనిలో భాగంగా ప్రోత్సాహకాలను అందించడం, పరిపాలనా పరమైన ప్రక్రియలను క్రమబద్ధీకరించడం, మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడం ద్వారా దేశీయ, అంతర్జాతీయ పెట్టుబడిదారులకు ఆకర్షణీయమైన గమ్యస్థానంగా నిలిచింది. ఈ పెట్టుబడులు వృద్ధికి సహకరిస్తాయి. పరిశోధన, అభివృద్ధి, తయారీ ప్రయత్నాలకు దోహదపడతాయి. ప్రభుత్వం అమలు చేస్తున్న చర్యలు భారతదేశాన్ని మెడికల్ టెక్నాలజీ ఆవిష్కరణ రంగంలో ముందంజలో ఉంచుతాయి.

వైద్య పరికరాల రంగం అభివృద్ధి, ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి ప్రభుత్వం వివిధ ఆర్థిక ప్రోత్సాహకాలు అందిస్తూ అనేక పథకాలను అమలు చేసింది. మెడ్‌టెక్ రంగంలో పరిశోధన, సాంకేతికత సముపార్జన, తయారీ సామర్థ్యాలను ప్రోత్సహించడానికి మెడికల్ డ్రగ్ పార్క్‌లలో పెట్టుబడులతో పాటుగా ప్రొడక్షన్-లింక్డ్ ఇన్సెంటివ్ (PLI) పథకం లాంటి అనేక పథకాలు అమలు జరుగుతున్నాయి. ఈ కార్యక్రమాలు దేశీయ ఉత్పత్తిని ప్రేరేపించడమే కాకుండా ప్రపంచ మెడ్‌టెక్ మార్కెట్‌లో భారతదేశాన్ని పోటీతత్వశక్తిగా నిలబెట్టాయి. అంతేకాకుండా, కీలక రాష్ట్రాలలో వైద్య పరికరాల పార్కుల ఏర్పాటు చేయడం వల్ల మెడ్‌టెక్ ఆవిష్కరణ, తయారీకి అవసరమైన మౌలిక సదుపాయాలు, పర్యావరణ వ్యవస్థ మరింత అందుబాటులోకి వస్తాయి.

### అభివృద్ధికి చేయూత :

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతిష్టాత్మక ప్రణాళికలు ఫార్మా,మెడ్‌టెక్ రంగాల పథంలో పయనించడానికి వీలు కల్పించే విధంగా ఉన్నాయి. 5 సంవత్సరాల పాటు 5,000 కోట్ల రూపాయల ఖర్చుతో ప్రభుత్వం అమలు చేయనున్న పథకాలు అభివృద్ధి, ఆవిష్కరణల రంగం అభివృద్ధికి దోహదపడతాయి.

ఈ పథకం వల రూ. 17,000 కోట్ల అదనపు పెట్టుబడులు వస్తాయని ఆశిస్తున్నారు. దీనివల్ల భారతదేశ ఆరోగ్య సంరక్షణ సాంకేతికత, ఫార్మాస్యూటికల్ రంగాల్లో అపూర్వమైన పురోగతిని సాధిస్తాయి. 2030 నాటికి ఫార్మా పరిశ్రమకు $130 బిలియన్ల స్థాయికి తీసుకు వెళ్లడం లక్ష్యంగా ప్రభుత్వం కార్యక్రమాలు అమలు చేస్తోంది. ఆవిష్కరణ, వ్యవస్థాపకత అభివృద్ధికి అవసరమైన పర్యావరణ వ్యవస్థను అభివృద్ధి సాధించేలా చూసేందుకు ప్రభుత్వం తీవ్ర స్థాయిలో ప్రయత్నాలు చేస్తోంది.



# సంపాదకీయం..

## ఎన్నికలే లక్ష్యంగా బిజెపి ఎత్తులు!

సార్వత్రిక ఎన్నికలకు ముందు జరిగిన ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటి తనకు తిరుగులేదన్న సంకేతాలు ఇచ్చింది. ఈ ఫలితాలు సార్వత్రిక ఎన్నికలపై పెద్దా ప్రభావం చూపవని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే లాంటి వారు కొట్టి పారేసినా.. ప్రజల్లో నాటుకున్న భావనలను మాత్రం తోసిపుచ్చలేం. తాజా పరిస్థితులు, బిజెపి వేస్తున్న అడుగులు మరోమారు విజయంపై ధీమాలో కమలనాథులు ఉన్నారు.

బీజేపీకి జాతీయ స్థాయిలో మరింత బలాన్ని ఇచ్చింది. అలాగే రేపు జరగగబోయే వివిధ రాష్ట్రాల ఎన్నికలతో పాటు, సార్వత్రిక ఎన్నికలు కూడా బూస్ట్ కానుంది. తెలంగాణ లాంటి రాష్ట్రాల్లో ముున్ముందు మేలు చేస్తుందనే భావన ఉంది. ఈశాన్య రాష్ట్రాల ఫలితాలు దేశ రాజకీయాలను ప్రభావితం చేయలేక పోయినా.. దేశంలో అంతటా బిజెపికి బలం ఉందని చెప్పుకోవడానికి పనికి వస్తుంది. చిన్న రాష్ట్రాలనైనా గుప్పిట పెట్టుకోవాల్సిందే అన్నది బిజెపి రాజకీయం. దేశ రాజకీయాలు ప్రధానంగా ఉత్తర భారతదేశం చుట్టూనే తిరుగుతూ ఉంటాయి. కాబట్టే ఇటు ఈశాన్య రాష్ట్రాలను జాతీయ పార్టీలు పెద్దగా పట్టించుకోలేదు. అక్కడ లోక్‌సభ స్థానాలు కూడా చాలా తక్కువ కావడం అందుకు మరో కారణం. కానీ బిజెపి వచ్చాక ఈ చిన్న రాష్ట్రాల్లో కూడా పాగా వేయాలన్న లక్ష్యంతో పనిచేసింది. ఈ క్రమంలోనే తెలంగాణలో కూడా పాగా వేయాలన్న పట్టుదలతో పనిచేసి 8 అసెంబ్లీ సీట్లను సాధించింది. అందుకే తెలంగాణపై వచ్చే ఎంపి ఎన్నికల కోసం ప్రత్యేక దృష్టి సారించింది. ప్రధాని మోడీ ఇక్కడ అనేక అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభిం చడంలో ఔచిత్యం కూడా ఇదే. ఎపిలోనూ పాగా వేయకున్నా బలపడాలన్న పట్టుదలతో ఉంది. ఇక లిక్కర్ స్కామ్‌లో దూకుడు వెనక ఎమ్మెల్సీ కవితను కూడా ఇరుకున పెట్టే ప్రయత్నాలు సాగుతున్నాయి. అటు ఎపిలోనూ ఎంపి మాగుంట శ్రీనివాసులు రెడ్డి తనయుడిని చేర్చడం ద్వారా అక్కడా రాజకీయ లబ్ధి పొందే ప్రయత్నాల్లో బిజెపి ఉంది. ఢిల్లీ లిక్కర్ స్కాంలో సౌత్ గ్రూప్‌నకు డిప్యూటి సీఎం మనీష్ సిసోడియా సహకరించారని, సౌత్ గ్రూపులో కవిత కూడా ఉందని ఈడీ, సీబీఐలు చార్జ్ షీట్స్ కూడా దాఖలు చేశాయి. సిసోడియా ఆఫీసులోనే కొత్త మద్యం పాలసీ డ్రాఫ్ట్ తయారైందని సీబీఐకి పక్కా ఎవిడెన్స్ దొరికినట్లు ప్రచారం జరుగుతోంది. ఒకట్రెండు రోజుల్లో కవిత అరెస్ట్ తప్పదని బీజేపీ వర్గాలు బలంగా వాదిస్తున్నాయి. తెలంగాణలో బీఆర్ఎస్ పొత్తు తప్పకపోవచ్చన్న సంకేతాల కారణంగా దానిని నిర్వీర్యం చేయడం ద్వారా కాంగ్రెస్‌తో తలపడాలిన బీజేపీ యోచిస్తోంది. . కవిత అరెస్ట్ అయితే రాష్ట్రంలో బీజేపీ పుంజుకుంటుందా... బీఆర్ఎస్ అడ్వాంటేజ్ తీసుకుంటుందా, కాంగ్రెస్-బీఆర్ఎస్ కలిస్తే బీజేపీకి ఛాన్స్ ఉంటుందా... అన్నది వేరు విషయం. అయితే ప్రస్తుత సమీకరణాలను మాత్రం బిజెపి బాగా అధ్యయనం చేయడం ద్వారా రానున్న ఎన్నికల నాటికి బలోపేతం కావాలన్న లక్ష్యంతో పనిచేస్తోంది. వీటన్నింటిపై చర్చించేందుకే అమిత్ షా బీజేపీ రాష్ట్ర స్థాయిలో ఉన్న అగ్ర నాయకత్వాన్ని ఢిల్లీ పిలిపించి మాట్లాడినట్లు తెలుస్తోంది. అమిత్ షా రాష్ట్ర రాజకీయాల్లో తరచూ జోక్యం చేసుకుని ఎలా ముందుకు వెళ్లాలో సూచిస్తున్నారు. విచిత్రమేమంటే ఏడు దశాబ్దాల పాలనలో కాంగ్రెస్ అనుసరించిన సంస్కృతిని ప్రధానమంత్రి నరేంద్రమోద, అమిత్ షాలు అమలు చేస్తున్నారు. దర్యాప్తు సంస్థలను గుప్పిట్లో పెట్టుకోవడం, పార్టీల్లో సీనియర్లను పక్కన పెట్టడం, ముఖ్యమంత్రులను మార్చడం తదితర నిర్ణయాలన్నీ గతంలో కాంగ్రెస్ చేసిచూపింది. బిజెపి రాజకీయాల తీరు కాంగ్రెస్ సంస్కృతికి ఏ మాత్రం భిన్నంగా లేవనడానికి అనేక నిర్ణయాలు ఉదాహరణగా నిలుస్తాయి. ఈ మొత్తం వ్యవహారంలో అధికారమే లక్ష్యంగా మోడీ ద్వయం అడుగులు వేస్తోంది. మన్మోహన్ సింగ్‌ను కీలుబొమ్మ ప్రధానమంత్రిగా అభివర్ణించిన వారే మోడీ హయాంలో ఇప్పుడంతా కీలుబొమ్మలుగా మారారు.

మోదీ హయాంలో బిజెపి కూడా కాంగ్రెస్ మాదిరే అధిష్ఠానవర్గాన్ని అత్యంత బలోపేతంగా మార్చి ప్రజలు, వారు ఎన్నుకున్న ప్రజా ప్రతినిధుల అభిప్రాయానికి విలువలేకుండా నిర్ణయాలు తీసుకుంటున్నది. మోదీ హవా కూడా ఆయన ఆకర్షణ ఓట్లు తేగలిగినంత కాలమే సాగుతుంది. స్థానికంగా బలహీనులైన, కీలుబొమ్మలైన నేతలను ప్రోత్సహిస్తే కేంద్రం బలహీనపడ్డప్పుడు తదనుగుణంగా రాష్ట్రాల స్థాయిలో కూడా బిజెపి కుప్పకూలిపోతుంది. అయితే ఇకముందు ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటారన్న దానిపైనే భవిష్యత్ రాజకీయం ఆధారపడి ఉంటుంది. ఇకపోతే ఇటీవలి వరుస ఎన్నికల్లో బిజెపి మరింత బలపడుతుందే తప్ప బలహీనం కావడం లేదు. విపక్షాల్లో అనైక్యతే బిజెపి బలంగా మారింది. ఇండియా కూటమి బలహీనతపైనే జాతీయ రాజకీయాల్లో ఇప్పుడు ఇదే చర్చ సాగుతోంది. జాతీయ స్థాయిలో బీజేపీకి వ్యతిరేకంగా కూటమి ఏర్పాటు ప్రయత్నాలు బలపడడం లేదు. అంతా కాంగ్రెస్ చుట్టే తిరుగుతున్నాయి. బీజేపీకి వ్యతిరేకంగా గళం వినిపిస్తున్న పార్టీలు ఒక్క తాటిపైకి రావడానికి కసరత్తు కూడా పెద్దగా జరగడం లేదు. బిజెపిని వ్యతిరేకిస్తున్న పార్టీలన్నీ కూడా అవకాశం కోసం చూస్తున్నాయి. బిజెపిని నిలువరించాలని అనుకుంటున్న శక్తులను కూడగట్టాలని కాంగ్రెస్ నేత రాహుల్ చూస్తున్నారు. అన్ని ప్రాంతీయ పార్టీలు జట్టుగా బీజేపీపై రాజకీయ పోరాటం కోసం ఎజెండా సిద్ధం చేసే కసరత్తు చేస్తే తప్ప ఫలితం ఉండదు. బిజెపిని వ్యతిరేకిస్తున్న ప్రాంతీయ పార్టీలు లెక్కలు వేస్తున్నాయి. ప్రాంతీయ పార్టీల కూటమి ఏర్పాటుపై మరింత వేగం పెంచే అవకాశం కోసం చూస్తున్నాయి.

## భక్తులకు అండగా భగవంతుడు!

(ఆధ్యాత్మిక చింతన)

భగవంతుడు ఎల్లవేళలా తనయందు భక్తి కలిగిన వారికి ఏదో రూపంలో అండగా ఉంటూనే ఉంటారు. శరణాగతి కోరుకుంటే అభయం ఇస్తుంటాడు. భక్తితో తనను శరణు వేడుకున్న వారికి అండగా ఉంటానని మన పురాణాలు, ఉపనిశత్తులు చెబుతున్నాయి. మనం ఏ రూపంలో భక్తితో కొలిస్తే భగవంతుడు ఆ రూపంలో మనకు సాక్షాత్కరిస్తాడు. మానవుడు తాను కల్పించుకొనే మానవ సంబంధాలనే భగవంతునితో కల్పించు కొని... తద్వారా భగవంతునికి మరింత చేరువ కాగలడు. భగవంతునితో అవిచ్ఛిన్నమైన నిరంతర సాన్నిహిత్యం కలిగిన నాడు మానవుడు నిత్యానంద స్థితిని చేరుకుంటాడు. పురాణాలు, ఇతిహాసాల్లో ప్రహ్లాదాదులంతా ఇలాగే భక్తిని చాటారు. భగవంతుడు వారికి అండగా నిలిచాడు. అంటే భక్తికి భగవంతుడు వశమవుతాడన్నది సత్యం. ప్రతిఫలాపేక్ష లేకుండా తనను కొలువుమని గీతాచార్యుడు చెప్పాడు.



ఆధునిక కాలంలోనూ ఇదే పద్ధి కొనసాగుతోంది. గుడికి వెళ్లడం భక్తితో చేయాలని అంటారు. భగవంతుని మీద పరిపూర్ణమయిైన ప్రేమ కలిగి ఉండడమే భక్తి. అది అమృతానంద స్వరూపం. త్యాగరూపమైనది అయి ఏ కోర్కెలూ లేని స్థితిలో ఉండాలి. అదే మోక్ష అని నారద భక్తి సూత్రాలు చెబుతున్నాయి. భగవద్గీతలోని 'భక్తియోగం' భక్తి తత్త్వాన్నీ, లక్షణాల్నీ విపులంగా తెలిపింది. శ్రీమద్భాగవతం భగవద్భక్తుల లక్షణాలను, భక్తి స్వరూపాన్నీ సవిస్తరంగా ఆవిష్కరించింది. మానవునికి క్రోధం, శోకం లాంటి ఎన్నెన్నో అనుభూతులు ఉన్నా ప్రేమ లాంటి మధురమైన అనుభూతి మరేదీ లేదు! ప్రేమ పొందడం కన్నా ప్రేమించడం ఇంకా మధురం. మానవునికి స్వతహాగా ప్రేమించే లక్షణం ఉన్నా... ఆ ప్రేమ ఒక వ్యక్తికో, ఒక వస్తువుకో మాత్రమే పరిమితమవుతుంది. అప్పుడప్పుడు మాత్రమే కనిపిస్తూ, స్వార్థభావంతో కలుషితమౌతూ, విచ్ఛిన్నమైపోతూ ఉంటుంది. దీనినుంచి బయటపడి ప్రేమతత్వాన్ని అలవర్చుకుంటే భగవంతుడు వశమవుతాడని పురాణాలు చెబుతున్నాయి. నిష్కామంగా ప్రేమించడాన్ని సాధన చెయ్యాలి. ఈ జగత్తులో భగవంతుడు సర్వవ్యాప్తి. సమష్టి రూపమైన భగవంతుని పట్ల... సాధకులు చేసే 'నిష్కామప్రేమ' అనే ఈ ఉపాసనాక్రమానికి కూడా 'భక్తి' అనేదే వ్యవహార నామం. భక్తి సార్వజనీనం, భేదరహితం కావడంవల్ల నిజమైన భక్తిలో లోపాలు ఉండవు. అనంతమైన భగవత్తత్వానికి అనంతమైన కళ్యాణ గుణాలు, రూపాలు, నామాలు ఉన్నాయి! వాటిలో రాముడు, కృష్ణుడు, శివుడు, లలిత తదితర సంపూర్ణ దేవతామూర్తుల్ని ఉపాసనా సౌలభ్యం కోసం వేద, పురాణాలు మనకు అందించాయి. భక్తులు తమకు ఇష్టమైన ఒక దేవతా మూర్తిని స్వీకరించి, సమస్త దేవతలనూ, సమస్త జగత్తునూ ఆ మూర్తిలోనే ఉన్నట్టు భావించి, పరదేవతగా ఉపాసించడం ద్వారా భక్తిని కలిగి ఉండాలి. మనసు మరే ఇతర విషయాల మీద, ఇతర దేవతా రూపాల మీద కాకుండా... ఆ ఇష్టదేవతామూర్తి పైనే నిరంతరం లగ్నం కావాలి. భగవంతుడు అనేక విభూతులలో, అనేక కార్యాలు చేస్తూ, వేర్వేరు పేర్లతో, వేర్వేరు రూపాలతో, వేర్వేరు తత్త్వాలుగా కనిపిస్తాడు.

# రామేశ్వరం కేసులో ఎన్ఐఎ విచారణ

బెంగళూర్ వైట్ ఫీల్డ్‌లో బిజీగా ఉండే రామేశ్వరం కేఫ్ వద్ద ఇటీవల జరిగిన బ్లాస్ట్‌తో ఒక్కసారిగా కలకలం రేగింది. పేలుడు జరిగిన వ్యక్తి కోసం పోలీసు బృందాలు విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టాయి. సీసీటీవీ ఫుటేజీలో ఓ వ్యక్తిని గుర్తించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాయం ఆధారంగా అతనిని గుర్తిస్తామని పోలీసులు ప్రకటించారు. ఐఈడీ బాంబ్ పేలడం, బెంగళూర్ నడిబొడ్డున ఘటన జరగడంతో జాతీయ భద్రతా సంస్థ రంగంలోకి దిగింది. కేంద్ర హోం శాఖ ఆదేశాలతో ఎన్ఐఏ అధికారులు విచారణ ప్రారంభించారు. రామేశ్వరం కేఫ్ పేలుడుపై సర్వత్రా చర్చ జరుగుతోంది. పేలుడు ఘటనను సెంట్రల్ క్రైమ్ బ్రాంచ్ పోలీసులు విచారిస్తున్నారు. పేలుడు ఘటన విచారణను ఎన్ఐఏకు అప్పగించే అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వం పరిశీలిస్తుందని కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఆదివారం నాడు ప్రకటన చేశారు. ఆ వెంటనే కేంద్ర ప్రభుత్వం స్పందించింది.

పేలుడు ఘటనను ఎన్ఐఏకు ఇస్తూ కేంద్ర హోంశాఖ ఉత్తర్వులు జారీచేసింది. మార్చి 1వ తేదీ శుక్రవారం నాడు రామేశ్వరం కేఫ్ వద్ద పేలుడు జరిగింది. ఓ వ్యక్తి వచ్చి టిఫిన్ ఆర్డర్ చేశాడు. ఫుడ్ తీసుకొని టేబుల్ వద్దకొచ్చాడు. అక్కడ టిఫిన్, బ్యాగ్ వదిలి వెళ్లాడు. ఆ తర్వాతే పేలుడు జరిగింది. సీసీటీవీ ఫుటేజీ సోషల్ మీడియాలో తెగ చక్కర్లు కొట్టింది.

బ్రాండ్ బెంగళూరుని బాంబు బెంగళూరుగా మార్చారని, రామేశ్వరం కేఫ్ బాంబు పేలుడు కేసుని జాతీయ దర్యాప్తు సంస్థకు అప్పగించాలని బీజేపీ చేసిన వ్యాఖ్యలపై సీఎం సిద్ధరామయ్య తీవ్రంగా స్పందించారు. ఈ ఘటనపై ప్రస్తుతం సెంట్రల్ క్రైమ్ బ్రాంచ్ దర్యాప్తు జరుపుతోందని.. అవసరమైతే ఈ కేసుని ఎన్ఐఏకు అప్పగించే అంశాన్ని తమ ప్రభుత్వం పరిశీలిస్తుందని చెప్పారు. బాంబు పేలుడు లాంటివి చిన్న ఘటనలు కావని.. ఇలాంటి వాటిపై రాజకీయ ప్రేరేపిత ప్రకటనలు చేయడం బీజేపీ మానుకోవాలని గట్టిగా సూచించారు. బ్రాండ్ బెంగళూరుని బాంబు బెంగళూరుగా మార్చారని బీజేపీ చేసిన ఆరోపణలపై సీఎం సిద్ధరామయ్య స్పందిస్తూ.. 'బీజేపీ హయాంలో నాలుగు బాంబు పేలుళ్ల ఘటనలు చోటు చేసుకున్నాయి.

మరి దాన్ని ఏమని పిలవాలి? మంగళూరు కుక్కర్ పేలుడు జరిగినప్పుడు ఎవరు అధికారంలో ఉన్నారు? మల్లేశ్వరంలోని బీజేపీ కార్యాలయం ముందే పేలుడు సంభవించినప్పుడు, ఎవరు పాలిస్తున్నారు? అని విరుచుకుపడ్డారు. తాను బాంబు పేలుడు ఘటనకు మద్దతివ్వడడం లేదని, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నానని అన్నారు. కానీ.. దీనిపై బీజేపీ రాజకీయాలు చేయడం మానెయ్యాలని ఉద్ఘాటించారు.

బాంబు పేలుడు వంటివి సిల్లీ ఘటనలు కావని, ఇలాంటి సంఘటనలపై ప్రభుత్వాలు ఎప్పుడూ సీరియస్‌గానే చర్యలు తీసుకున్నాయని.. ప్రజల భద్రత చాలా ముఖ్యమని ఆయన నొక్కి చెప్పారు. ఇదే సమయంలో.. తన రాజకీయ ప్రయోజనాల కోసం బీజేపీ కర్ణాటక ప్రతిష్టను దిగజార్చిందని డిప్యూటీ సీఎం శివకుమార్ కూడా మండిపడ్డారు. రాజకీయ మైలేజ్ పొందడం కోసం ఈ అంశాన్ని బీజేపీ




వాడుకుంటోందని.. ఈ క్రమంలో బెంగళూరుతోపాటు కర్ణాటక ప్రతిష్టను దిగజార్చుతోందని ధ్వజమెత్తారు. బీజేపీ హయాంలో జరిగిన ఘటనల్ని వాళ్లు మరిచిపోయి ఉండొచ్చని, అయితే వాటిపై రాజకీయాలు చేయడం తనకు ఇష్టం లేదని అన్నారు. ఇలాంటి సమయాల్లో వారు దేశ ఐక్యత, సమగ్రత, శాంతి గురించి తెలుసుకోవాలని అన్నారు. బీజేపీ నాయకులకు ప్రాథమిక అవగాహన లేదని.. బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న వారెవరూ 'బాంబు బెంగళూరు' వంటి మాటలు మాట్లాడరని కౌంటర్ ఇచ్చారు.

# దక్షిణాదిలో అత్యధిక సీట్లు లక్ష్యం

దక్షిణాది రాష్ట్రాల్లో అత్యధిక సీట్లు సంపాదించడమే లక్ష్యంగా మోడీ అడుగులు వేస్తున్నారు. ఇప్పుడు పార్లమెంటు ఎన్నికలకు రంగం సిద్ధమైంది.అత్యంత బిజీ షెడ్యూల్‌లో కూడా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మూడు రోజుల పాటు దక్షిణాది రాష్ట్రాల్లో పర్యటనను పెట్టుకున్నారు. తెలంగాణ, తమిళనాడు, ఒడిశా, రాష్ట్రాలకు ఎనలేని ప్రాధాన్యం ఇచ్చారు. దీని వెనుక చాలానే వ్యూహం ఉందని పరిశీలకులు అంటున్నారు. తెలంగాణలో గత ఏడాది డిసెంబరులో అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. అధికారంలోకి రావాలని భారతీయ జనతా పార్టీ నిర్ణయించుకుంది. అయితే, అనూహ్యంగా ఈ వ్యూహం సక్సెస్ కాలేదు. కానీ, అనుకున్నస్థాయి కంటే కూడా ఎక్కువ స్థానాలు గెలుచుకుని.. బీజేపీ బలపడు తోందనే సంకేతాలు పంపించింది. మొత్తం తెలంగాణ 17 పార్లమెంటు స్థానాలు ఉన్నాయి. వీటిలోనూ ఎస్సీ, ఎస్టీలు ఉన్న ఆదిలాబాద్, ఖమ్మం, మహబూబ్‌నగర్ వంటి కీలకమైన లోక్ సభస్థానాలపై రాజకీయ పక్షాల దృష్టి ప్రధానంగా ఉంది. ఈ నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోడీ తెలంగాణలో పర్యటన.. పైగా ఆదివాసీలు ఎక్కువగా ఉన్న ఆదిలాబాద్‌లో 56 వేల కోట్ల రూపాయల అభివృద్ధిపనులకు శంకు స్థాపనలు వంటివి రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకున్నాయి. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో కనీసంలో కనీసం.. 17 స్థానాలకుగాను 10 చోట్ల అయినా విజయం దక్కించుకుని తీరాలన్న లక్ష్యాన్ని నిర్దేశిరచుకున్న దరిమిలా.. ప్రధాని పర్యటనకు అత్యంత ప్రాధాన్యం ఏర్పడింది. ఇక, ఆయన సోమవారం ఒక్కరోజుతోనే తన పర్యటనను ముగించుకోవడం లేదు. మంగళవారం మరోసారి తెలంగాణకు రానున్నారు. హైదరాబాద్ లో పలు అభివృద్ధి పనులకు మళ్లీ శ్రీకారం చుట్టనున్నారు. అదేవిధంగా సంగారెడ్డి జిల్లాలో కూడా ప్రధాని పర్యటిస్తారు. ఇదంతా కూడా ఎన్నికల వ్యూహంలో భాగంగానే జరుగుతున్న పర్యటనగా రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. తమిళనాడులోనూ ఈ సారి.. బలమైన పక్షంగా బీజేపీ ఎదగాలని నిర్ణయించు కుంది. ఈ రాష్ట్రంలో లోక్‌సభ స్థానాలు 39 ఉన్నాయి. గత 2019 ఎన్నికల్లో ఎన్డీయే కూటమి కేవలం ఒకే ఒక్క స్థానంలో విజయం దక్కించుకుంది. దీంతో వచ్చే ఎన్నికల నాటికి ఇక్కడ బలంగా పుంజుకోవాలని భావిస్తున్న బీజేపీ.. ప్రత్యేక దృష్టి పెట్టింది. కాశీ తమిళ సంగమం పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని కూడా నిర్వహించి.. ఇక్కడి వారిని కాశీకి తీసుకువెళ్లి విశ్వనాథుని దర్శనం చేయించడంతోపాటు.. వారితో ప్రధాని మమేకమయ్యారు. ఇక, కొన్నాళ్ల కిందట ప్రధాని మోడీ ఇక్కడ నుంచి పోటీ చేయాలని భావిస్తున్నట్టు వార్తలు వచ్చాయి. అయితే, ఆయన మూడోసారి కూడా వారణాసినే ఎంచుకున్నారు. డోలాయమానంలో ఉంది. సీఎం నవీన్ పట్నాయక్ వృద్ధుడు కావడం, అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటుండడం.. తమిళనాడుకు చెందిన ఓ ఐఏఎస్ అధికారినీ వీఆర్ ఎస్ తీసుకునేలా ప్రోత్సహించి ఆయనకు పార్టీ పగ్గాలు అప్పగించడం వంటి పరిణామాలు ఆసక్తిగా మారాయి. అయితే..దీనిని కొందరు



రేపు ఒకవేళ.. మరో నియోజకవర్గం నుంచి పోటీ చేయాలని బావిస్తే.. ఆల్టర్నేట్‌గా తమిళనాడునే ఎంచుకునే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రధాని తమిళనాడు పర్యటనకు అత్యంత ప్రాధాన్యం పెరిగింది. ఒడిశాలోనూ ప్రధాని పర్యటించనున్నారు. ఇక్కడ ఈ ఏడాది ఏపీతోపాటు అసెంబ్లీ ఎన్నికలు జరగను న్నాయి. పైగా ఇక్కడ బీజేపీకి తెలంగాణలో మాదిరిగా బలమైనవాయిస్ వినిపించే నాయకులు కూడా ఉన్నారు.

మరోవైపు.. అధికార బీజేడీలో నాయకత్వ పరిస్థితి జీర్ణించుకోలేక పోతున్నారు.

ఈ నేపథ్యంగా ఆ గ్యాప్‌ను తమకు అనుకూలంగా మార్చుకుని పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికల్లో మేలు చేకూర్చుకునే వ్యూహంతో ప్రధాని ఇక్కడ పర్యటనలకు షెడ్యూల్ ఖరారు చేసుకున్నారనేది పరిశీలకుల అంచనా. ఏదేమైనా.. మోడీ దక్షిణాది పర్యటనల వెనుక అతి పెద్ద వ్యూహమే ఉందని అంటున్నారు. మొత్తంగా ఈ మూడు రాష్ట్రాల్లో ఎక్కువ స్థానాలు సంపాదించడం లక్ష్యంగ ఆమోడీ పావులు కదుపుతున్నారు.

# మరోమారు బిజెపిదే అధికారం

### మోడీ నాయకత్వమే దేశానికి రక్ష

రాష్ట్రంలో బిజెపి కనీసం10,12 ఎంపి సీట్లు గెల్చుకుంటుందని నిజామాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. ప్రధాని మోడీ నాయకత్వమే దేశానికి రక్ష అన్నారు. బీజేపీలో ఘర్ వాపసి నడుస్తోందని.. బీజేపీలో పోటీ ఎక్కువగా ఉంటుందని ఎంపీ అర్వింద్ అన్నారు. ప్రధాని తెలంగాణ అభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారించారని మీడియాతో మాట్లాడుతూ.. అన్నారు. ఇతర పార్టీల వారంతా ఇప్పుడు బిజెపి వైపు చూస్తున్నారని అన్నారు. పార్లమెంటు ఎన్నికల కోసం పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉన్నాయన్నారు. మూడో సారి కూడా కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. మోడీ మూడోసారి ప్రధాని కానున్నారు.. మోడీ ప్రపంచ దిశానిర్దేశకుడన్నారు. రాజకీయ నాయకుడనే మాటకు అర్థాన్ని మార్చేసిన నేత మోడీ అని ఎంపీ అర్వింద్ పేర్కొన్నారు. నిజమాబాద్ పార్లమెంటులో 5 లక్షల స్వయం సహాయక సంఘాలకు కోట్లాది రూపాయల రుణాలు ఇచ్చామన్నారు. 7 లక్షల పైన ఆయుష్మాన్ భారత్ కార్డులిచ్చామ న్నారు. మహిళా సంఘాలకు రాష్ట్ర ప్రభుత్వం ఒక్క పైసా కూడా ఇవ్వటం లేదని మండిపడ్డారు. దేశ వ్యాప్తంగా బీజేపీకి 68 శాతం ఓట్లున్నాయన్నారు. ఉత్తర భారతదేశంలో కాంగ్రెస్‌కు ఒక్క పార్లమెంటు సీటు కూడా రాదన్నారు. తెలంగాణలో 10 పార్లమెంటు స్థానాల్లో బీజేపీ గెలుస్తుందని అన్నారు.నిజామాబాద్ మార్కెట్లో పసుపు రేటు రూ.13999 గా ఉందని.. పసుపు రేటు మరింత పెరుగుతుందని తెలిపారు. గత 2 ఏళ్లుగా పసుపు రైతులకు మేలు చేసేలా స్పైసీస్ బోర్డు, పసుపు బోర్డు పని చేస్తోందన్నారు. కేంద్రం పసుపు ఎగుమతులు పెంచటం ద్వారా రైతులకు మంచి ధరలు వస్తున్నాయని తెలిపారు. ప్రధాని మోడీ చొరవతో పసుపు రైతులకు మేలు చేకూరనుందన్నారు. తెలంగాణలో సాగవుతున్న పసుపు ప్రపంచ దేశాలకు ఎగుమతి అవుతోందని తెలిపారు. దేశ ముఖ చిత్రాన్ని మార్చే సత్తా బీజేపీకి ఉందని ఎంపి అన్నారు.కాంగ్రెస్ పాలనలో అనేక గ్రామాలు అధ్వాన్నంగా తయారయ్యాయని చెప్పారు. రోడ్లు, తాగు నీరు సౌకర్యాలు లేక ప్రజలు అవస్థలు పడుతున్నారని మండిపడ్డారు. సర్కారు వారిని బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. దేశంలో రూ.2 లక్షల కోట్లతో రోడ్లను ఎక్స్ ప్రెస్ హైవేలుగా నిర్మిస్తున్నామని చెప్పారు. రవాణా సౌకర్యాలు



ఆస్పత్రులు అందుబాటులో లేక అనేక గ్రామాలు ఖాళీ అయ్యాయని అన్నారు. రోడ్ల నిర్మాణాల కోసం ప్రధాన మంత్రి గ్రామ సడక్ యోజన అందుబాటులోకి తెచ్చారని చెప్పారు. విమానాలకు ఇంధనం అందించే సత్తా మన రైతుల్లో ఉందని అన్నారు. రైతులకు ఆర్థిక చేయూతనిచ్చి మెరుగుపడినప్పుడే వ్యాపార, వాణిజ్య రంగాలు టూరిజం అభివృద్ధికి దోహద పడుతాయని తెలిపారు. తెలంగాణలోనూ ప్రభుత్వం ఏర్పాటు చేస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. కాంగ్రెస్.. బీఆర్ఎస్ పాలనలో అవినీతి అక్రమాలు తప్ప ప్రజా సంక్షేమం కనిపించడం లేదని ధ్వజమెత్తారు.



## నూతన విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు...

**కూకట్‌పల్లి, వెలుతురు:** సీజీఎం ఈ ఆర్ సాయి బాబా ఆదేశాల మేరకు రాబోయే ఎండాకాలం దృష్టిన పెట్టుకొని ట్రాన్స్ఫారం కెపాసిటీలను పెంచడం జరిగింది. సమ్మర్ యాక్షన్ ప్లాన్ లో భాగంగా సోమశిల సబ్ స్టేషన్‌లో 8 ఎంవిఏ ట్రాన్స్ ఫారం ను మార్చి 12.5 ఎంవిఏ ట్రాన్స్ ఫారం ను ఏర్పాటు చేయటం జరిగిందనీ ఎలక్ట్రికల్ అధికారులు తెలియజేశారు. ఎండాకాలం విద్యుత్ వినియోగం పెరగడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సి జి ఎం ఈ ఆర్ సాయిబాబా, ఎస్ ఈ పి ఆర్ డి ఎస్ మోహన్, డి ఈ ఆపరేషన్ కూకట్ పల్లి విఆర్ చక్రవర్తి, భక్తవత్సల్ రెడ్డి, అశోక్, లోకల్ ఏఈ శరత్ బాబు, చైతన్య, కరణ్ కుమార్, పాపిరెడ్డి నగర అధ్యక్షులు చంద్రారెడ్డి, జనరల్ సెక్రెటరీ భగవంతు రెడ్డి, శరత్ రెడ్డి, పాండుగౌడ్ కాలని వాసులు తదితరులు పాల్గొన్నారు.

## ఈటెల రాజేందర్‌కి సంపూర్ణ మద్దతు

### - వడ్డేపల్లి రాజేశ్వర్ రావు..

**కూకట్‌పల్లి, వెలుతురు:** మల్కాజిగిరి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థిగా నియమితులైన ఈటెల రాజేందర్ కి తమ సంపూర్ణ మద్దతి ఉంటుందని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు అన్నారు. సోమవారం వివేకానంద నగర్ కాలనీలోని వడ్డేపల్లి రాజేశ్వర్ రావు నివాసంలో మాజీ మంత్రి, మల్కాజిగిరి పార్లమెంట్ బిజెపి పార్టీ అభ్యర్థి ఈటెల




రాజేందర్ వడ్డేపల్లి రాజేశ్వర్ రావుని కలిశారు.

ఈ సందర్భంగా రాజేశ్వరరావు మాట్లాడుతూ మల్కాజిగిరి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థిగా నియమితులైన ఈటెల రాజేందర్ కి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం శాలువాతో సత్కరించారు. ఈటెల రాజేందర్ కి తన సంపూర్ణ మద్దతు ఉంటుందని, మల్కాజిగిరి ఎంపీ గా ఈటెల రాజేందర్ ని గెలిపించి మోడీకి బహుమతిగా అందిస్తామని అన్నారు. బీజేపీ కార్యకర్తలు, నాయకులు కలిసికట్టుగా పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కూకట్ పల్లి నియోజకవర్గ ఇంచార్జ్ మాధవరం కాంతారావు, వడ్డేపల్లి శ్రీనివాస రావు, కంటెస్టెడ్ కార్పొరేటర్ నాయినేని పవన్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వపరంగా నారాయణ కుటుంబాన్ని ఆదుకుంటాం...

### కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్

**కూకట్ పల్లి వెలుతురు:** ప్రమాదవశాత్తు మృతి చెందిన సెంట్రింగ్ కార్మికుడు నారాయణ కుటుంబాన్ని ప్రభుత్వపరంగా ఆదుకుంటామని కూకట్ పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ హామీ ఇచ్చారు. మూసాపేట వాస్తవ్యుడైన సెంట్రింగ్ కార్మికుడు జి నారాయణకు కరెంట్ షాక్ తగలడంతో గత నెల ప్రమాదవశాత్తు మృతి చెందాడు. వారి కుటుంబ సభ్యులు బండి రమేష్ ని కలవగా బిల్డర్ తో మాట్లాడి 15 లక్షల రూపాయలను నారాయణ కుటుంబ సభ్యులకు ఇప్పించారు. దీంతో నారాయణ కుటుంబ సభ్యులు



డబ్బులు ఇప్పించినందుకు కృతజ్ఞతగా సోమవారం కుటుంబ సభ్యులు బండి రమేష్ ను కలిశారు. తమ కుటుంబాన్ని సకాలంలో ఆదుకున్నందుకు బండి రమేష్ తో పాటు కూకట్ పల్లి మాజీ అధ్యక్షులు

శేరి సతీష్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొప్పిశెట్టి దినేష్ కుమార్, సయ్యద్ బాబులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ప్రభుత్వపరంగా నారాయణ కుటుంబాన్ని ఆదుకుంటామని ఇందిరమ్మ పథకం ద్వారా ఇల్లు ఇప్పించేందుకు కాంగ్రెస్ పార్టీ తరఫున కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తూము సంతోష్ కుమార్, విట్టల్ రెడ్డి, ఏ బ్లాక్ అధ్యక్షురాలు రేష్మ, నాగమల్లి, మూసాపేట్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా తొండ యాదయ్య జన్మదినోత్సవం

**శంకర్‌పల్లి మార్చి 4 (వెలుతురు):** అంబేద్కర్ అవార్డు గ్రహీత తొండ యాదయ్య జన్మదిన సందర్భంగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శంకర్పల్లి ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి ఎండి జిలాని భాష, ఆదాబ్ హైదరాబాద్ రిపోర్టర్ అమర్,




అంబేద్కర్ యువ సంఘం నాయకులు నవీన్, శ్రీనివాస్, యాదయ్య, గణపురం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# టంగుటూరు గ్రామంలో విషాదం

### ముగ్గురు పిల్లలను చంపి, తాను ఆత్మహత్య చేసుకున్న వ్యక్తి

**శంకర్‌పల్లి, మార్చి 04 (వెలుతురు):** మండల పరిధిలోని టంగుటూరు గ్రామంలో నీరటి రవి ఆర్థిక ఇబ్బందులతో తన ముగ్గురు పిల్లలను చంపి, ఆపై తాను ఆత్మహత్య చేసుకున్నాడు.

వివరాల్లోకి వెళితే టంగుటూరు గ్రామానికి చెందిన నీరటి రవి కుమార్ ప్రైవేటు ఉద్యోగం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించు కునేవాడు. గత రెండు సంవత్సరాల క్రితం ఆంధ్రప్రదేశ్ లోని విజయనగరం జిల్లా రాజాంలోని జి ఎస్ ఎన్ ఫౌండేషన్ నిర్వహించే వ్యక్తులతో పరిచయం ఏర్పడినట్టుగా సమాచారం. ఆంధ్ర ప్రాంతానికి చెందిన తిరుపతిరెడ్డి ప్రోద్బలంతో జీఎస్ఎన్ ఫౌండేషన్ పేరిట గ్రామాల్లో నేరేడు రవికుమార్ డబ్బులు వసూలు చేశాడు. రూ. 1 లక్ష కడితే, నెల తర్వాత డబ్బు ఇచ్చిన వ్యక్తికి రూ. 50 వేలు ఇచ్చేయవాడని సమాచారం. 50వేల రూపాయలను ప్రతినెల సంవత్సరం వరకు చెల్లించేవాడట. తీసుకున్న డబ్బులకు ఐదు రెట్లు ఎక్కువ చెల్లించడంతో కొన్నాళ్లపాటు అంతా బాగానే సాగిందని, ఒక్కొక్కరి దగ్గర ఎలా పడితే అలా లక్షలాది రూపాయలు తీసుకున్నాడని, డబ్బులు ఇచ్చే వారు కూడా ముందు వెనకాల ఆలోచించకుండా ఇచ్చారని





సమాచారం. సుమారుగా రూ. 70-75 కోట్ల రూపాయలు వసూలు చేసి ఫౌండేషన్ ను టర్న్ ఓవర్ చేస్తున్నట్టుగా సమాచారం. కాగా తీసుకునే డబ్బులను మొదటగా 12 నెలల వరకు ఆ తర్వాత రెండు నెలలు తగ్గించుకుంటూ వచ్చాడని, తర్వాత తీసుకున్న డబ్బులను మూడు నెలల వరకు ఇస్తానని ఒప్పందం కుదుర్చుకున్నాడట. అయితే తీసుకున్న డబ్బులు మొదట బాగానే చెల్లించాడని, ఆ తర్వాత నే ఇబ్బంది ఏర్పడడంతో డబ్బులు ఇచ్చిన వాళ్ల డబ్బులు తిరిగి ఇవ్వమని ఒత్తిడి చేయడంతో, ఎటు తోచక భార్య ఇంట్లో లేకపోవడంతో, ముగ్గురు పిల్లల్ని చంపి, ఆపై తాను ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సంఘటన స్థలాన్ని నార్సింగి ఏసిపి రమణ గౌడ్, మోకిలా సిఐ వీరబాబు, శంకర్ పల్లి సిఐ వినాయక రెడ్డి, శంకర్ పల్లి డి ఐ ఇన్స్పెక్టర్ నాగరాజు మరియు ఎస్సైలు కోటేశ్వరరావు, సంతోష్ రెడ్డిలు పరిశీలించి ఆధారుల సేకరించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నలుగురు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మోకిల పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు.

అనవసరమైన స్కీంలో జోలికి పోయి, డబ్బులను వృథా చేసుకోవద్దని, నిండా మునిగి, ఆత్మహత్యల వరకు జీవితాన్ని తెచ్చుకోవద్దని పోలీసులు కోరుతున్నారు.

# ప్రభుత్వ భూముల్లో వెలిసిన అక్రమ నిర్మాణాలను తొలగించాలి..

### ప్రజావాణిలో ఫిర్యాదు : బీజేవైఎం నేషనల్ ఆఫీస్ కోఆర్డినేటర్ కుమార్ యాదవ్

**ఆల్విన్ కాలనీ, వెలుతురు:** ఆల్విన్ కాలనీ డివిజన్ అధ్యక్షులు కమలాకర్ రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక బిజెపి నాయకులతో కలిసి బీజేవైఎం నేషనల్ ఆఫీస్ కోఆర్డినేటర్ కుమార్ యాదవ్ సర్వేనెంబర్ 57, 336 గల ప్రభుత్వ భూముల్లో వెలసిన అక్రమ నిర్మాణాలను తొలగించాలని కోరుతూ జిహెచ్ఎంసి ప్రజావాణిలో జోనల్ కమిషనర్ అభిలాష అభినవ్ కి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బిజెపి నాయకులు మాట్లాడుతూ ఆల్విన్ కాలనీ డివిజన్ లో ఉన్న వందలాది ఎకరాల ప్రభుత్వ భూములను ప్రైవేటు వ్యక్తులు కబ్జా చేసి అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని వెంటనే అక్రమ నిర్మాణాలు తొలగించి ప్రజలకు ఉపయోగకరమైన ప్రభుత్వ దావఖాన, క్రీడా స్థలము, మహిళా భవన్, స్కిల్ డెవలప్మెంట్ సెంటర్లు, ప్రభుత్వ జూనియర్ %డ% డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని జిహెచ్ఎంసి జోనల్ కమిషనర్ ని కోరారు. అక్రమ నిర్మాణాలు చేపడుతున్న వ్యక్తులపై, సహకరిస్తున్న అధికారులపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కమిషనర్ ని కోరినట్లు తెలిపారు. వెంటనే జోనల్ కమిషనర్ స్పందించి వీలైనంత త్వరగా రెవెన్యూ అధికారులతో మాట్లాడి సర్వే చేపట్టి ప్రభుత్వ భూములను కాపాడేలా కృషి చేస్తామని అన్నారు. అలాగే మహంకాళి నగర్ కాలనీలో నెలకొన్న డ్రైనేజీ, రోడ్లు మంచినీటి సమస్యలు, చెరువుల్లో గుర్రపు డెక్క తీసివేత మరియు దోమల సమస్య, అలాగే హిందూ స్మశాన వాటిక సమస్యలు కూడా వారి దృష్టికి తీసుకుపోగా వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి వీలైనంత త్వరగా పరిష్కారం చేస్తామని అన్నారని నాయకులు



తెలిపారు.


ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు రామరాజు, సీనియర్ నాయకులు కేశవరావు, అరుణ్ కుమార్,మణిభూషణ్, డివిజన్ నాయకులు రఘు, సంతోష్, ప్రకాష్,శ్రీనివాస్ రెడ్డి, మహిళా నాయకురాలు అనూష,జ్యోతి, మహంకాళి నగర్ కాలనీ వాసులు, జయ నగర్ కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామపంచాయతీ బిల్డింగ్ నిర్మాణ పనులను త్వరలో పూర్తి చేయాలి

### జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి

**వికారాబాద్ జిల్లా (ప్రతినిధి వెలుతురున్యూస్):** జిల్లా లో గ్రామా పంచాయతి బిల్డింగ్ నిర్మాణ పనులు పూర్తి చేసి గ్రామా ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులకు జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి ఆదేశించారు. సోమ వారం ఉదయం టెలి కాన్ఫరెన్సు ద్వారా జిల్లా లో జరిగే అభివృద్ధి నిర్మాణ పనులలో గ్రామా పంచాయతి బిల్డింగ్ లేకుండ గ్రామా పంచాయతి ఉండకూడదని, నిర్మాణ పనులలో జాప్యం జరుగకుండా ప్రతి రోజు జరగాల్సిన పనులకు ఎన్ని మిల్లర్లు, ఎంత మంది లేబర్ ఉంటె పనులు త్వరగా పూర్తి చేయవచ్చు అనే విదంగా ముందుకెళ్ళాలని, అంచనా ప్రకారము పూర్తి చేయాలనీ అధికారులకు ఆదేశించారు.

బొమ్రాష్ పెట్, కోడంగల్ మండల లో సి సి రోడ్ల నిర్మాణ



పనులు ఎక్కడ కూడా ఆగ కుండ పనులు జరగాలని, ప్రతి గ్రామ పంచాయతి బిల్డింగ్స్, స్కూల్స్ కాంపౌండ్ వాల్స్, కిచెన్ షేడ్స్ నిర్మాణ పనులు ఏవైతే ముందే ప్రారంభించి పూర్తి కాని పనులను సత్వరమే పూర్తి చేసి , పూర్తి అయిన వాటికీ తప్పని సరిగా ఎఫ్ టి ఓ జనరేట్ చేయాలనీ అధికారులకు ఆదేశించారు. జిల్లాలో సి సి రోడ్లకు మంజూరైన నిదులతో అంచనాలను రూపొందించుకొంటూ సి సి రోడ్ల నిర్మాణ పనులను వేగవంతం చేసి నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయలని అధికారులకు ఆదేశించారు.

సంబంధిత కాంట్రాక్టరల తో మాట్లాడి లేబర్ ను సమీకరించి పనులు పూర్తి అయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. టెలి కాన్ఫరెన్సు లో పంచాయతీరాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ లు డి ఇ లు సంబంధిత శాఖ అధికారులు పాల్గొన్నారు.

# ప్రశాంత వాతావరణంలో ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు


### జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి (వెలుతురు న్యూస్ ):** ప్రశాంత వాతావరణంలో ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలను నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి తెలిపారు. సోమవారం జిల్లాలో పరిగి మండలం విజ్ఞాన్ జూనియర్ కళాశాలలో పరీక్షా కేంద్రాన్ని ఆయన తనిఖీ చేసారు. కేంద్రంలో సీసీ కెమెరాలు, వసతులు, పరీక్షా నిర్వహణ తీరును ఆరా తీశారు. ఈ సందర్భంగా పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తున్నామని, ప్రశాంత వాతావరణంలో పరీక్షలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ కు అధికారులు వివరించారు. విద్యార్థులు మాస్ కాపీయింగ్ కు పాల్పడకుండా ఇన్విజిలేటర్లు కఠినంగా వ్యవహరించాలని కలెక్టర్ ఆదేశించారు.

పరీక్ష కేంద్రంలోకి విద్యార్థులు సెల్ ఫోన్లు తీసుకురాకుండా చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు.

పరీక్షా కేంద్రంలో మొత్తం 267 మంది విద్యార్థినీ విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా, 261 మంది విద్యార్థులు పరీక్ష కు హాజరయ్యారని, 06 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు సంబంధిత అధికారులు కలెక్టర్ కు తెలియజేశారు. ఏం ఆర్ ఓ ఆనంద రావు, కళాశాల ప్రిన్సిపల్ అంజయ్య చీఫ్ సుపరింటెన్డెంట్ మక్బూల్, డి ఓ లక్ష్మయ్య తదితరులు ఉన్నారు.





## రామోజీ ఫిలిం సిటీలో సీఎం రేవంత్ రెడ్డి

**అబ్దుల్లాపూర్మెట్, వెలుతురు:**
తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సోమవారం నాడు రామోజీ ఫిల్మ్ సిటీ కి విచ్చేసిన సందర్భంగా వారికి పుష్పగుచ్ఛం అందచేసి మర్యాద పూర్వకంగా స్వాగతం పలికిన ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి అనంతరం రామోజీ గ్రూప్ సంస్థల చైర్మన్ రామోజీరావు తో భేటీ కావడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు వేం నరేందర్ రెడ్డి,కాంగ్రెస్ నేతలు మల్ రెడ్డి రాంరెడ్డి, చిలుక మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

## సునీత మహేందర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన నవాబుపేట్ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు మీనేపల్లి శివప్రసాద్

**వికారాబాద్ ప్రతినిధి (వెలుతురు న్యూస్):**
వికారాబాద్ జిల్లా జడ్పీ చైర్ పర్సన్ సునీత మహేందర్ రెడ్డిని నవాబ్పేట్ మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు మీనేపల్లి శివప్రసాద్ కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి మర్యాదపూర్వకంగా



కలిశారు. సోమవారం హైదరాబాదులోని సునీత మహేందర్ రెడ్డి నివాసంలో శివప్రసాద్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మండలం కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు మీనేపల్లి శివప్రసాద్ మాట్లాడుతూ, వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో సునీత మహేందర్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపిస్తామని పేర్కొన్నారు.యాదగిరి అత్తాపూర్ గ్రామ అధ్యక్షులు,వెంకట్ నాగిరెడ్డి పల్లి గ్రామ అధ్యక్షులు, అనిల్ నాయక్ కేశపల్లి గ్రామఅధ్యక్షులు,గోపాల్,శ్రీనివాస్, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

## నిరుపేద కుటుంబానికి అండగా నిలిచిన కాంగ్రెస్ నాయకులు ఫార్మర్ ఫస్ట్ ఫౌండేషన్ చైర్మన్ చక్రధర్ గౌడ్

**నంగునూర్ మండలం, వెలుతురు మార్చ్04:**
సిద్ధిపేట జిల్లా నంగునూర్ గ్రామంలోని ఒక నిరుపేద కుటుంబానికి చెందిన నీల ఇస్తారి గుండే పోటు కారణంగా ఫిబ్రవరి 25 రోజున మరణించిన వార్త చక్రధర్ గౌడ్ కి తెలియజేయగా వారు దశదినకర్మకు ఒక క్వింటాలు బియ్యం 10,000/- రూపాయల ఆర్థిక సహాయం అందించిన



కాంగ్రెస్ నాయకులు ఫార్మర్ ఫస్ట్ ఫౌండేషన్ చైర్మన్ చక్రధర్ గౌడ్ వారు మాట్లాడుతూ కుటుంబ పెద్దదిక్కు హటాత్తు మరణం చెందడంతో కుటుంబం రోడ్డున పడకూడదని ఆర్థికంగా సహాయం అందించానని వారి కుటుంబానికి ప్రగాడ సానుబుతి తెలిపి అండగా ఉంటానని హమి ఇచ్చారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఫార్మర్ ఫస్ట్ ఫౌండేషన్ సభ్యులు తదితరులున్నారు.

## ఆలోచన

అనగనగా మాందాబాద్ అనే ఊరిలో సీత, గీత అనే ఇద్దరు స్నేహితులు ఉండేవారు. వాళ్లు ఒక రోజు బడికి వెళ్తుంటే దారిలో కొన్ని డబ్బులు కనిపించాయి. వారిద్దరూ ఆ డబ్బులను తీసుకున్నారు. దారిలో వచ్చి పోయే వాళ్లను ఈ డబ్బులు మీవా అని అడగసాగారు. ఎవ్వరు కూడా మావి కాదు. మావి కాదు. అంటూ వెళ్లిపోయారు.

వాళ్ళిద్దరికీ కూడా డబ్బులు ఏం చేయాలో అర్థం కాలేదు. దారిలో ఇద్దరు ఆకలితో వెళ్తున్న ముసలి వాళ్లకు డబ్బులు ఇచ్చి అన్నం తినుమన్నారు. వాళ్లు ఆ డబ్బులతో అన్నం తిని ఆకలి తీర్చుకున్నారు. కొద్దిరోజుల తర్వాత ఆ ముసలి వాళ్లు ఇద్దరు కూడా కొత్త బట్టలు తీసుకుని వచ్చి బడిలో ఉన్న సీత, గీతలకు ఇచ్చి మేము ఆకలితో ఉన్నప్పుడు వారికి దొరికిన డబ్బులు వారు తీసుకోకుండా, మా ఆకలి కొరకు ఇచ్చినందుకు ఈ బట్టలు ఇస్తున్నామని తెలిపారు.

సీత, గీతలు డబ్బులు స్వార్థానికి వాడుకోకుండా ఇతరుల ఆకలి తీర్చేందుకు ఇచ్చినందుకు బడిలో ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు అభినందించారు. సీత, గీతల మాదిరిగానే ఇతరులకు సహాయం చేయాలని, ఏదైనా వస్తువు దొరికితే తిరిగి వారికి ఇవ్వాలని, లేనిపక్షంలో పెద్దలకు అప్పగించాలని ఉపాధ్యాయులు విద్యార్థులకు సూచించారు.

**- సనా తబస్సుమ్**
**ఎనిమిదవ తరగతి**
**ZPHS హవేలీ ఘనపూర్**
**మెదక్ జిల్లా**
**9849505014**



# కాంగ్రెస్ ప్రభుత్వ పాలన ముమ్మాటికీ ప్రజాపాలన ప్రభుత్వం కాదు... ప్రజాపీడన ప్రభుత్వమే

### బీఎస్పీ సిద్దిపేట అసెంబ్లీ నియోజకవర్గ అధ్యక్షులు పుల్లూరు ఉమేశ్

**సిద్దిపేట టౌన్, వెలుతురు మార్చ్04:**
నేడు తెలంగాణ గురుకుల విద్యా సంస్థల రిక్రూట్ మెంట్ బోర్డు (TREI-RB) భర్తీ చేసే 5,278 ఉద్యోగ నియామకాల్లో ఉత్పన్నమైన బ్యాక్లోగ్ వకేన్సీస్ వల్ల 3,000 మంది నిరు ద్యోగులకు తీరని అన్యాయం జరుగుతుంది. కొంచెం సమయం తీసుకొని దిగువ ఆర్డర్ ప్రకారం పోస్ట్ ఆర్డర్లు ఇచ్చుంటే ఈ బ్యాక్ లాగ్ వేకెన్సీలు ఉత్పన్నమయ్యుండేవి కాదు. ఎంత వేడుకున్నా నిరుద్యోగుల వేదనను ప్రభుత్వం పెడచెవిన పెట్టింది.
దీనికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పూర్తిగా నైతిక బాధ్యత వహించాలి.
తెలంగాణ రెసిడెన్షియల్ స్కూల్స్లో ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్



పోస్టుల భర్తీ (TREI-RB) ఉద్యోగ నియామకాల ప్రక్రియలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ విరమణ విధానాన్ని తుంగలో తొక్కి దిగువ క్రమములో ఉద్యోగాలు భర్తీ చేయక పోవడం కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యానికి పరాకాష్ట మీది ముమ్మాటికీ ప్రజాపాలన కాదు ప్రజాపీడన గురుకుల ఉద్యోగ అభ్యర్థుల ఆవేదనపై నేను "ఎక్స్" వేదికగా చేసిన ట్వీట్ మీరు ఫిబ్రవరి 24న సానుకూలంగా స్పందించి సమస్య పరిష్కరి స్తామని హామీ ఇచ్చినా హామీ అమలుకు నోచుకోకపోవడం విచారకరం అంటే ఈ మీ ట్విట్టర్ స్పందన కేవలం ఒక డ్రామా? తక్షణమే ప్రభుత్వం స్పందించి గురుకుల ఉద్యోగాల నియామకాల్లో
ఉపసంహారణ అవరోహణ క్రమం విధానాన్ని పాటించి అభ్యర్థుల మెరిట్ ఆధారంగా ఖాళీలు మిగులకుండా అన్ని ఉద్యోగాలను భర్తీ చేయాలని బహుజన్ సమాజ్ పార్టీ డిమాండ్ చేస్తున్నది.

# కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు వస్తున్న వార్తలు అవాస్తవం

### ఎమ్మెల్యేగా 3 సార్లు అవకాశం ఇచ్చిన పార్టీని వీడే ప్రసక్తే లేదు
### ఎవరైతే నన్ను అనుమానిస్తున్నారో అది వారు మానుకోవాలి
### జహీరాబాద్ శాసన సభ్యులు కొనింటి మాణిక్ రావు

**జహీరాబాద్, 03 మార్చి, వెలుతురు :**
కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు వస్తున్న వార్తలను జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్ రావు తీవ్రంగా ఖండించారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆదివారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత కొన్ని రోజుల నుండి మీడియాలో కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు వస్తున్న



వార్తలలో ఎలాంటి వాస్తమని లేదని ఆయన స్పష్టం చేశారు. నేను మొట్టమొదటిసారిగా రాజకీయంలో అడుగు పెట్టినప్పటి నుండి బిఆర్ఎస్ పార్టీలోనే ఉన్నానని పేర్కొన్నారు. గతంలో 2014లో ఎమ్మెల్యే అభ్యర్థిగా ఓడిన 2019, 2023లో తిరిగి నాపై నమ్మకం ఉంచి బిఆర్ఎస్ అభ్యర్థిగా టికెట్టు ఇచ్చిన పార్టీని వదిలిపెట్టే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఎవరైతే నన్ను అనుమానిస్తున్నారో అది మానుకోవాలని హితవుపలికారు. జహీరాబాద్ నియోజకవర్గం సంక్షేమానికి, అభివృద్ధికి మాజీ సీఎం కెసిఆర్, మాజీ మంత్రి హరీష్ రావు అన్ని విధాలుగా ఎంతో సహకరించారని, అలాంటి బిఆర్ఎస్ పార్టీన్ని వదిలి వేరె పార్టీలోకి వెళ్లె ప్రసక్తె లేదని తెలిపారు. ఇలాంటి అబ్బదపు, ఎలాంటి ఆధారాలు లేనటువంటి వార్తలను జహీరాబాద్ ప్రజలు, బి ఆర్ ఎస్ నాయకులు, కార్యకర్తలు నమ్మవద్దని, వారికి ఎల్లప్పుడూ నేను అండగా ఉంటానని తెలిపారు.

# మానవత్వం లేని బీఆర్ఎస్ ఎమ్మెల్యే


### బీజేపీ మహిళా మోర్చ అసెంబ్లీ కన్వీనర్ జ్యోతి పండాల్

**జహీరాబాద్, 04 మార్చి, వెలుతురు :**
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలం డిడిగి గ్రామానికి చెందిన ఒక కుటుంబం కొన్ని రోజుల క్రితం రోడ్ ప్రమాదానికి గురై కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పాప ఆపరేషన్ కి 15 లక్షల రూపాయలు ఖర్చవుతుందని మన సౌమ్యుడైన ఎమ్మెల్యే కె. మాణిక్ రావుకు ఒక వ్యక్తి ఫోన్ చేసి సహాయం చేయమంటే ఇప్పుడు సహాయం చేయడం కాదు ఆపరేషన్ అయిన తరువాత డాక్యుమెంట్స్ తెస్తే సీఎం రిలీఫ్ ఫండ్ కింద చేయిస్తా అని అనడం చాలా బాధాకరమని బీజేపీ మహిళా మోర్చ అసెంబ్లీ కన్వీనర్ జ్యోతి పండాల్ ఒక ప్రకటనలో వెల్లడించారు. మన ఎమ్మెల్యేకు ఆ వ్యక్తి అంటున్న మాటలు అర్థం కాలేదు అనుకుంటా అందుకే నేను ఈ స్టేట్మెంట్ ద్వారా ఎలా సహాయం చేయాలో తెలియజేయాలని అనుకుంటున్నాను అని తెలుపుతూ...సార్ సహాయం చేయాలన్న మనసు ఉంటే మార్గముంటది, పైగా మీ లాంటి పెద్దలకి అది చాలా సులువైన విషయం. మీకు డబ్బుల సహాయం చేసే స్తోమత లేక పోతే మీరు హెల్త్ మినిస్టర్ కి ఫోన్ చేసి సహాయం చేయవచ్చు, లేదా మీరే హాస్పిటల్ కి ఫోన్ చేసి బిల్ అంత కాకుండా అతి తక్కువలో ఆపరేషన్ అయ్యేలా చూడండి అని హాస్పిటల్ సిబ్బంతో కూడా మాట్లాడ వచ్చు, లేదా మన జహీరాబాద్ లో చుట్టూ



పక్కల కంపెనీ వాళ్లకి ఫోన్ చేసి తక్షణ సహాయం కింద సీ ఎస్ ఆర్ ఫండ్స్ రూపంలో సహాయం చేయవచ్చు, మీకు మరి అంత పెద్ద మనసు ఉంటే మీరే ఆ ఖర్చు భరించి ఆపరేషన్ తర్వాత సీ ఎం రిలీఫ్ ఫండ్ క్లెయిమ్ చేసుకొని మీరే తీసుకోండి. అంతే గానీ ఆపరేషన్ తర్వాత రా ఫండ్ ఇపిస్తా అంటే అక్కడ ప్రాణాలు పోతాయి, ప్రైవేట్ హాస్పిటల్లో ఒక్క రూపాయి కట్టంది ఆపరేషన్ కాదు కదా ఒక్క మందు గోలి కూడా ఇవ్వరు. అతను ఆపరేషన్ తర్వాత సహాయం కావాలంటే మీదగ్గరకి ఎందుకు వస్తాడు, కాంగ్రెస్ వాళ్ళ దగ్గరికి వెళ్లి సీ ఎం రిలీఫ్ ఫండ్ తెచ్చుకుంటాడు. మీరు ఎం అభివృద్ధి చేయక పోయిన ప్రజలు మీకు ఓటు వేస్తే ఇదా మీరు ప్రజలకి చేసే సేవ. మీకు హాస్పిటల్ పేరు పలకడం రావడం లేదు సీ ఎం రిలీఫ్ ఫండ్ అనడం రావడం లేదు. మీరు ఎమ్మెల్యే ఎలా అయ్యారో దేవుడికి తెలియాలి ప్రజలకే తెలియాలి. ఈ భూ ప్రపంచం మీద మీలాంటి వ్యక్తి దొరకడని ప్రజలు మిమల్ని గెలిపించారు అందుకు మీరు వాళ్లకి తగిన శాస్తి చేస్తున్నారు. ప్రపంచంలో ఎక్కడ కూడా మీ లాంటి ఎమ్మెల్యే నీ నేను ఎప్పుడు చూడలేదు నాకు తెలిసి ఇక ముందు కూడా చూడక పోవచ్చని వారు తమ ప్రకటనలో అభిప్రాయపడ్డారు.





# బాల కార్మికులకు విముక్తి కల్పించండి

### బాలల హక్కుల పరిరక్షణ వేదిక డిప్యూటీ తాసిల్దార్ మరియు ఎంపీడీవోకు వినతిపత్రం అందజేత

**శంకర్పల్లి మార్చి 04 (వెలుతురు):**
శంకర్పల్లి మున్సిపల్ మరియు మండల పరిధిలో దుకాణాలలో మరియు ఇతర సంస్థలలో పనిచేస్తున్న బాల కార్మికులకు విముక్తి కల్పించాలని బాలల హక్కులు పరిరక్షణ వేదిక మరియు మండల తల్లుల సంఘం సభ్యులు సోమవారం మండల డిప్యూటీ తాసిల్దార్కు, ఎంపీడీవోకు వినతి పత్రం అందజేశారు. తాము గత 28 సంవత్సరాలుగా బాలల హక్కులు, బాల కార్మిక నిర్మూలన మరియు బాల్యవివాహాలను అరికట్టుటకు కృషి చేస్తున్నామని అదేవిధంగా మండల కేంద్రంలోని దుకాణాలలో, ఇతర సంస్థలలో పనులు చేస్తూ బాల కార్మికులుగా మారుతున్నారని వినతి పత్రంలో పేర్కొన్నారు. కావున అలాంటి దుకాణదారులపై చట్టపరమైన చర్యలు తీసుకొని బాల కార్మికులకు విముక్తి కల్పించాలని వినతిపత్రంలో తెలిపారు. ఇతర రాష్ట్రాల నుండి మరియు జిల్లాల నుండి బతుకుదెరువు కోసం వలస వచ్చిన పిల్లలకు ఆధార్ కార్డు లేకపోవడంతో పాఠశాలల్లో అడ్మిషన్ ఇవ్వడంలేదని, అట్టి పిల్లలకు అధికారులు ఆధార్ కార్డు వచ్చే విధంగా కృషి చేయాలని కోరారు. అలాగే ఆడపిల్లలకు తగిన న్యాయం చేకూర విధంగా ప్రయత్నించాలని వినతిపత్రంలో కోరారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో ఎ లక్ష్మి, సువర్ణ, అఖిల, హరిత, శశికళ, కౌసల్య, ఎమ్ మంగ, మంజుల, టి మంగ మరియు లక్ష్మి పాల్గొన్నారు.

# నేషనల్ ఓపెన్ మార్షల్ ఆర్ట్ ఛాంపియన్‌లో విజయం సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేత..

**సిద్దిపేట టౌన్, వెలుతురు మార్చ్ 04:**
సిద్దిపేట పట్టణనికి చెందిన స్పార్క్ కుంగ్ ఫ్ ఎస్ఆర్ డి జి స్కూల్ విద్యార్థిని విద్యార్థులు అదివారం రోజున సికింద్రాబాద్ లో జరిగిన నేషనల్ ఓపెన్ మార్షల్ ఆర్ట్ ఛాంపియన్ 2024 విక్టరీ షోటోకను అసోసియేషన్ ఇండియా ఆధ్వర్యంలో క్లాసిక్ గార్డెన్ లో నిర్వహించిన టోర్నమెంట్లో విజయం సాధించిన విద్యార్థిని విద్యార్థులు ప్రథమ బహుమతి రామ్ గోల్డ్ అభినేయి సిల్వర్ త్రితీయ కృతికు సాయి వర్మ బ్రాన్ మెడల్ ప్రసన్ తేజు బ్రాన్ సప్రిన్ సిల్వర్ శాన్విత బ్రాన్ మెడల్ సాధించారు వీరిని స్పార్క్ కుంగ్ ఫ్ చీఫ్ ఇన్సర్టక్టర్ రఘునందన్ రెడ్డి ఎస్ఆర్ డి జి స్కూల్ ప్రిన్సిపాల్ సుదర్శన్ శిక్షకులు బాలు శ్రీనివాస్ అభినందియించారు.



# ఎస్ యు రిజిస్ట్రార్‌పై జిల్లా కలెక్టర్‌కి ఏఐఎస్ఎఫ్ పిర్యాదు

**- ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మచ్చ రమేష్.**

కరీంనగర్, వెలుతురు, మార్చి 4:

శాతవాహన యూనివర్శిటిలో ఇటీవల జరిగిన 149 అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ టెండర్ ఎంపిక విధానంలో యూనివర్శిటీ అధికారులు ప్రభుత్వ నియమా నిబంధనలు మరియు మార్గదర్శకాలని (జీవో నెంబర్ 02)పాటించకుండా ఏకపక్షంగా టెండర్ నీ తమకు అనుకూలంగా ఉండే వారికి కట్టబెట్టారనీ దీనిపై ప్రభుత్వం విచారణ జరిపించాలని కోరుతూ సోమవారం ఏఐఎస్ఎఫ్ జిల్లా సమితి అధ్వర్యంలో జిల్లా కలెక్టర్‌కి వినతిపత్రం ఇచ్చారు.

ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి మచ్చ రమేష్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన జీవో నెంబర్ 2 లో లక్ష రూపాయలు ఖర్చు మించిన ఏ ఒక్క కాంట్రాక్ట్ ను అయిన ఆఫ్ లైన్ లో



ఇవ్వరాదనీ స్పష్టంగా ఉన్నప్పటికీ యూనివర్సిటీ అధికారులు ఈ టెండర్లను పిలవకుండా ఆఫ్ లైన్ లోనే టెండర్ కు పిలవడం జీవో నెంబర్ 2కి విరుద్ధంగా తమకు అనుకూలంగా ఉన్న వారికి 21లక్ష 68వేల 130రూపాయల విలువ చేసే ఔట్ సోర్సింగ్ కాంట్రా క్టును తమకు అనుకూలంగా ఉన్న వారికి కట్టపెట్టడం సోచనియమని దీనిపై సమగ్ర విచారణ జరిపి ప్రభుత్వం నిబంధనలు పాటించాలని అధికారుల పై చర్యలు తీసుకుంటూ ఆఫ్ లైన్ విధానంలో పిలిచిన టెండర్‌నీ రద్దు చేసి ఈ టెండర్ విధానంలో మళ్ళీ ఎంపిక చేయాలని విజ్ఞప్తి చేయడం జరిగింది.

# సమస్యల పరిష్కారం కోసం బలమైన వ్యవసాయ కార్మిక ఉద్యమాలను నిర్మిస్తాం

**బికెయంయు రాష్ట్ర కార్యదర్శి కొయ్యడ సృజన్ కుమార్**

కరీంనగర్, వెలుతురు, మార్చి 4:

రానున్న రోజుల్లో వ్యవసాయ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం,హక్కుల సాధన కోసం బలమైన ఉద్యమాలు నిర్మిస్తామని బి కె యం యు రాష్ట్ర కార్యదర్శి కొయ్యడ సృజన్ కుమార్ అన్నారు.

రెండు రోజుల పాటు హన్మకొండలో జరుగుతున్న తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కౌన్సిల్ సమావేశాల సందర్భంగా సృజన్ కుమార్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ కూలీలు,ఉపాధి కూలీలు శ్రమ దోపిడీకి గురవుతున్నారని, శ్రమకు తగిన ఫలితం లేదని,పని గ్యారంటీ లేకుండా పోయిందని,పాలకులు కూలీల సంక్షేమం పట్ల నిర్లక్ష్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

పల్లెల్లో పనులు లేక ప్రజలు పట్టణాలకు ఉపాధి కోసం వలసలు వెళ్లే పరిస్థితుల్లో గ్రామీణ ప్రాంత వ్యవసాయ కూలీలకు,పేద బడుగు బలహీన వర్గాల ప్రజలకు చేతినిండ పని కల్పించి వారి కుటుంబాలకు భరోసా అందించాలనే లక్ష్యంతో ప్రారంభించిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీల జీవితాల్లో మార్పుకు నాంది పలికిన ప్రస్తుత పరిస్థితుల్లో కేంద్ర పాలకుల నిర్లక్ష్యంతో బడ్జెట్ కేటాయింపుల్లో కోతలు పెడుతూ ఉపాధి హామీ పనులకు దూరం చేస్తున్నారని




ఆరోపించారు.

ఈ నేపథ్యంలో పాలకుల విధానాలకు వ్యతిరేకంగా,సరైన బడ్జెట్ కేటాయింపుల కోసం,వ్యవసాయ కూలీల హక్కుల కోసం,సంక్షేమ పథకాల అమలు కోసం పని గ్యారంటీ చట్టం, వ్యవసాయ కార్మికుల సమగ్ర చట్టం అమలు కోసం బలమైన ప్రగతిశీల వ్యవసాయ కూలీలు ఉద్యామాలకు సిద్ధం కావాలని సృజన్ కుమార్ పిలుపునిచ్చారు.

ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షులు బోయిని అశోక్,జిల్లా నాయకులు విలాసాగరం అంజయ్య,బత్తుల బాబు,దరిపెల్లి అంకుస్,చెంచల భీమయ్య తదితరులు పాల్గొన్నారు.






# హెూతి (కె) బాలికల రెసిడెన్సియల్ జూనియర్ కళాశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు

**మహిళలు పురుషులకు ధీటుగా అన్నిరంగాల్లో రాణించాలి**

**విద్యార్థినిలు చదువుపై శ్రద్ధ వహించి ఉన్నత లక్ష్యాలు అధిరోహించి, ఆర్థికంగా నిలబడాలి**

**సీనియర్ సివిల్ జడ్జి, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ సూరి కృష్ణ**

జహీరాబాద్, 04 మార్చి, వెలుతురు :

ఈ నెల 8న నిర్వహించే అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పునస్కరించుకుని మండల లీగల్ సర్వీసెస్ కమిటీ జహీరాబాద్ వారి ఆధ్వర్యంలో హెూతి (కె) బాలికల రెసిడెన్సియల్ జూనియర్ కళాశాలలో న్యాయ విజ్ఞాన సదస్సును సీనియర్ సివిల్ జడ్జి, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ సూరి కృష్ణ నిర్వహించి విద్యార్థులకు మహిళల భద్రత, మహిళల హక్కులు, మహిళా రక్షణ చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ మహిళలు పురుషులకు ధీటుగా అన్నిరంగాల్లో రాణించాలని అన్నారు. ప్రస్తుత సమాజంలో మహిళలు ఆర్థికంగా ఎదగాల్సిన అవసరం ఎంతయినా ఉన్నదని తెలియజేసారు. విద్యార్థినిలు చదువుపై శ్రద్ధ వహించి ఉన్నత లక్ష్యాలు అధిరోహించాలని, ఆర్థికంగా నిలబడాలని సూచించారు. కార్యక్రమంలో పోక్సో చట్టం, సమాచార హక్కు చట్టం, బాలకార్మిక నిర్మూలన చట్టం, బాల్య వివాహ నిరోధక చట్టం, జువైనెల్ జస్టిస్ యాక్ట్, ఉచిత న్యాయసేవా సహాయంపై విద్యార్థులకు తెలియజేసారు.

బాల్య వివాహ్ బాధితులు, బాల కార్మికులు ఎక్కడైనా ఉన్నట్లు గుర్తిస్తే పాఠశాల ప్రధానోపాధ్యాయులకు గాని, స్థానిక తహసీల్దార్ లేదా స్థానిక పోలీస్ అధికారికి లేదా మండల లీగల్ సర్వీసెస్ కార్యాలయంలో గాని లేదా 1098 కి ఫోన్ ద్వారా తెలుపవచ్చని సూచించారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యాంగా ఉంచబడతాయని తెలియజేసారు. ఏ సమాచారం గురించి తెలుసుకోవాలనుకున్న మండల లీగల్ సర్వీసెస్ కమిటీ కార్యాలయంను సంప్రదించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో బార్ వైస్ ప్రెసిడెంట్ మానెన్న, సీనియర్ న్యాయవాదులు పాండురంగా రెడ్డి, లీగల్ సర్వీసెస్ సిబ్బంది, పారాలీగల్ వాలంటీర్లు, కళాశాల ప్రధానోపాధ్యాయులు విజయ, అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# మెగా బస్తీ సంపర్క్అభినవ్ కార్యక్రమం

వెలుతురు న్యూస్ - రామన్నపేట యాదాద్రి జిల్లా

భారతీయ జనతా పార్టీ ఎస్సీ మోర్చా రాష్ట్ర శాఖ పిలుపుమేరకు రామన్నపేట పట్టణ కేంద్రంలోని 13.14వార్డులలోనీ ఎస్సీ కాలనీలో మెగా బస్తి సంపర్క్అభినవ్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది.

ఈ యొక్క కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా భారతీయ జనతా పార్టీ ఎస్సీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నకిరేకంటి మొగులయ్య పాల్గొనడం జరిగింది ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలందరూ వినియోగించుకోవాలని కోరారు నరేంద్ర మోడీ ప్రభుత్వ హయాంలో దేశం పురోగతి చెందు తుందని అభివృద్ధి చెందుతున్న దేశాలలో భాగంగా భారతదేశాన్ని నిలిపిన ఘనత నరేంద్ర మోడీదని అన్నారు రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ దేశంలో 370 పార్లమెంటు స్థానాలను కైవసం చేసుకుంటుందని తెలంగాణలో అత్యధిక స్థానాలను గెలుపొందించాలని అన్నారు అదేవిధంగా విశ్వకర్మ యోజన టీంని చేతి వృత్తుల వారు అందరూ ఆన్లైన్లో అప్లై చేసుకోవాలని కోరారు.

అదేవిధంగా భువనగిరి పార్లమెంట్ అభ్యర్థిగా డా "బూర నర్సయ్య గౌడ్‌కి టికెట్ ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు భువనగిరి పార్లమెంట్ ప్రజలు అత్యధికంగా ఓట్లు వేసి బూర



నర్సయ్య గౌడ్ ని గెలిపించవలసిందిగా కోరారు ప్రజలు మళ్ళీ నరేంద్ర మోడీ ప్రభుత్వాన్ని కోరుకుంటున్నారు మోడీ ప్రభుత్వం పై ప్రజలందరికీ పూర్తి విశ్వాసం ఉందని అన్నారు.

మోదీ ప్రభుత్వ ఏర్పాటుకు ప్రజలందరూ సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందని అన్నారు.

ఈ యొక్క కార్యక్రమంలో దంతూరి సత్తయ్య, ముగ్గు నరసింహ, బట్టే రమేష్, ముత్యాల స్వామి, గాదె సురేష్ ,తదితరులు పాల్గొన్నారు.



# చిన్నారుల నిండు జీవితానికి రెండు చుక్కలు

**యూత్ కాంగ్రెస్ సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి అజ్జు యాదవ్**

నంగునూర్ మండలం, వెలుతురు మార్చ్04:

చిన్నకోడూరు మండలంలోని చెర్లఅంకిరెడ్డిపల్లి గ్రామంలోని గ్రామ పంచాయతి కార్యాలయంలో మెడికల్ అధికారులు ఆశ వర్కర్లు అంగన్ వాడి టీచర్లు చిన్నారులకు వేస్తున్న పోలియో చుక్కల కేంద్రాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకులు సందర్శించారు

ఈ సందర్భంగా యూత్ కాంగ్రెస్ సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి అజ్జు యాదవ్ మాట్లాడుతూ పిల్లలకు వచ్చే అనేక వ్యాధుల్లో పోలియో ఒకటి ఇది వస్తే పిల్లల్లో వ్యాధి నిరోధక శక్తి తగ్గి కాళ్లు చేతులూ వంకర అవుతాయని కొన్ని కేసుల్లో మెదడుకి కూడా వ్యాపించి అవయవాలకు వైకల్యం సంభవిస్తుందని అన్నారు.ఇది అంటువ్యాధి కాదు,దీన్ని రాకుండా చెయ్యడానికి ఉన్న మార్గమే పోలియో చుక్కల మందు వేయడమని తెలిపారు.ఈ మందును పుట్టిన పిల్లల నుంచి 5 ఏళ్ల వయసు లోపు పిల్లలకు ఏటా ఒక రోజు ప్రభుత్వం ఉచితంగా వేస్తుంది కాబట్టి తల్లిదండ్రులు తప్పనిసరిగా పిల్లలకు వేయించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ సిద్దిపేట జిల్లా ఉపాధ్యక్షులు కొండం శ్రీనివాస్ రెడ్డి మండల నాయకులు తుమ్మల శ్రీనివాస్ ఏ ఎన్ ఏం కవిత ఆశ వర్కర్లు మమత మౌనిక అంగన్ వాడి టీచర్ ఉమలత గ్రామస్తులు లక్ష్మణ్ రాజు నర్సయ్య శ్రీనివాస్ పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# పోలియో చుక్కలు వేయిద్దాం

**- ఎంపీటీసీ బెదురు తిరుపతి**

నంగునూర్ మండలం, వెలుతురు మార్చ్04:

జాతీయ పోలియో నివారణ కార్యక్రమంలో భాగంగా ఆదివారం నంగునూరు మండలం సిద్ధన్నపేట గ్రామంలో పోలియో చుక్కల కేంద్రాన్ని ఎంపీటీసీ బెదురు తిరుపతి చేతుల మీదుగా ప్రారంభించడం జరిగింది. వారు మాట్లాడుతూ ఐదేళ్లలోపు చిన్నారులకు



తప్పకుండా పోలియో చుకలు వేయించాలని తల్లిదండ్రులకు కరీంనగర్ జడ్పీ చైర్ పర్సన్ కనుమల్ల విజయ సూచించారు. పోలి యో రహిత సమాజాన్ని నిర్మించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు పిల్లలందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించుకోవాల్సిందిగా తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ భాస్కర చారి ఏఎన్ఎం సరస్వతి ఆశ వర్కర్ మమత తదితరులు పాల్గొన్నారు.

# పుల్లూరు ప్రాథమిక పాఠశాలలో స్వపరిపాలన దినోత్సవం

సిద్దిపేట అర్బన్, వెలుతురు మార్చ్04:

పుల్లూరు ప్రాథమిక పాఠశాలలో స్వపరిపాలన దినోత్సవం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలుగా కర్రె లాస్య మండల విద్యాధికారిగా మాదం రుత్విక్ వ్యవహరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజనర్సయ్య ఉపాధ్యాయినీ



ఉపాధ్యాయులు ప్రకాశ్ శ్రీధర్ స్వప్న శ్రీనివాస్ కవిత CRP హరిక్రిష్ణ . మరియు పాఠశాల విద్యా కమిటీ మాజీ చైర్మెన్ శ్రీ వేణుగోపాలాచార్యులు రిటైర్డ్ O.S. నీలమ్మ పాల్గొన్నారు. ప్రధానోపాధ్యాయులు రాజనర్సయ్య మాట్లాడుతు ఉపాధ్యాయులుగా వ్యవహరించిన వారందరు తరగతి గదిలో మీ అనుభవాలను నెమరు వేసుకుంటూ భవిష్యత్తులో మంచి విద్యార్థులుగా ఉంటూ బాగా చదివి భవిష్యత్తులో ఉన్నత ఉద్యోగాలు చేస్తూ మీ తల్లిదండ్రులకు పాఠశాలకు గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆశాభావం వ్యక్తంచేశారు.

# ఈ నెల 7న శ్రీ కైలాసగిరి శివాలయంలో స్వాముల ఇరుముడి కార్యక్రమం

**భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలి**

**శ్రీ కైలాసగిరి శివాలయం ప్రధాన అర్చకులు గణేష్ స్వామి, నందు స్వాములు**

జహీరాబాద్, 04 మార్చి, వెలుతురు:

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణ పరిధిలోని శ్రీ కైలాసగిరి శివాలయంలో మార్చి,07న



ఉదయం శివ స్వాముల ఇరుముడి, శివ స్వాముల మహా పడి పూజ కార్యక్రమం నిర్వహిస్తున్నామని కైలాసగిరి శివాలయం ప్రధాన అర్చకులు గణేష్ స్వామి, నందు స్వాములు తెలిపారు. ముందుగా ఉదయం 6 గంటలకు రుద్రాభిషేకం, 9 గంటలకు మహా పడి పూజ్య, గణపతి పూజ, గౌరీపూజ, ద్వాదశ లింగాలకు మహా రుద్రాభిషేకం, బిల్వార్చన, మంగళ హారతి ఉందని ఆలయ అర్చకులు తెలిపారు. పూజ కార్యక్రమం అనంతరం శివ స్వాములకు, భక్తులకు అన్నదాన కార్యక్రమం, 12:30 గంటలకు ఇరుముడి కార్యక్రమం, చివరిగా శివ స్వాముల శోభా యాత్ర ఉంటుందని కావున శివ స్వాములు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆలయ అర్చకులు గణేష్ స్వామి తెలిపారు.




# బస్సు ప్రమాద బాధితులను పరామర్శించిన డాక్టర్ ఉజ్వల్ రెడ్డి

**2 లక్షలు తక్షణ సహాయం అందజేత**

**మరో మూడు లక్షలు త్వరలో అందిస్తామని కుటుంబ సభ్యులకు బరోసా**

**జహీరాబాద్, 04 మార్చి, వెలుతురు :** సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలం, దిడ్గి గ్రామం వద్ద సొన్నాయిల ప్రశాంత్ మరియు బార్య, ఇద్దరు కూతుర్లు ఒకేసారి కర్ణాటక బస్సు ఏక్సిడెంట్ లో తీవ్రగాయాలు అయ్యి ప్రాణాపాయస్థితిలో హైద్రాబాద్ లోని కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం అందరికి తెలిసిందే. అయిదాల సునీల్ ద్వారా సమాచారం తెలుసుకున్న ఉజ్వల్ రెడ్డి మరియు గొల్ల భాస్కర్ గారు వెంటనే స్పందించి తక్షణమే కిమ్స్ ఆసుపత్రి చేరుకొని పేషంట్స్ యొక్క ఆరోగ్య పరిస్థితులను వైద్యులతో మాట్లాడి తెలుసుకున్నారు. ఆపరేషన్స్ కి అయ్యే కర్చుల వివరాలు తెలుసుకుని తక్షణమే సహాయం కింద ఉజ్వల్ రెడ్డి, భాస్కర్ అన్న కలిసి 2 లక్షల రూపాయలు కుటుంబ సభ్యులకు అందించారు. మరో మూడు లక్షలు త్వరలో అందిస్తామని కుటుంబ సభ్యులకు బరోసా ఇచ్చారు. మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్ ఉజ్వల్ రెడ్డి వైద్యులకు సూచించారు. పరామర్శించిన వాళ్ళలో ఉజ్వల్ రెడ్డి తో పాటు గొల్ల భాస్కర్ అన్న, అశ్విన్ పాటిల్, మిర్జాపుర్ వినోద్ తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి విజయ సంకల్ప సభను

# విజయవంతం చేయండి

**బిజెపి మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి నౌబాద్ జగన్నాథ్**

**జహీరాబాద్, 04 మార్చి, వెలుతురు :** సంగారెడ్డి జిల్లాలో నేడు దేశ ప్రధాని నరేంద్ర మోడీ పాల్గొనే బీజేపీ విజయ సంకల్ప సభను విజయవంతం చేయాలని బిజెపి మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి నౌబాద్ జగన్నాథ్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేడు సంగారెడ్డి జిల్లా పటాన్చెరు లో దేశ ప్రధాని నరేంద్ర మోడీ అనేక అభివృద్ధి పథకాలను శంకుస్థాపన చేసి, పూర్తయిన ప్రాజెక్టులను జాతికి అంకితం చేస్తున్నారని తెలిపారు. అందులోనే భాగంగా తెలంగాణలో 15,718 కోట్ల అభివృద్ధి పనులకు గాను అందులో ఆదిలాబాద్‌లో సోమవారం 6,697 కోట్లతో ప్రారంభించడం జరిగిందని వారన్నారు. నేడు సంగారెడ్డిలో జిల్లాలో 9,021 కోట్లతో ప్రారంభోత్సవం, శంకుస్థాపన కార్యక్రమాలు ప్రధానమంత్రి చేతుల మీదుగా జరుగనున్నవని అన్నారు.



అదేవిదంగా ప్రధాని మోడీ ప్రజల ఉద్దేశించి భారీ బహిరంగ సభను నిర్వహించడం జరుగుతున్నదని తెలిపారు. ఈ సభకు సంగారెడ్డి జిల్లాలోని అన్ని గ్రామాల ప్రజలు బిజెపి కార్యకర్తలు నాయకులు అత్యధిక సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయగలరని వారు కోరారు.

## తెలంగాణ రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం

# రాష్ట్ర ఉపాధ్యక్షులుగా పరిటాల రవి

**నియామక పత్రం అందజేసిన రాష్ట్ర అధ్యక్షులు తాడూరి శ్రీనివాస్**

**వెలుతురు న్యూస్ - రామన్నపేట యాదాద్రి జిల్లా:** తెలంగాణ రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులుగా కప్పల రవి అలియాస్ పరిటాల రవిని ఎంపిక చేసినట్లు రాష్ట్ర ప్రధాన కార్యాలయం ఇన్చార్జి ఒక ప్రకటనలో తెలియజేశారు. రాష్ట్ర అధ్యక్షులు తాడూరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్మితమవుతున్న బిసి ఐక్యత సమస్యల పట్ల పోరాడే



కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర కమిటీ ఉపాధ్యక్షులు మరియు భువనగిరి పార్లమెంటు ఇన్చార్జిగా పరిటాల రవిని నియమిస్తూ నియామక ఉత్తర్వులు జారీ చేశారని రామన్నపేట పరిటాల ఎస్టేట్లో జరిగే రాష్ట్రస్థాయి కార్యవర్గ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు నియామకం పత్రం అందజేశారు. అనంతరం పరిటాల రవికుమార్ గౌడ్ మాట్లాడుతూ బీసీ కులాల అభ్యున్నతిని వారి సమస్యల పరిష్కారం కోసం తన వంతు కృషి చేస్తూ ముందుకు సాగుతానని, నియామకానికి సహకరించిన ప్రతి ఒక్క సభ్యునికి ధన్యవాదాలు తెలియజేశారు.

# మేడిగడ్డపై హైకోర్టు విచారణ

**జ్యుడిషయల్ విచారణ కోరిన ప్రభుత్వం**

**హైదరాబాద్,మార్చి4(వెలుతురు):** మేడిగడ్డ బ్యారేజ్ వ్యవహారంపై హైకోర్ట్‌లో సోమవారం విచారణ జరిగింది. మేడిగడ్డ బ్యారేజ్ కుంగడంపై ప్రభుత్వం జుడిషియల్ విచారణ కోరిన సంగతి తెలిసిందే. సుప్రీంకోర్టు లేదా హైకోర్టు రిటైర్డ్ జడ్జ్ తో విచారణ జరిపించాలని ప్రభుత్వం కోరింది. కాళేశ్వరం ప్రాజెక్టుపై ఇప్పటికే విజిలెన్స్ ఎంక్వయిరీకి ఆదేశించినట్టు ప్రభుత్వం తెలిపింది. విజిలెన్స్ రిపోర్ట్ తర్వాత ఇంజనీర్లను విధుల నుండి తొలగించినట్లు కోర్టుకు ప్రభుత్వం తెలిపింది. మేడిగడ్డ బ్యారేజ్ కుంగడానికి కారణమైన అధికారులపై రిపోర్ట్ వచ్చాక చర్యలు తీసుకుంటున్నామని వివరించింది. ఈ ఘటనపై ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం నేషనల్ డ్యామ్స్ సేఫ్టీ అథారిటీకి లేఖ రాసింది. డ్యాం సేఫ్టీ అథారిటీ ఆరుగురు సభ్యుల తో కూడిన కమిటీని ఏర్పాటు చేసింది. సెంట్రల్ వాటర్ కమిషన్ ను ఇంప్లీడ్ చేయాలని పిటిషనర్‌కు హై కోర్టు ఆదేశించింది. తదుపరి విచారణ 4 వారాలకు తెలంగాణ హైకోర్టు వాయిదా వేసింది.కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల డిజైన్ల నిర్మాణాన్ని పరిశీలించేందుకు నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ నిపుణుల కమిటీని ఆదివారం (మార్చి 3) నియమించింది. కేంద్ర జల సంఘం మాజీ ఛైర్మన్ జె.చంద్రశేఖర్ అయ్యర్ సారథ్యంలో అయిదుగురు సభ్యులతో కమిటీని నియమించింది. ఇందులో యూసీ విద్యార్థి, ఆర్.పాటిల్, శివకుమార్ శర్మ, రాహుల్ కుమార్ సింగ్ సభ్యులుగా ఉన్నారు. ఎన్డీఎస్ఏ డైరెక్టర్ (టెక్నికల్) అమితాబ్ మీనా ఈ కమిటీకి మెంబర్ సెక్రెటరీగా వ్యవహరిస్తారు. మేడిగడ్డ బ్యారేజీలోని ఫియర్లు కుంగిపోవటంతో అప్రమత్తమైన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం. సుందిళ్ల బ్యారేజీలపై సమగ్రంగా విచారణ జరపాలి.

## కాంగ్రెస్ మోసాలపై నిలదీయాలి...

# ప్రజల్లో చర్చ జరిగేలా చూడాలి

**నంగునూర్ మండల బిఆర్ఎస్ నాయకులు**

**నంగునూర్ మండలం, వెలుతురు మార్చ్04:** కాలేశ్వరం ప్రాజెక్ట ద్వారా లక్షల ఏకరాలకు నిల్లందించిన ఘనత కెసిఆర్ తెలంగాణ ప్రభుత్వం కాని కొంతమంది కాంగ్రెస్ నాయకులు కాలేశ్వరం ప్రాజెక్టుపై దుష్ప్రచారం చేస్తూ ఒక్క ఎకరానికి కూడా నీరు అందియని కేసీఆర్ ప్రభుత్వం అని వారు మాట్లాడుతున్నారు వారి మాటలను ప్రజలు గమనిస్తున్నారు అబద్ధపు హామీలతో గద్దెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం అమలు కాని హామీలతో ప్రజలను ఇబ్బంది పెడుతున్నారు

కరెంట్ రాకపోవడం వల్ల రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారు కాలిపోయే మోటార్లు పెలిపోయే ట్రాన్స్ఫార్మర్ ల దుస్థితిని కాంగ్రెస్ మళ్ళీ తెచ్చింది అర్హులు అంటూ గ్యాస్ సబ్సిడీ 30% శాతం మందికే ఇస్తూ మిగతా 70% వారికి మొండి చేయి చూపుతున్నారు ఇలాంటి కాంగ్రెస్ మోసాలను ప్రజలకు ఇంటింటికీ వెల్లి చెప్పాలి

మార్చి 17తో కాంగ్రెస్ 100 రోజుల పాలన పూర్తి చేసు కుంటున్నది. హామీలు అమలు చేయకుండా చోద్యం చూస్తున్న కాంగ్రెస్ ను నిలదీయాలి వానాకాలం వడ్లు బోనస్ ఇచ్చి కొనలేదు. వచ్చే యాసంగి పంటకు బోనస్ ఇచ్చి కొనుగోలు చేయాలని నిలదీయాలి కాంగ్రెస్ హామీలు అమలు కావాలంటే అనునిత్యం నిలదీసే బి ఆర్ ఎస్ తోనే అది సాధ్యం అవుతుంది రాజీ పడకుండా తెలంగాణ ప్రయోజనాలు కాపాడటం ఒక్క



బిఆర్ఎస్ తోనే సాధ్యం అవుతుందనే విషయాన్ని ప్రజలు గమనించాలి..

అధికారంలోకి వచ్చి మూడు నెలలు కావస్తున్న ఇచ్చిన హామీలు అమలు చేయడంలో కాంగ్రెస్ పార్టీ విఫలమైంది.

రెండు మూడు హామీలు అసంపూర్తిగా అమలు చేసి అన్ని చేసినట్లు ప్రచారం చేసుకుంటున్నది రుణమాఫీ చెల్లించకుండా చోద్యం చూస్తున్నది.

వాస్తవాలను ఎప్పటికపుడు అన్ని వర్గాల ప్రజలకు వివరించాలి కాంగ్రెస్ పాలన పై ప్రజల్లో ఇప్పటికే వ్యతిరేకత ప్రారంభం అయ్యింది అడుగడుగునా కాంగ్రెస్ ను నిలదీసే రోజులు ముందున్నాయి

ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్ రెడ్డి జడ్పిటిసి తడిసిన ఉమా వెంకట్ రెడ్డి రాష్ట్ర ఆయిల్ ఫామ్ వెల్ఫేర్ సొసైటీ ఉపాధ్యక్షులు ఎడ్ల సోమిరెడ్డి నంగునూరు కో-ఆపరేటివ్ చైర్మన్ కోల రమేష్ గౌడ్ పార్టీ మండల అధ్యక్షులు అనగోని లింగం గౌడ్ మాజీ మార్కెట్ చైర్మన్ సారయ్య పార్టీ సీనియర్ నాయకులు దువ్వల మల్లయ్య బద్దిపడగ కిష్టారెడ్డి రంగు రాజు బెదురు తిరుపతి బాల పోచయ్య కమల్ షరీఫ్ రచ్చ సిద్దు ఆకుపత్తిని రాము సారయ్య రవి మల్లేశం శ్రీనివాస్ కనకయ్య కృష్ణ తదితరున్నారు.

# వేసవిలో నీటి సమస్యలు తలెత్తకుండా కార్యచరణ చేపట్టాలి

**పంచాయతీ రాజ్ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా**

**రంగారెడ్డి జిల్లా, వెలుతురు మార్చ్04:** రానున్న వేసవిలో నీటి సమస్యలు తలెత్తకుండా కార్యచరణ చేపట్టాలని పంచాయతీ రాజ్ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా సూచనల మేరకు జిల్లాలో రానున్న వేసవిలో నీటి సమస్యలు తలెత్తకుండా కార్యచరణ చేపట్టాలని, సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయిలో త్రాగునీటి సరఫరాలో ఉత్పన్నమయ్యే సమస్యలను ఎప్పటి ఇవ్వటం, వెంటనే బోర్ల మరమ్మత్తులు, ఫ్లషింగ్ చేయించాలని ఆదేశించారు. వేసవిలో నీటి సమస్య రాకుండా నివారించుటకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. గ్రామ స్థాయిలో సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించి






సోమవారం పంచాయతీ రాజ్ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా సంబంధిత ఉన్నత అధికారులతో కలిసి అదనపు కలెక్టర్లు, పంచాయతీ అధికారులు, మిషన్ భగీరథ అధికారుల, గ్రామీణాభివృద్ధి అధికారులతో వేసవిలో నీటి సమస్యలు తలెత్తకుండా చేపట్టవల్సిన చర్యలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశం నిర్వహించారు.

వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్ సంబంధిత అధికారులతో మాట్లాడుతూ కప్పుడు గుర్తించి సరి చేయాలని అన్నారు. జిల్లాలోని అన్ని గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో నీటి సమస్యలు తలెత్తకుండా కార్యాచరణ రూపొందించాలని సంబంధిత అధికారులకు సూచించారు.

జిల్లాలోని రూరల్ ఏరియాల్లో, అర్బన్ ఏరి యాల్లో, హబిటేషన్స్‌లో ఎక్కడా త్రాగునీటి ఇబ్బంది కలుగకుండా చూసుకోవాలని అన్నారు. లీకేజ్ వంటి సమస్యలు తలెత్తకుండా పైప్ లైన్ మరమ్మత్తులు చేపట్టాలని, కొత్త పైప్ లైన్ కనెక్షన్లు అత్యవసరమైన మరమ్మత్తులు ఏమైన ఉన్నాయా అని పరిశీలించాలని సూచించారు. జిల్లాలో నీటి సరఫరాలో ఇబ్బందులు ఉంటే పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు తెలిపారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా గ్రామీణాభివృద్ది అధికారి శ్రీలత, జిల్లా పంచాయతీ అధికారి సురేష్ మోహన్, మిషన్ భగీరథ ఎస్.ఈ. ఆంజనేయులు, ఎస్.ఈ. పిఆర్ రాజేశ్వర్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ హైకమాండ్ అవకాశమిస్తే చూద్దాం...

**నేను సాధారణ కార్యకర్తను మాత్రమే**

**అప్పగించిన బాధ్యతలను**

**సమర్థవంతంగా పూర్తి చేస్తా**

**ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీపై గవర్నర్ ఆసక్తికర వ్యాఖ్యలు**

**హైదరాబాద్,మార్చి4(వెలుతురు):** పార్లమెంట్ ఎన్నికల బరిలోకి గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ రెడీ అవుతున్నారంటే అవుననే చెప్పాలి. దేవుడు కరుణించి భారతీయ జనతా పార్టీ హైకమాండ్ అవకాశమిస్తే చూద్దామంటున్నారు తమిళిసై. అటు అధిష్ఠానం కూడా కన్యాకుమారి లోక్‌సభ స్థానంపై స్పెషల్ ఫోకస్ పెట్టింది. తమిళనాడులోని లోక్‌సభ స్థానాలలో బీజేపీకి మంచి పట్టు ఉన్న స్థానం కన్యాకుమారి. దీంతో అక్కడ నుంచి తమిళిసైని పోటీ చేయించాలని బీజేపీ కసరత్తు చేస్తోంది. కన్యాకుమారిలో నాడార్ సామజిక వర్గం అత్యధికంగా ఉన్నారు. దీంతో అదే సామాజిక వర్గానికి చెందిన తమిళిసైకి ఇవ్వాలని బీజేపీ ఆలోచన చేస్తోంది. నాడార్ సామజిక వర్గానికి చెందిన నటుడు విజయ్ వసంత్‌పై తమిళిసైని పోటీ ఉంచేలా బీజేపీ కసరత్తు మొదలు పెట్టింది.. తెలంగాణ గవర్నర్ తమిళిసై ఎన్నికల్లో పోటీపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఇక ఇదే విషయమై తమిళిసైను ప్రశ్నించగా..దేవుడు కరుణించి, అటు బీజేపీ హైకమాండ్ కూడా అవకాశమిస్తే చూద్దామన్నారు తమిళిసై..తాను సాధారణ కార్యకర్తనని, తనకు అప్పగించిన



బాధ్యతలను సమర్థవంతంగా పూర్తి చేస్తానన్నారు. అలాగే భవిష్యత్‌లో బీజేపీ హైకమాండ్ ఏ బాధ్యతలు అప్పగించినా చేస్తా అన్నారు తమిళిసై. తమిళనాడు బిజెపి అధ్యక్షురాలిగా పనిచేసిన తమిళిసై సౌందర్యారాజన్ కి కేంద్రం గవర్నర్ గా అవకాశం కల్పించింది. 2019 సెప్టెంబర్ లో గవర్నర్ గా నియమిస్తూ రాష్ట్రపతి ఆదేశాలు జారీ చేశారు. ఆతర్వాత పుదుచ్చేరి ఇంచార్జ్ లెఫ్టెంట్ గవర్నర్ గా కూడా అదనపు బాధ్యతలు చేపడుతున్నారు. తెలంగాణ గవర్నర్‌గా, అలాగే పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టాక తనదైన మార్క్ చూపించారు తమిళిసై. తమిళిసై తీసుకున్న అనేక నిర్ణయాలు సంచలనంగా మారాయి. బీఆర్ఎస్ ప్రభుత్వం వర్సెస్ గవర్నర్ తమిళిసై అన్నట్లుగా మారింది. గవర్నర్ గా తమిళిసై సౌందర్యరాజన్ పదవీకాలం మరో నాలుగు నెలల్లో పూర్తి కానుంది. మరోసారి గవర్నర్ గా తమిళిసై ని కొనసాగిస్తారని చర్చ జరుగుతుండగా తాజాగా ఆమె ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. త్వరలో జరగనున్న లోక్ సభ ఎన్నికల్లో పోటీకి ఆసక్తిగా ఉన్నారన్న వ్యాఖ్యలు చేశారు తమిళిసై సౌందరాజన్. నాడార్ సామజిక వర్గానికి చెందిన తమిళిసైకి ఇవ్వాలని బీజేపీ ఆలోచన ఉన్నట్లు పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. 2014 లో కన్యాకుమారి నుంచి గెలిచి కేంద్ర సహాయమంత్రిగా రాధాకృష్ణన్ పనిచేశారు. 2019లో డీఎంకే కూటమిలో కాంగ్రెస్ ఈ స్థానాన్ని గెలుచుకుంది. నాడార్ సామజిక వర్గానికి చెందిన నటుడు విజయ్ వసంత్ పై తమిళిసై ని పోటీ దింపాలని బీజేపీ కసరత్తు చేస్తుంది. ఇపుడు పోటీపై ఆమె చేసిన వ్యాఖ్యలతో తిరిగి రాజకీయ ప్రవేశంపై జరుగుతున్న ప్రచారానికి తెరపడినట్లు అయ్యింది. ఇంకా గవర్నర్ గా పదవీకాలం ఉన్నా ముందుగానే రాజీనామా చేయించి పోటీ చేయించే ఆలోచనలో బీజేపీ అధిష్టానం ఉన్నట్లు తెలుస్తోంది.

# పనిమనిషే కిడ్నాపర్

**చేరిన రెండ్రోజులకే చిన్నారి అపహరణ**

**సిసి ఫుటేజ్ ఆధారంగా గంట్లో పట్టుకున్న పోలీసులు**

**హైదరాబాద్,మార్చి4(వెలుతురు):** పనిమనిషిగా ఇంట్లో చేరిన రెండు రోజులకే 9 నెలల చిన్నారిని ఎత్తుకెల్లిందో రాక్షసి. తల్లిదండ్రులు గమనించి.. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన పోలీసులు... సీసీ ఫుటేజ్ ఆధారంగా... కొన్ని గంటల్లోనే కేసును ఛేదించారు. జహీరాబాద్‌లో నిందితురాలని పట్టుకున్నారు. చిన్నారిని క్షేమంగా తల్లిదండ్రులకు అప్పగించారు. చిన్నారి దొరకడంతో అటు పేరంట్స్, ఇటు పోలీసులు ఊపిరిపీల్చుకున్నారు. కాస్త ఆలస్యమయితే. నిందితురాలు... తప్పించుకునేదని పోలీసులు అన్నారు. హైదరాబాద్ పాతబస్తీలోని మాదన్నపేటలో జరిగిందీ కిడ్నాప్. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన షహనాజ్‌ఖాన్ అనే మహిళ... చిన్నారి ఇంట్లో రెండు రోజుల క్రితమే పనికి కుదిరింది. చిన్నారి ఆరోగ్యం సరిగాలేకపోవడంతో... చంచల్‌గూడలోని నర్సింగ్‌హోమ్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఆ సమయంలోనే... చిన్నారి కిడ్నాప్ అయ్యింది. ఇంట్లో పని ముగించుకుని... ఆస్పత్రికి వచ్చిన షహనాజ్‌ఖాన్ ఎవరికీ తెలియకుండా పాపను ఎత్తుకెళ్లింది. చిన్నారి కనిపించకపోవడంతో... వెంటనే పోలీసులను ఆశ్రయించారు తల్లిదండ్రులు. సమీపంలోని సీసీ కెమరాలను పరిశీలించిన పోలీసులు... షహనాజ్‌ఖాన్ పాపను కిడ్నాప్ చేసినట్టు గుర్తించారు. ఆమె అక్కడి నుంచి ఎక్కడెక్కడికి వెళ్లిందని.. సీసీ ఫుటేజ్‌ను పరిశీలించారు. హైదరాబాద్ ఎంజీబీఎస్‌లో జహీరాబాద్ బస్సు ఎక్కినట్టు గుర్తించారు. వెంటనే జహీరాబాద్ పోలీసులను అప్రమత్తం చేశారు... మాదన్నపేట పోలీసులు. జహీరాబాద్ పోలీసులు వెంటనే... బస్టాండ్ దగ్గరకు చేరుకుని వేచి చూశారు. షహనాజ్‌ఖాన్ ఎక్కిన బస్సు కోసం ఎదురుచూశారు. ఆ బస్సు రాగానే అప్రమత్త మయ్యారు. చిన్నారితోపాటు బస్సు దిగిన షహనాజ్‌ఖాన్‌ను వెంటనే అదుపులోకి తీసుకున్నారు. చిన్నారిని క్షేమంగా తల్లిదండ్రులకు అప్పగించారు. కిడ్నాప్ జరిగిన కొన్ని గంటల్లోనే పోలీసులు కేసును ఛేదించారు. చిన్నారిని సేఫ్‌గా పేరంట్స్‌కు అప్పగించారు. నిందితురాలు షహనాజ్‌ఖాన్... ఛత్తీస్‌గఢ్‌కు చెందిన మహిళగా గుర్తించారు. అయితే... ఆమె చిన్నారిని ఎందుకు కిడ్నాప్ చేసింది...? ఎక్కడికి తీసుకెళ్లాలని అనుకుంది...? ఆమె వెనుక కిడ్నాప్ ముఠా ఉందా..? అన్న కోణంలో పోలీసులు విచారణ జరుపుతున్నారు .

చిన్నారి క్షేమంగా తమ చెంతకు చేరడంతో తల్లిదండ్రులు సంతోషపడుతున్నారు. పాప కిడ్నాప్ అయినట్టు వెంటనే గుర్తించడం... త్వరత్వరగా దర్యాప్తు జరగడంతో నిందితురాలిని పట్టుకోగలిగారు. చిన్నారులను కిడ్నాప్ చేసి... వారిని చిత్రహింసలు పెట్టి దివ్యాంగులుగా మారుస్తున్న ఘటన వెలుగుచూసింది. పిల్లలను దివ్యాంగులుగా మార్చి.. వారితో బెగ్గింగ్ చేయిస్తోంది ఈ ముఠా. ఈ మధ్య కాలంలో పిల్లల కిడ్నాప్‌లు ఎక్కువవుతున్నాయని... చిన్న పిల్లలను తల్లిదండ్రులు జాగ్రత్తగా చూసుకోవాలని సూచిస్తున్నారు పోలీసులు. గుర్తు తెలియని వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిస్తున్నారు.

## భువనగిరి హాస్టల్ విద్యార్థులు భవ్య, వైష్ణవి మరణాలపై

# సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి

**హైదరాబాద్ వెలుతురు మార్చి 04:**

ఫిబ్రవరి 3 న భువనగిరి పట్టణంలోని ఎస్సీ హాస్టల్లో ఉంటూ ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న భవ్య, వైష్ణవిల మరణం రాష్ట్ర ప్రజలను కలచివేసింది. ఈ వార్త విని మహిళా సంఘాలు, ప్రజా సంఘాలు భవ్య వైష్ణవిల తల్లిదండ్రులను కలిసి అలాగే హాస్టలును, అధికార యంత్రాంగాన్ని సందర్శించడం జరిగింది. తల్లి దండ్రులు చెప్పిన విషయాలు, హాస్టల్ పరిస్థితులు నిజనిర్ధారణలో అనేక ఆందోళనకరమైన విషయాలు తెలిశాయి.

భవ్య. వైష్ణవిల తల్లిదండ్రులు, బంధుమిత్రులు కన్నీరు మున్నీరై విలవిస్తూ చెప్పిన విషయాలను విశ్వసించాల్సిన అవసరం ఉంది. హాస్టల్లో వార్డెన్ శైలజ పూర్తి కాలం పర్యవేక్షణ చేయటంలేదు. హాస్టల్ లో ఆటో డ్రైవర్ ఆంజనేయులుదే పూర్తి అజమాయిషీ ఉన్నట్లు పరిశీలనలో తేలింది. అమ్మాయిల పట్ల అతని ప్రవర్తన కుడా సరిగా లేదని, ఆటో డ్రైవర్ అమ్మాయిల రూముల్లోకి వస్తున్నాడని, అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని, హాస్టల్ కు నేను వెళ్లనని కూడా సంక్రాంతి సెలవులకు వచ్చినప్పుడు భవ్య తల్లికి చెప్పుకుంది. హాస్టల్ లో భవ్య, వైష్ణవిలు ఏడవ తరగతి విద్యార్థులపై చేయి చేసుకుంటే ఆ వివాదాన్ని పరిష్కరించుటకు వారి తల్లిదండ్రులను పిలిపించి వారి సమక్షంలోనే కౌన్సిలింగ్ ఇప్పించాల్సింది పోయి వార్డెన్, ఆటో డ్రైవర్ కౌన్సిలింగ్ పేరు మీద పాఠశాల పనివేళలలో పాఠశాల నుండి హాస్టలు తీసుకువచ్చి విపరీతంగా కొట్టి వాళ్ళ చావుకు కారకులయ్యారు అనేది స్పష్టం అవుతుంది. సాయంత్రం ఐదున్నర నుంచి ఏడున్నర వరకు, అంటే సుమారు రెండు గంటలు, ఈ ఇద్దరు అమ్మాయిలు హాస్టల్ లో లేరనే సమాచారం కూడా ఉన్నది. ఇలాంటి కీలకమైన సాక్ష్యాలు ఎన్నో ఉన్నాయి. కానీ పోలీసులు వీటినన్నిటిని పరిగణనలోకి తీసుకోవడం లేదు. సాయంత్రం ఐదున్నరకు వైష్ణవి తండ్రితో ఫోన్ లో మాట్లాడిందని కూడా వైష్ణవి తండ్రి నాగరాజు తెలియజేస్తున్నాడు. రాత్రి తొమ్మిదికల్లా చనిపోయిందనే వార్త మొదట నాగరాజుకి చేరనే చేరింది. ఇంత అకస్మాత్తుగా బలమైన కారణం లేకుండా ఆత్మహత్య చేసుకున్నారని ఆరోపిస్తున్నారు పైగా ఆత్మహత్య చేసుకునేంత పిరికి వాళ్ళు కారు వారు. 14 సంవత్సరాలలోనే ఒక అర్థవంతమైన జీవితాన్ని జీవిస్తున్నవారు, అర్ధాంతరంగా ఆత్మహత్య చేసుకోవడం నమ్మశక్యంగా లేదు.

ఇక చనిపోయిన రోజు వార్డెన్ తల్లిదండ్రుల ముందుకు కనీసం రాలేదు. పిల్లల గురించి మాట్లాడలేదు. తప్పు చేయకుంటే ఎందుకు ముందుకు రావడం లేదు. భయమెందుకు? తల్లిదండ్రులకు చనిపోయిన భవ్య, వైష్ణవి లను చూడడానికి కూడా అనుమతించలేదు. శవాన్ని చూపిస్తే పిల్లల వంటిపై గాయాలు బయటపడి ఆందోళన చేస్తారనే ఉద్దేశంతో తల్లిదండ్రులతో సంతకం చేయించుకున్న తర్వాతే పోలీసులు వారి శవాలను మొక్కుబడిగా చూపెట్టారు. తల్లిదండ్రుల ఒత్తిడి మేరకే మళ్లీ శరీరాలను పరిశీలించి గాయాలను కనిపెట్టారు. 'గాయాలు ఏమీ లేవు' అని పోలీసులు ఎలా నిర్ధారించి మీడియా ముఖం బిఆర్ఎస్ ప్రకటిస్తారు? సూసైడ్ నోట్ కూడా పూర్తిగా సృష్టించబడిందన్నది నిర్వివాదాంశం. భవ్య ఆత్మహత్య చేసుకుంటే ఎంతో ప్రేమించే తన తల్లికి క్షమాపణ చెప్పి ఉండేది. కానీ ఇక్కడ నిత్యం వ్యతిరేకించే వార్డెన్ను 'మంచిది' 'మంచిది' 'మంచిది'

అని మూడుసార్లు ప్రస్తావించడం హాస్యాస్పదంగా ఉంది. పోస్టుమార్టం కన్నా ముందు పంచనామా కార్యక్రమం కూడా చట్టబద్ధంగా జరుపలేదు. ఇకపోతే వైష్ణవి తండ్రితో ఖాళీ పేపరుపై సంతకం తీసుకున్నారని, ఫిర్యాదు కూడా పోలీసులే రాశారనే ఆరోపణ కూడా బాధితులవైపు నుంచి వస్తున్నది. వాస్తవాలు వెలికి తీయాల్సిన పోలిసులు ఎందుకు ఒక పక్షాన్ని వెనకేసుకు వస్తున్నారు. భరోసా ఇవ్వాల్సిన పోలిసులు ఎందుకు ఆరోపణలు ఎదుర్కొనే దుస్థితి వస్తుంది.

ఫ్రెండ్లీ పోలీస్ అంటే అర్థం ఏమిటి? బాధితులకు భరోసా ఇవ్వాలి కదా. ఇక ప్రభుత్వ హాస్టల్స్ నిర్వహణ వ్యవహారం చూద్దాం. భువనగిరి స్థానికులు ప్రవీణ్ రెడ్డికి చెందిన సాయికృప ప్రైవేటు భవనంలో ప్రైవేట్ ఐటీఐ, జూనియర్ కాలేజ్, బాలుర హాస్టల్ మరియు వీటితో పాటు ప్రభుత్వ బాలికల హాస్టల్ మొత్తం నాలుగు రకాల హాస్టల్స్ ఒక్కచోటే ఉన్నవి . అమ్మయిలవీ అబ్బాయిలవీ ఒకే చోట నడుపుతారా? పైగా ఈ అమ్మాయిల హాస్టల్ కు కేవలం రెండు నెలల నుండి మాత్రమే ముసలి నైట్ వాచ్మెను నియమించారు. పేద పిల్లలంటే, అందులో అమ్మాయిలంటే, అంత చులకనా? ఎన్నికల ముందు మహిళల ఓట్ల కోసం అడగకుండానే పోటీపడి ఉచితాల మీద ఉచితాలు ప్రకటిస్తారు. ఎన్నికల తర్వాత మాత్రం చదువుకోవాలనే ఉత్సాహం ఉన్న అమ్మాయిలకు మెరుగైన సౌకర్యాలను, మంచి వాతావరణాన్ని అందించలేకపోతున్నారు. ప్రజలు ఆందోళన చేపడుతున్నా మహిళలకు రక్షణ కల్పించలేక పోతున్నారు.

బిఆర్ఎస్ పదేండ్ల ప్రభుత్వ పాలనలో ప్రియాంక, భూమిక అనే ఇద్దరు గిరిజన విద్యార్థినులను అత్యంత దారుణంగా చంపి ఆత్మహత్య అని చిత్రీకరించిన సంఘటనతో పాటు అనేక సంఘటనలను ప్రజలు ఇంకా మర్చిపోలేక పోతున్నారు. ఇలాంటి సంఘటనలు మళ్లీ పునరావృతము కాకుండా ఉండడం కోసం ఇప్పటికైనా భవ్య,వైష్ణవిల మరణాలపై నిజానిజాలను వెలికి తీయటానికి నిజాయితీగా సిట్టింగ్ జడ్జి చేత విచారణ చేపట్టవలసిన అవసరము ఉంది. ఈ మొత్తం వ్యవహారంలో బాధ్యత వహించవలసిన అమ్మాయిల కేర్ టేకర్ ఐన వార్డెన్ శైలజను, ఆటో డ్రైవర్ ఆంజనేయులు ను వెంటనే అరెస్టు చేయవలసిందిగా పౌర సమాజం డిమాండ్ చేస్తుంది.

రాష్ట్రంలోని అన్ని వసతి గృహాలను పర్యవేక్షించి, మెరుగుపరిచి, ప్రభుత్వ హాస్టల్స్ అన్నిటికీ సొంత భవనాలు సమకుర్చాల్సిన అవసరము ఉంది. ఇందులో భాగంగా రేపు

అనగా తేదీ: 5/02/2014 మంగళవారం రోజు ఇందిరాపార్కు వద్ద భువనగిరి ఎస్సీ హాస్టల్లోని భవ్య, వైష్ణవి మరణాల పై జ్యుడిషియల్ విచారణ జరిపి నిందితులను శిక్షించాలనీ డిమాండ్ చేస్తూ ధర్నా నిర్వహించడం జరుగుతుంది. కావున

భాదిత కుటుంబాలు, మహిళా సంఘాలు, విద్యార్థి, ఉపాధ్యాయ సంఘాలు, మరియు, బాలల హక్కుల సంక్షేమ సంఘం, ప్రజా సంఘాల ఆద్వర్యం లో జరిగే ధర్నాను విజయవంతం చేయాలని కోరుతున్నాము.

**ధర్నా డిమాండ్స్:**

హాస్టల్ వార్డెన్ శైలజ ఆంజనేయులుపై హత్యా నేరం నమోదు చేసి వెంటనే అరెస్ట్ చేయాలి.

ఈ కేసు విషయంలో మొదటి నుంచి నిర్లక్ష్యంగా వ్యవహరించిన స్థానిక ఎసిపి గారిని మరియు స్థానిక సి.ఐ., ఎస్.ఐ లను సస్పెండ్ చేయాలి.

జ్యుడిషియల్ విచారణ జరిపి దోషులను శిక్షించాలి.

అన్ని హాస్టల్స్ లో సిసి కెమెరాలు వెంటనే ఏర్పాటు చేయాలి.

ప్రతి సంక్షేమ హాస్టల్ కు పక్కభవనాలను నిర్మించి పర్మినెంట్ వార్డెన్లను నియమించాలి.

పోలీస్ పెట్రోలింగ్ ఏర్పాటు చేసి, ప్రతి బాలికల హాస్టల్లో పోలీస్ సిబ్బందితో భద్రత కల్పించాలి.

సంఘటన జరిగినప్పుడు ఆయా హాస్టల్ సిబ్బందిని బాధ్యులను చేసి కేసు ఫైల్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలి.ప్రతి హాస్టల్లో సైకియాట్రిస్టులను ఏర్పాటు చేసి ప్రతి వారం విద్యార్థులకు కౌన్సిలింగ్ ఇవ్వాలి.

అన్ని ప్రభుత్వ హాస్టళ్లకు మౌలిక వసతులు కల్పించాలి.

బాధిత కుటుంబాలకు 50 లక్షల రూపాయలు, ప్రభుత్వం ఉద్యోగంతో పాటు పక్కా ఇల్లు నిర్మించి ఇవ్వాలి.

భవ్య, వైష్ణవి న్యాయ పోరాట కమిటి తెలంగాణ
9849828402, 95732 16689






## బోరంపేట్ కోకా - కోలా ఎన్నికల్లో
# ఐఎన్టీయుసి ఏకగ్రీవ విజయం

**బోరంపేట్ వెలుతురు మార్చి 04:**
బోరంపేట్ డిపో హిందుస్థాన్ కోకా - కోలా బేవరేజెస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ యూనియన్ ఎన్నికల్లో ఐఎన్టీయుసి ఏకగ్రీవంగా విజయం సాధించిన సందర్భంగా ఐఎన్టీయుసి నాయకులకు శు



భాకాంక్షలు తెలిపి యాజమాన్యంతో ఇంట్రడక్షన్ మీటింగ్‌లో పాల్గొన్న పటాన్ చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి కాట శ్రీనివాస్ గౌడ్

## రావెళ్ళి యాదవ సంఘం అధ్వర్యంలో శ్రీ భ్రమరాంభ మల్లిఖార్జున స్వామి, జాతర ఉత్సవాలు ప్రారంభం...

### పాల్గొన్న ప్రజాప్రతినిధులు.

### కల్యానమహొత్సవం, అగ్ని గుండాలు, బండ్లు బోనాలుం

**వెలుతురు రావెల్లి, తూప్రాన్, మార్చ్, 04:**
మెదక్ జిల్లా, తూప్రాన్ మున్సిపల్ పరిధి లోని రావెల్లి గ్రామ శివారులో యాదవ సంఘం అధ్వర్యంలో సోమవారం ఉదయం శ్రీశ్రీశ్రీ భ్రమరాంభ మల్లిఖార్జున స్వామి కళ్యాణం కనుల పండువగా కమనీయంగా అంగరంగ వైభవంగా జరిగింది. బండ్లు, బోనాలు ఊరేగించి నైవేద్యం సమర్పించారు. సోమవారం ఉదయం అగ్ని గుండాలు, శ్రీశ్రీశ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి కళ్యాణ మహొత్సవం కన్నుల పండువగా అంగరంగ వైభవంగా జరిగింది. అనంతరం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నరేందర్ రెడ్డి, యాదవ సంఘం నాయకులు అంజయ్య యాదవ్, రావెల్లి గ్రామంలో అందరం కలిసికట్టుగా ఉండి ఐక్యతతో మల్లన్న జాతర, రేణుక ఎల్లమ్మ దుర్గమ్మ ఉత్సవాలను ఘనంగా జరుపుకుంటామని, మంగళవారం శ్రీశ్రీశ్రీ రేణుకా ఎల్లమ్మ తల్లి కళ్యాణం, బుధవారం ఉదయం దుర్గామాత, పోచమ్మ తల్లికి బోనాలు ఊరేగించి నైవేద్యం సమర్పిస్తారని రావేళ్ళి యాదవ సంఘం నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బూరుగుపల్లి నరేందర్ రెడ్డి, బావని అంజయ్య యాదవ్, బోలెబోయిన మల్లేష్ యాదవ్, బోల్లెబోయిన శ్రీనివాస్ యాదవ్, మహేష్ యాదవ్, సాయనోల్ల పోచయ్య యాదవ్, ఐలయ్య యాదవ్ , నరసింహులు, రాజయ్య యాదవ్, సాయనొల్ల మల్లేష్ యాదవ్, పెద్దగొల్ల కిషన్ యాదవ్,గొట్టిముక్కల శంకరయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.






## పెన్నార్ కార్మికులతో కాట సమావేశం

### కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

### మెరుగైన వేతన ఒప్పందం చేయిస్తా - కాట శ్రీనివాస్ గౌడ్

**బండ్లగూడ వెలుతురు మార్చి 04:**
బండ్లగూడ గ్రామంలోని పెన్నార్ పరిశ్రమలో తేదీ 06-03-2024 న జరగబోయే యూనియన్ ఎన్నికల సందర్భంగా పటాన్ చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి కాట శ్రీనివాస్ గౌడ్ గారి నివాసంలో పెన్నార్ పరిశ్రమ కార్మికులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యూనియన్ ఎన్నికల్లో ఐఎన్ టీయుసి మరియు సీఐటీయూ కూటమికి కార్మిక సోదరులు మద్దతు ఇచ్చి వారి అమూల్యమైన ఓటును ఎచుక్క గుర్తుపై వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. గెలిచిన తదనంతరం కార్మిక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ మెరుగైన వేతన ఒప్పందం చేయిస్తానని హామీ ఇచ్చారు.



## కనుల ముంగిట్లో - ప్రకృతి వాకిలిలో

**- శ్రీతేజ కలం**

నిత్య తేజ రవి కిరణం
సత్య శోభ భువి శిఖరం !!

అగ్ని సిరుల జలపాతం
వెన్నెల కనుల నయగారం !!

వాన చినుకుల మేఘోత్పాతం
నీడ జాడల సంక్లిష్ట సుచరితం
వెలుగు అడుగుల విక్రమాధిత్యం !!

ఆయుధ అలల కురుక్షేత్ర గమనం
కాన కాలముల సంగ్రామ సంయోగం
విద్య విభూషణ సుమధుర సుభాషితం !!

విజ్ఞాన వికసిత అష్టదిక్కుల ఆవర్తనం
ఇంద్రియ శోభిత సప్తసముద్ర విశ్లేషణం
అలుపు గెలుపుల అతీంద్రియ సంతులితం !!!



- శశికాంత్ మెంచు
(91)789-316-9944

# కదిలించిన మానవీయ కథనం


**వెలుతురు నల్లగొండ జిల్లా మార్చి 04:**
అయ్యో పాపం... ఎల్లమ్మ అంటూ ఒక దినపత్రిక లో వచ్చిన మానవీయ కథనం మమ్మల్ని ఎంతగానో కదిలించింది. సమాజంలో ఇలాంటి నిస్సహాయ స్థితిలో ఉన్న వారు ఎందరో ఉన్నారు. చిన్న చిన్న కారణాలతో పెన్షన్ , వృద్ధాప్య పింఛను రాక నానా అగచాట్లు పడుతున్న వారెందరినో మనం నిత్యం చూస్తూవుంటాము. అలాంటి వారికి సేవ చేయడం దైవ సంకల్పం గా భావిస్తూ "రఘు ఆరికపూడి సేవ ట్రస్టు" సోమవారం రోజున నల్గొండ జిల్లా ,మునుగోడు మండలం, గంగోరిగూడెం లో పోలియో భారినపడి 35 సంవత్సరాలుగా మంచానికే పరిమితం అయిన ఎల్లమ్మ ని పరామర్శించడం జరిగిందని సంస్థ చైర్మన్ రఘు తెలియజేశారు.

అక్కడ వున్న వారి కుటుంబ పరిస్థితులను గమనించి తక్షణ సహాయం గా దాదాపు ఒక ఆరు నెలలకు సరిపడా బియ్యం నిత్యావసర వస్తువులను ఈ రోజు అందజేయడం జరిగిందని రఘు తెలియజేశారు. అలాగే ఆరు నెలల పాటు ప్రతి నెలా మూడు వేల రూపాయలు పింఛను గూగుల్ పే ద్వారా అందిస్తామని తెలియజేశారు. తక్షణ సహాయం గా ఐదు వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని రోజు వారి ఖర్చుల నిమిత్తం ఇవ్వడం జరిగిందని రఘు మీడియా కి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు మహేష్ దయ్యాల , గ్రామస్తులు ఎల్లయ్య పాల్గొన్నారు.



# విభిన్న రుచుల లోగిళ్లు...
# ఆన్‌లైన్ వంటిళ్లు

వంటచేయడం రాదనే బెంగ అవసరం లేదుబంధువులొచ్చినా భయం వద్దుపిల్లలకు రోజూ వెరైటీ వంటకాల విందుఆన్ లైన్ లో వెలిసిన కిచెన్లుఫుడ్ బిజినెస్‌లో దూసుకుపోతున్న మహిళలు మనకు ఎన్నో పండుగలున్నాయి. పండుగల రోజు మనం ఏం చేస్తాం ? కేవలం పూజలు, వ్రతాలతోనే సరిపెడ తామా? పండుగలనేవి.. రకరకాల పిండివంటలు, రుచికరమైన ఆహార పదార్థాలను తయారుచేసుకుని కడుపారా ఆరగించి ఆనందించే సందర్భాలు. ఆ రోజుల్లో పేద, ధనిక తేడాలేకండా అందరి ఇంటి వంటగదులూ హడావుడిగా ఉంటాయి. గిన్నెలు, గరిటెల శబ్దాలు వినసొంపుగా చెవులను చేరుతుంటాయి. మరి ఇంకెందుకు ఆలస్యం... వెంటనే లాగిన్ అవ్వండి... నోరూరించే వంటలను చూసి నేర్చుకోండి.



ఇలాంటి సందర్భాల్లో కొత్తగా ఏం వంటలు చేయవచ్చు? కుటుంబ సభ్యులకు కొత్త రుచులను ఏ రకంగా అందించాలి? ఇవి సాధారణంగా ప్రతి మహిళకీ, ప్రతి గృహిణికీ ఎదురయ్యే సందేహాలు. అయితే మీ కోసమే ఈ ఆర్టికల్. చదవండి. ఆన్‌లైన్ వంట ఇళ్లలో లాగిన్ అవ్వండి. పెద్ద పెద్ద చదువులు చదివి కూడా ఆన్ లైన్ కిచెన్‌ని ప్రారంభించి, వంటలు, చెఫ్‌ల సమాచారాన్ని సృజనాత్మకంగా అందించి, తమ ప్రొడక్ట్‌కి బ్రాండ్ వేల్యూ పెంచుకుంటున్నారు. పాతకాలం అమ్మమ్మలు, బామ్మల కాలం నాటి పిండివంటల నుంచి నేటి తరం ఆధునిక యువత ఇష్టపడే ఫాస్ట్ ఫుడ్ వరకూ అన్ని రకాల సమాచారం ఒక్క క్లిక్‌లో లభ్యం.

**అర్చనాస్ కిచెన్:**

అర్చన ఓ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్, యోగా టీచర్. కొద్ది కాలానికి వివాహం, తల్లిగా కొత్త బాధ్యతలు. అంతటితో



ఆగలేదు. మరో కొత్త విభిన్న పాత్రకు సిద్ధమయ్యారు అర్చన. అలా మొదలైంది... అర్చనాస్ కిచెన్. ఆధునిక జీవనశైలి మన ఆరోగ్యంపై ఎంతో ప్రతికూల ప్రభావాన్ని చూపిస్తోందనేది కాదనలేని సత్యం. దీనిలో ముఖ్యమైనది ఫాస్ట్ ఫుడ్స్. అందుకే అర్చన దీనిపైనే దృష్టిపెట్టారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఫాస్ట్ ఫుడ్స్ రెసిపీలకి పోషక విలువలను జోడించి తన వెబ్ సైట్లో పోస్ట్ చేయసాగారు. అంతే కాదు... వివిధ సందర్భాలకు తగిన రెసిపీలు, సీజనల్ వంటలు... మరెన్నో రకాలు అర్చనాస్ కిచెన్ లో ఎప్పుడూ సిద్ధంగా ఉంటాయి.



**సుబ్బూస్ కిచెన్:**

దక్షిణ భారత వంటల ప్రత్యేకం "సుబ్బూస్ కిచెన్". దక్షిణ భారత ఆహార పదార్థాలకు ఎంతో పురాతన ప్రాశస్త్యం ఉన్నవి. ఆ సంప్రదాయ వంటకాలను తన సైట్ లో ఉంచారు సుబ్బు. "ఇవన్నీ నేను మా అమ్మ నుంచి నేర్చుకున్నా" అని గర్వంగా చెబుతారు ఆమె. చాలామందికి వంట చేయడం అంటే ఇష్టం ఉండదు. అలాంటివారికి దానిపై ఆసక్తిని పెంపొందించే ఉద్దేశంతో ఈ బ్లాగ్ ప్రారంభించారు. వంట అంటే బ్రహ్మవిద్యేమీ కాదు... ఇష్టంతో చేస్తే ఎంతో ఆనందంగా, సులభంగా నచ్చిన వంటకాన్ని వండివార్చేయొచ్చు. దానికి కావలసినదంతా సుబ్బూస్ కిచెన్ లో చూడవచ్చు.

**మంజులాస్ కిచెన్:**

జైనుల సిద్ధాంతం... "లివ్ అండ్ లెట్ లివ్" (బ్రతకండి, బ్రతకనివ్వండి). ఇదే మంజులాస్ కిచెన్‌ని నడిపించే మూలసూత్రం. కూరలు అందంగా కనబడేందుకు ఫ్లేవర్లను కలిపే బదులు... రుచి పెంచేందుకు కొద్ది మొత్తంలో మసాలా దినుసులు, సుగంధ దినుసులు కలపడం ఉత్తమం. పైగా ఇది పురాతన కాలం నుంచీ వస్తున్న అలవాటు. ఈ రకంగా సహజసిద్ధమైన పద్ధతుల్లో తయారయ్యే పదార్థాల వివరాలెన్నో మనం ఈ సైట్ ని బ్రౌజ్ చేస్తుంటే తెలుసుకోవచ్చు. ఇక్కడున్న వీడియోలు, ట్యుటోరియల్స్ చూసి ఎవరైనా... చాలా సులభంగా రుచికరమైన పదార్థాలు తయారుచేయవచ్చు.

**బేకర్ ఇన్ డిస్గైజ్:**

బేకింగ్... ఇదొక ఆర్ట్. మన చుట్టూ ఎన్నో బేకరీలు ఉంటాయి... కానీ అన్నింట్లో ఐటమ్స్ రుచిగా ఉండవు కదా. అందుకే బేకింగ్ ఈజ్ యాన్ ఆర్ట్. ఆ ఆర్ట్‌లో ప్రత్యేకత సాధించింది శర్వాణి. ఏ పదార్థాన్ని ఎంత పాళ్లలో కలపాలి, ఏ టెంపరేచర్ వద్ద ఎంతసేపు ఒవెన్‌లో ఉంచాలి... ఇవన్నీ ఒకరు చెబితే వచ్చేవి కాదు అంటారు శర్వాణి. చేస్తున్న పనిపై ఆసక్తి, అభిరుచి ఉన్నప్పుడే ఫలితం కూడా గొప్పగా ఉంటుందనేది ఆమె నమ్మకం. ఈ నమ్మకమే ఆమెను ప్రత్యేకంగా నిలబెట్టింది. బేకర్ ఇన్ డిస్గైజ్‌లో మీరు శర్వాణి సొంత రెసిపీలతో పాటు మరెన్నో రెసిపీల గురించి తెలుసుకోవచ్చు.



**శైలూస్ ఫుడ్:**

ఫుడ్ బ్లాగుల్లో ప్రముఖమైన వాటిలో శైలూస్ ఫుడ్ ఒకటి. ఇలా ఎందుకంటున్నామో తెలియాలంటే ఓసారి మీ కంప్యూటర్లో "శైలూస్ ఫుడ్" ఓపెన్ చేయండి. కంప్యూటర్ స్క్రీన్ పై ఫొటోలు చూస్తుంటేనే మనకు నోరూరుతుంది. అంత అందంగా ఉంటాయి శైలూస్ కిచెన్ లో సిద్ధమైన ఆహారపదార్థాలు. ఈ బ్లాగ్ లో భారత్ లోని అన్ని ప్రాంతాల ఫుడ్ ఐటమ్స్ వివరాలు ఉంటాయి. ముఖ్యంగా ఆంధ్రా రెసిపీలకు ఇది ప్రత్యేకమని చెప్పుకోవచ్చు.

**షో మి ద కర్రీ:**

వంట ఎలా చేయాలి అనేది తెలుసుకోవడం ఎంత ముఖ్యమో వంట ఎలా చేయకూడదు అనేది తెలుసుకోవడం అంతకన్నా ముఖ్యం. హేతల్, అనూజ... వీరిద్దరూ తమ పిల్లలకి, కుటుంబానికి చాలా సంవత్సరాలు ఆహారం వండిపెట్టారు. ఎవరికైనా సర్వసాధారణం... అప్పుడప్పుడూ రుచి కొద్దిగా అటూఇటూ అవ్వడం. దీనికి వీరిద్దరూ అతీతులేమీ కాదు. అలా వారి కుటుంబం, పిల్లలూ నిత్యం ఇస్తున్న ఫీడ్ బ్యాక్ వారిలో ఓ కొత్త ఆలోచన రేకెత్తించింది. ఎందుకు ఓ వెబ్ సైట్ ప్రారంభించకూడదు అని. అంతే... దక్షిణ భారత వంటల రెసిపీలతో సైట్ సిద్ధం చేశారు. ఇందులో కేవలం వారి రెసిపీలే కాదు... వంట చేస్తున్న సమయంలో మీ అనుభవాలు, అభిప్రాయాలు ఇతరులతో పంచుకోవచ్చు. అలాగే మీ కొత్త వంటలు, ఫెయిలైన రెసిపీలు... తద్వారా కలిగిన అనుభవాలను సరదాగా వీడియోలు, పాడ్ కాస్ట్‌ల రూపంలో పోస్ట్ చేయవచ్చు.

**మై డైవర్సిటీ కిచెన్:**

ఇది కేవలం ఓ రెసిపీ బ్లాగ్ మాత్రమే కాదు... అపర్ణ జీవితం. అపర్ణకి ఓ ప్రత్యేకమైన ఆసక్తి ఉంది. అదేమిటంటే... రకరకాల ఆహార పదార్థాలను తయారుచేసి, వాటిని తన సొంత కెమెరాతో ఫొటోలు తీసుకుని చూసి మురిసిపోయేది. ఆ ఆసక్తే ఈరోజు "మై డైవర్సిటీ కిచెన్"లో విస్తృత ఫొటో లైబ్రరీ ఏర్పాటుని సులభం చేసింది. ఈ బ్లాగ్‌కి ఉన్న మరో ప్రత్యేకత... ఇందులో ఉన్నవన్నీ వెజిటేరియన్ రెసిపీలు మాత్రమే. బియ్యం, కూరలు, పప్పులు, కొబ్బరి... ఇలా సాధారణంగా ఇంట్లో లభించేవాటితోనే విభిన్న రుచులను సిద్ధం చేసే మెళకువలు ఎన్నో ఈ బ్లాగ్ లో లభ్యమవుతాయి. కేవలం భోజన సంబంధ పదార్థాలే కాదు... వెనిలా వంటి వివిధ ఫ్లేవర్ల ఐస్ క్రీమ్, చాక్లెట్ తయారీ వంటివి కూడా "మై డైవర్సిటీ కిచెన్" మనకు నేర్పిస్తుంది.

**ఎడిబుల్ గార్డెన్:**

నాగ్స్... ఈమె కేరళ, హైదరాబాద్, ఆస్ట్రేలియాలోని సిడ్నీ నగరాల్లో వివిధ ఫుల్ టైమ్, పార్ట్ టైమ్ ఉద్యోగాలు చేస్తూ... పెళ్లి, భర్త, పిల్లలు... ఇవే జీవితంగా గడిపేవారు. అయితే ఇది ఆమెకు సంతృప్తి నివ్వలేదు. ఇంకా ఏదో ప్రత్యేకంగా చేయాలని నిరంతరం తపనపడేవారు. ఆ తపన నుంచి పుట్టినదే "ఎడిబుల్ గార్డెన్". ఆన్ లైన్ లో విహరించే మహిళల్లో ఈ బ్లాగ్ పేరు తెలియనివారు ఉండరంటే అతిశయోక్తి కాదేమో! తన కేరళ, తమిళనాడు వంటకాలకు, విదేశీ రెసిపీలను జతచేసి అందించడమే ఈ గార్డెన్ ప్రత్యేకత. కొత్త కొత్త వంటకాలను ఎలా తయారుచేయాలనేదానిపైనే నాగ్స్ దృష్టి. అందుకే ఈ బ్లాక్ మిగిలిన వాటికంటే భిన్నంగా ఉంటుంది.

**నిషా మధులిక:**

నిషా వివరించే వంటకాలను మనం కూడా చాలా సులభంగా మన ఇళ్లలో తయారుచేసుకోవచ్చు. భారత దేశంలోని వివిధ ప్రాంతాల్లో ప్రసిద్ధిచెందిన వంటలను అందించడమే ఈ వెబ్ సైట్ ప్రత్యేకత. మొదట్లో కేవలం రెసిపీలకు సంబంధించిన ఆర్టికల్స్ మాత్రమే ఈ సైట్ లో ఉండేవి. క్రమంగా వీడియో ట్యుటోరియల్స్ కూడా పోస్ట్ చేయసాగారు. ఈ వీడియోలు, రెసిపీలు అన్నీ హిందీభాషలో ఉండటం ఈ సైట్ ప్రాచుర్యానికి మరింత దోహదపడింది.



## 100 వంటలు చేస్తుంది!

బెంగళూరుకి చెందిన మెకానికల్ చెఫ్ ఘుమఘుమలాడే భారతీయ వంటకాలు చేస్తుంది. సుమారుగా 100 వంటలను అవలీలగా చేసి పెడుతుంది. ఇందులో ఉండే సూచనలను పాటిస్తూ రుచికరమైన వంటకాలను మనకు రుచి చూపిస్తుంది.

వంట వండాలంటే పెద్ద ప్రహసనమే చేయాలి. కొన్నిసార్లు ఉప్పు, కారాలు ఎక్కువైతే.. కొన్నిసార్లు ఏ రుచిపచి ఉండవు. అన్నీ కుదిరినప్పుడు మాత్రం అవురావురుమంటూ లాగించేస్తాం. అలా రోజూ లొట్టలేసుకుంటూ తినడానికి



ఓ రోబో వంట చేయబోతున్నది. మనకు కావాల్సిన వంటకాలకు సంబంధించిన పదార్థాలను ఈ రోబో పైన ఉండే బాక్సుల్లో నింపాల్సి ఉంటుంది. అది వంటకాలకు కావాల్సినంత మోతాదులో తీసుకొని వంట పూర్తి చేస్తుంది. ముందుగా మనకు కావాల్సిన వంటకమేదో దీనికి అనుసంధానమై ఉన్న కంప్యూటర్ సహాయంతో దానికి అసైన్ చేయాలి. దీన్ని బెంగళూరుకి చెందిన సోహన్ సుజే కార్లోస్, అర్పిత్ శర్మ అనే ఇద్దరు తయారుచేశారు. ఇందులో సోహన్ మెషీన్ లెర్నింగ్ రీసెర్చర్, అర్పిత్ ఎయిరోస్పేస్ ఇంజినీర్. వీళ్లిద్దరూ కలిసి ఎంతో శ్రమపడి దీన్ని తయారు చేశారు.

అయితే ఇంకా గ్రైండింగ్, ప్రెషర్ కుక్కింగ్‌లాంటివి ఈ రోబోకు పెద్దగా చేయడం రాదు. ఇప్పటిదాకా ఉప్మా, చోలే మసాలా, మటర్ పన్నీర్, దాల్ తడ్‌ఖా.. ఇలాంటి వందకు పైగా వంటకాలను ఇది చేయగలదు. వంటరాని అమ్మాయిలకు, బ్రహ్మచారులకు ఇదో పెద్ద వరమే అని చెప్పొచ్చు. ఇది ఇంకా ప్రయోగదశలోనే ఉంది. అతి త్వరలోనే దీన్ని మార్కెట్‌లోకి విడుదల చేయనున్నారు.

## పెండలంతో వంటలు


దుంప జాతికి చెందిన పెండలం వాడకం ఆహార పదార్థాల్లో తక్కువే. విలువైన పోషకాలున్న ఈ దుంపలతో చేసే విభిన్నమైన వంటలు మంచి రుచినే కాదు, శరీరానికి ఆరోగ్యాన్ని ఇస్తాయి. కార్బోహైడ్రేట్లు, ప్రొటీన్లు, విటమిన్లు, పొటాషియం, పీచు వంటి పోషకాలు వీటిలో సమృద్ధిగా లభిస్తాయి. యాంటీ ఆక్సిడెంట్లు, ఒమేగా 3 ఫ్యాటీయాసిడ్లు అధికంగా ఉంటాయి. మహిళల్లో ఈజెన్ స్థాయిల్ని పెంచేందుకు దోహదపడతాయి. పెండలం ఆకులను నీటిలో మరగబెట్టి తాగితే విరేచనాలు, తలనొప్పి, తిమ్మిర్లు తగ్గుముఖం పడతాయి. చేదు తగ్గడానికి పెండలం ఆకుల రసంలో కాస్త తేనె వేసుకుని తాగితే శరీరం తక్షణం శక్తిని పుంజుకుంటుంది. పెండలంతో పలురకాల కూరలు, చట్నీలు, గ్రేవీలు, కెబాబ్‌లు, పులుసు, చిప్స్ వంటివి చేస్తారు. కొన్ని ప్రాంతాల్లో దీన్ని 'తెల్లకంద'గా వ్యవహరిస్తారు.

**చిప్స్**



పెండలం 1 కేజీ
కారం 1/2 కప్పు
పుట్నాల పప్పు 1 కప్పు
వేరుశెనగ పప్పు 1 కప్పు
కరివేపాకు కాస్త
నూనె 250 గ్రా.
ఉప్పు 5 చెంచాలు
జీలకర్ర 2 చెంచాలు

పెండలం దుంపలపై చెక్కు తీసి ఉప్పు రాసి కాసేపు ఎండలో పెట్టాలి. నీరంతా ఇగిరిపోయాక దుంప ముక్కలను సన్నగా తరగాలి. బాణలిలో నూనె కాగాక వేరుశెనగ పప్పు, పుట్నాల పప్పు, జీలకర్ర, పెండలం ముక్కలను దోరగా వేయించాలి. చివరగా ఉప్పు, కారం కలపాలి. ఈ చిప్స్‌ను సాయంత్రం వేళ స్నాక్స్‌గా తినొచ్చు.



**పులుసు**

పెండలం ముక్కలు 5 కప్పులు
చింతపండు రసం 8 కప్పులు
కొత్తిమీర కొంచెం
నువ్వుల పొడి 1/2 కప్పు
కరివేపాకు కొంచెం
కొబ్బరి కోరు 1/2 కప్పు



బియ్యప్పిండి 1 కప్పు, మెంతులు 1 చెంచా
జీలకట్ట 1 చెంచా, ఇంగువ కాస్త
పసుపు కొంచెం, , ఎండుమిర్చి 5
పచ్చిమిర్చి 5, ఉల్లిముక్కలు 1 కప్పు
ఉప్పు 2 చెంచాలు

బాణలిలో పోపులు వేయించి, అందులో కొబ్బరి కోరు కలపాలి. చింతపండు రసాన్ని మరగించాక పోపు కలపాలి. వేరే గిన్నెలో ఉల్లి, పెండలం ముక్కలు ఉడికించి, మరగించిన చింతపండు రసంలో వేయాలి. చివరగా ఇంగువ, బియ్యప్పిండి కలిపి, పొంగు వస్తుండగా పులుసును కిందకు దింపేయాలి.

**కూర**



పెండలం ముక్కలు 2 కప్పులు
ఉప్పు 1 చెంచా
పసుపు 1/2 చెంచా
ఎండుమిర్చి 5
మినప్పప్పు, శెనగపప్పు 4 చెంచాలు
ఆవాలు, జీలకట్ట 2 చెంచాలు
పచ్చిమిర్చి 6
కరివేపాకు కొంచెం

పసుపు, ఉప్పు వేసి పెండలం ముక్కల్ని నీటిలో ఉడికించి వార్చి పెట్టాలి.

బాణలిలో పోపులు వేయించాక అందులో నలగ్గొట్టిన ఎండుమిర్చి, పచ్చిమిర్చి, పెండలం ముక్కలు, ఉప్పు కలపాలి. చివరగా నిమ్మరసం వేయాలి. ఈ కూర అన్నం, చపాతీ, పూరీల్లోకి బాగుంటుంది.


**అల్లం కూర**

అల్లం, పచ్చిమిర్చి పేస్ట్ 1/2 కప్పు
పెండలం ముక్కలు 4 కప్పులు
నూనె 5 చెంచాలు, ఎండుమిర్చి 4
కరివేపాకు కొంచెం,
పోపులు 4 చెంచాలు
ఉప్పు 2 చెంచాలు
పసుపు 1/2 చెంచా

ముందుగా ఉప్పు, పసుపువేసి పెండలం ముక్కలను ఉడికించాలి. బాణలిలో పోపులు వేయించి, పచ్చిమిర్చి పేస్ట్ కలపాలి. ఇందులో పెండలం ముక్కలు, ఉప్పు వేస్తే రుచికరమైన కూర సిద్ధం.



## నెయిల్ ఫాయిల్



రెట్రో ఫ్యాషన్ ఇప్పుడు గోళ్లకూ పాకింది. 80లనాటి ఫాయిల్ ట్రెండ్ మళ్లీ లేటెస్ట్ ఫ్యాషనైపోయింది. మెరిసే మెటాలిక్ రంగులతో గోళ్లను పెయింట్ చేయటం తాజా ఫ్యాషన్ ట్రెండ్. మరి ఈ ట్రెండ్‌ను మీరూ ఫాలో కావాలంటే ఈ టిప్స్ ఫాలో అయిపోండి.

**సింపుల్ స్టెప్స్**

ట్రాన్స్‌పరెంట్ ఎనామిల్ లేదా నెయిల్ గ్లూను గోళ్లకు వేయాలి.

ఇప్పుడు గోల్డ్ లేదా సిల్వర్ ఫాయిల్ తీసుకుని గోళ్లకు అంటించి కొద్ది సెకండ్లపాటు అలాగే వదిలేయండి.

ఫాయిల్ రంగు గోళ్లకు అంటుకున్న తర్వాత నెమ్మదిగా ఫాయిల్‌ను పీకేయండి.

చివర్లో గోళ్లకు ట్రాన్స్‌పరెంట్ ఎనామిల్‌తో కోటింగ్ వేస్తే గోళ్లకు అంటుకున్న రెట్రో కలర్ నిలిచి ఉంటుంది.

## ఇవి ఉంటే మేలు!

కొత్త ప్రదేశాలకు వెళ్లినప్పుడు అవసరమైన వస్తువులను సర్దుకుంటాం. ఆ జాబితాలో మేకప్ కిట్ కూడా ఉంటుంది. అన్నీ కాకుండా, రెండు మూడు పనులకు ఉపయోగపడే వస్తువులు మేకప్ కిట్‌లో ఉండేలా చూసుకోవాలి. అవేంటో తెలుసుకుందాం..



**లిప్‌స్టిక్:** బ్లష్‌గా కూడా ఉపయోగించేందుకు వీలుండే లిప్‌స్టిక్‌ను తీసుకెళ్లాలి. కళ్లు పెద్దవిగా కనిపించేందుకు కనుపాపలు, కళ్ల చుట్టూరా చక్కగా దిద్దుకోవాలి.

**కనుబొమల పెన్సిల్:** చివర్లో బ్రష్ ఉన్న వాటర్ ప్రూఫ్ కనుబొమల పెన్సిల్‌ను ఎంచుకోవాలి. దీన్ని కనుబొమలను సరిదిద్దడానికి, కాటుక అద్దుకోడానికి కూడా వాడొచ్చు.

**పెట్రోలియం జెల్లీ:** ఇది కనుబొమలకు జెల్‌గానూ, చాప్‌స్టిక్‌గానూ ఉపయోగపడుతుంది.

**కాటుక:** దీన్ని లిక్విడ్ లైనర్‌గా వాడొచ్చు. బ్రష్ ఉన్న కళ్ల లైనర్‌ను తీసుకుంటే మంచిది.

**రోజ్ వాటర్:** మేకప్ వేసుకొనే ముందు రోజ్‌వాటర్‌ను టోనర్‌గా ఉపయోగించండి. మేకప్ తీసేసేందుకు కూడా ఈ వాటర్‌ను వాడొచ్చు.

## టాటూ వేయించుకున్నారా?

టాటూ వేయించుకోగానే సరిపోదు. దాని ప్రభావం తగ్గించుకుని, టాటూ అందాన్ని పెంచుకోవాలనుకుంటే కొన్ని జాగ్రత్తలు పాటించాలి! అవేమిటంటే...



టాటూ వేయించుకున్న 1 3 గంటల్లో బ్యాండేజీ తొలగించాలి.

యాంటీ బ్యాక్టీరియల్ సబ్బుతో టాటూ వేయించుకున్న ప్రదేశం శుభ్రం చేసుకోవాలి.

తర్వాత యాంటీ సెప్టిక్ ఆయింట్‌మెంట్ అప్లై చేసుకోవాలి.

ఇలా ప్రతి రోజూ చేయాలి.

నాలుగో రోజు మాయిశ్చరైజర్ వాడడం మొదటు పెట్టాలి.

మూడు వారాలపాటు రోజులో వీలైనన్నిసార్లు మాయిశ్చరైజర్ అప్లై చేస్తూ ఉండాలి.

టాటూ నానేలా నీళ్లలో తడవకూడదు... టాటూకు ఎక్కువ సేపు ఎండనూ తగలనివ్వకూడదు.

టాటూ పాడవకుండా సన్‌స్క్రీన్ వాడాలి.

టాటూ మానిపోయే సమయంలో గోకడం, గిల్లడం చేయకూడదు.

## ఇయర్ రింగ్స్ ఎంపిక

స్టడ్స్, హ్యాంగింగ్స్, ఇయర్ జాకెట్స్... ఇయర్ వేర్‌లో బోలెడన్ని రకాలు. వీటిలో కంటికి నచ్చినది కొని ధరించడం కంటే ముఖాకృతికి మ్యాచ్ అయ్యేవి ధరిస్తే ఆకర్షణీయంగా కనిపిస్తారు!



**గుండ్రటి ముఖం:** పొడవాటి లేదా కోలగా ఉండే ఇయర్ హ్యాంగింగ్స్ ఈ ముఖాకృతికి సూటవుతాయి. ఇందుకోసం టియర్‌డ్రాప్, డ్యాంగ్లర్లు ఎంచుకుని, గుండ్రంగా ఉండే వాటికి దూరంగా ఉండాలి.

**కోల ముఖం:** ఈ ముఖాకృతికి ఎలాంటి ఇయర్ రింగ్స్ అయినా సూటవుతాయి. కాబట్టి టియర్‌డ్రాప్ లేదా స్టడ్స్ ఎంచుకోవచ్చు.

**హృదయాకార ముఖం:** డ్యాంగిల్స్, టియర్‌డ్రాప్స్, షాండ్లియర్ ఇయర్ రింగ్స్ నప్పుతాయి.

**నలుచదరపు ముఖం:** ఈ ముఖాకృతి సమంగా కనిపించడం కోసం గుండ్రటి ఇయర్ రింగ్స్ ఎంచుకోవాలి. ఇయర్ హ్యాంగింగ్స్, డ్యాంగ్లింగ్స్, ఇయర్ హూప్స్ బాగుంటాయి.


**వజ్రాకృతి ముఖం:** డ్యాంగిల్, హూప్ ఇయర్ రింగ్స్ ఎంచుకోవాలి. డైమండ్ షేప్‌లో ఉండే ఇయర్ రింగ్స్ ధరించకూడదు.

## ఒక టీషర్ట్ తయారీకి 2700 లీటర్ల నీరు

### ఫాస్ట్ ఫ్యాషన్‌లో వ్యర్థాలలో గణనీయ పెరుగుదల

### గ్రీన్ హౌస్ గ్యాసెస్ లక్షల టన్నులు

**భూమి మీద అత్యంత కాలుష్యకారకాలు ఏవంటే ముందుగా పరిశ్రమలు, తర్వాత వాహనాలు అంటారు చాలా మంది. కానీ, ఫ్యాషన్ రంగం కూడా కాలుష్యకాసారాన్ని పెంచుతోందని, సీజనల్ ఫ్యాషన్‌ల కారణంగా కాలుష్యస్థాయి వేగంగా పెరుగుతుందంటున్నాయి అధ్యయనాలు. ఏటా 80 బిలియన్ గార్మెంట్స్‌ను అధికారికంగా ఆయా సంస్థలు ఉత్పత్తి చేస్తున్నాయి. ఒక్క టీషర్ట్ తయారు చేయడానికి 2700 లీటర్ల నీటిని వినియోగించాల్సి వస్తున్న పరిస్థితుల్లో ఎన్ని టీఎంసీల నీటిని వస్త్రరంగంలో వినియోగిస్తున్నామో అంచనా వేయ లేం. ఫాస్ట్ ఫ్యాషన్‌లు, యూజ్ అండ్ త్రో కల్చర్ పెరగడంతో గ్రీన్‌హౌస్ గ్యాస్‌లూ వాతావరణంలో కలుస్తున్నాయి.**



# ఫ్యాషన్.. పొల్యూషన్

గ్రీన్‌పీస్ అధ్యయనాల ప్రకారం 2000 నుంచి 2014 మధ్యకాలంలో ఈ ఫాస్ట్ ఫ్యాషన్‌ల కారణంగా వస్త్ర ఉత్పత్తి రెట్టింపైంది. అంతేకాకుండా 15 ఏళ్ల క్రితం నాటితో పోలిస్తే 60 శాతం వేగంగా ఇప్పుడు వస్త్రాలు కొనుగోలు చేయడం, డిస్పోజ్ కూడా చేస్తున్నారు. ఇదే ఇప్పుడు పర్యావరణ వేత్తల ఆందోళనకు, ఫ్యాషన్‌హౌస్‌ల అప్రమత్తతకూ కారణమైంది. దీంతో పర్యావరణ పరిరక్షణలో ఫ్యాషన్ అండ్ సస్టెయినబిలిటీ మంత్రం జపిస్తున్నాయి. లాక్మే ఫ్యాషన్‌వీక్‌లో సస్టెయినబల్ ఫ్యాషన్ అవార్డులను అం దిస్తూ సర్క్యులర్ డిజైన్ ఛాలెంజ్ (సీడీసీ)ని నిర్వహిస్తోంది. దేశంలోని ఔత్సాహిక డిజైనర్లకు ఈ తరహా ఫ్యాషన్‌లపై అవగాహన కల్పించడంతో పాటు వారిని ఆ దిశగా ప్రోత్సహించడాన్ని ఈ అవార్డులు లక్ష్యంగా చేసుకుంటున్నాయి. దీంతో పేరొందిన డిజైనర్లు సైతం ఇప్పుడు సస్టెయినబిలిటీ ఫ్యాషన్‌లను ప్రదర్శిస్తున్నారు. రాజేష్ ప్రతాప్ సింగ్ ఆస్ట్రేలియన్ కంపెనీ లెంజింగ్ టెన్సిల్‌తో కలిసి కలెక్షన్ విడుదల చేస్తే డిజైనర్ మిలోనీ వోరా ఆర్గానిక్ కాటన్, రీసైకిల్డ్ ఊల్, ముడిసిల్క్‌తో తన కలెక్షన్ విడుదల చేశారు. ఇక విద్యార్థులైతే వీలైనప్పుడల్లా వ్యర్థాలతో కలెక్షన్ తీర్చిదిద్ది పర్యావరణం పట్ల ప్రేమ చాటుతున్నారు.

**సస్టెయినబిలిటీ నినాదం..**


జరుగుతున్న విధ్వంసాన్ని తమకు చేతనైంతగా తగ్గించాలని ప్రయత్నిస్తున్నారు. సుప్రసిద్ధ డిజైనర్లు, బ్రాండ్లు కూడా సస్టెయినబిలిటీ మం త్రం జపిస్తున్నాయి. స్టెల్లా మెక్‌కార్టినీ, హెచ్ అండ్ ఎం లాంటి అంతర్జాతీయ బ్రాండ్లు, రాజేష్ ప్రతాప్ సింగ్, మిలోనీ వోరా లాంటి డిజైనర్లు వ్యర్థాల నుంచి డిజైన్ చేసి, తమ కలెక్షన్‌ను విడుదల చేశారు. మెటీరియల్స్‌ను నాశనం కాకుండా పునర్ వినియోగించి, సహజవనరులను కాపాడుతున్నారు.

**పర్యావరణంపై ప్రేమ..**

ఇటీవల ముగిసిన లాక్మే ఫ్యాషన్‌వీక్‌లో సస్టెయినబల్ ఫ్యాషన్ డే అంటూ ఒక రోజును పూర్తిగా పర్యావరణస్పృహతో తమ కలెక్షన్ రూపొందించిన డిజైనర్లకు కేటాయించారు. సీడీసీ పేరిట సస్టెయినబల్ ఫ్యాషన్ అవార్డునూ అందజేశారు. దేశంలోని 30 నగరాల నుంచి 900 మంది డిజైనర్లు, స్టార్టప్స్ తమ ఆలోచనలు పంపించారంటే మనవాళ్లకు పర్యావరణం పట్ల పెరిగిన ప్రేమకు అద్దం పడుతుంది.

**మన అభిరుచులే మన శత్రువులు..!**

ఒకే తరహా వస్త్రాలను ఎక్కువ కాలం ధరించడం కష్టం. అందునా మాల్స్ కల్చర్ పెరిగి, సీజనల్ ఫ్యాషన్లు రాజ్యమేలుతు న్నాయి. ఇవి చాలదన్నట్లు టెంప్టింగ్ ఆఫర్లు ఉండనే ఉంటాయి. కానీ, ఆ ఆఫర్లు నిజంగానే మనకు ప్రయోజనం కలిగిస్తున్నాయా? అంటే సందేహమే. ఫాస్ట్ ఫ్యాషన్ ఎప్పుడూ కూడా తక్కువ ధరలు, సీజన్స్‌కు అనుగుణంగా డిజైనర్లు రూపొందించిన వస్త్రాలను అందుబాటులోకి తీసుకురావడానికి ప్రయత్నిస్తుంటాయి. ప్రకాశవంతమైన రంగులు, ప్రింట్స్, ఫ్యాబ్రిక్ ఫినిషింగ్, ఫ్యాషన్ ఫాబ్రిక్స్‌లో సాధారణంగా కనిపించే అంశాలు. అయితే, ఈ తరహా రంగులు, ప్రింట్స్ ఎక్కువగా కెమికల్ వల్లనే వస్తుంటాయి. ఎక్కువ శాతం ఫ్యాషన్‌లలో ఉపయోగించే పాలిస్టర్ వల్ల జంతుజాలంతో పాటు మానవునికి హాని కలుగుతుందని నివేదికలు చెబుతున్నాయి. నిజానికి మన అభిరుచులే మనకు శత్రువులుగా మారుతున్నాయని చెబుతున్నారు నిఫ్ట్‌లో ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సు చేస్తున్న ఇషితా. పేపర్ ప్లేట్లు, కప్పులు, ప్లాస్టిక్ డబ్బాలతో ఆర్ట్ టు వేర్ అంటూ డిజైన్ రూపొందించిన ఆమె మాట్లాడుతూ ‘ఆదా యం పెరిగిన తర్వాత దుస్తులకు అధికంగా ఖర్చు చేయడం పెరిగింది. నిజానికి టెక్స్‌టైల్ రీసైక్లింగ్ అనేది చాలా తక్కువగా జరుగుతుంటుంది. గ్రీన్‌పీస్ అధ్యయనాల ప్రకారం వేస్ట్‌గా మనం పారేసే 95 శాతం వస్త్రాలను తిరిగి ధరించడం, పునర్ వినియోగించడంతో పాటు రీసైకిల్ చేయవచ్చు అన్నారు.



**సృజనాత్మకతే మంత్రం..**

టెక్స్‌టైల్స్ ఉత్పత్తి వల్ల మొత్తంమ్మీద 1.2 బిలియన్ టన్నుల గ్రీన్ హౌస్ గ్యాసెస్ విడుదలవుతున్నాయని సృజనాత్మక విధానంతో డిజైనింగ్ చేయడం ద్వారా వినియోగం పెరిగి కాలుష్యమూ తగ్గుతుందని యూఎన్ ఎన్విరాన్‌మెంట్ భావిస్తోంది. జర్మన్ ఐవేర్ బ్రాండ్ కొకోలెనీ ఇప్పుడు గోవాకు చెందిన కళాకారులతో భాగస్వామ్యం చేసుకుని గోవన్ గ్లాసెస్ తయారుచేస్తున్నాయి. గోవన్ శైలిలో వీటిని హ్యాండ్ పెయింట్ చేసి ఇస్తుందా సంస్థ. ఈ కళ్లజోళ్లలో ప్రత్యేకత ఏమిటంటే.. వీటిని ఎకో ఫ్రెండ్లీ ఉడ్, బాంబూ, గేదె కొమ్ములు, ఉడ్ పల్ప్‌తో తయారు చేస్తున్నారు. విద్యార్థులు సైతం సస్టెయినిబిలిటీ అనేది నినాదం కావాలంటున్నారు. తమ కరిక్యులమ్‌లో రీసైకిల్ ఫ్యాషన్ ఓ అంశంగా చేరిందని నగరంలోని పలు ఇనిస్టిట్యూట్ విద్యార్థులు చెబుతున్నారు. దీనిని సీరియస్‌గా తీసుకోవాల్సిన ఆవశ్యకత ఉందని నిఫ్ట్ విద్యార్థులు బావనా శర్మ, అన్విత చెబుతూ ప్రాజెక్ట్‌లో భాగంగా వేస్ట్ మెటీరియల్స్‌తో కలెక్షన్ చేయడం తప్ప వేరబుల్ టెక్స్‌టైల్స్‌గా మార్చాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ఇటీవల ఉడ్ నుంచి కూడా ఫైబర్స్ తీసి వస్త్రాలను రూపొందిస్తుండటంతో పాటుగా టెన్సిల్ ఫైబర్స్‌తో వస్త్రాలు రూపొందిస్తుండటంతో భవిష్యత్‌లో కాటన్‌తో పాటుగా పూర్తి ఎకో ఫ్రెండ్లీ వస్త్రాలు ట్రెండీగా సాగే అవకాశాలున్నాయని విద్యార్థులు చెబుతున్నారు.

## ప్రజాశాంతి పార్టీలో చేరిన బాబూమోహన్

### వరంగల్ నుంచి పోటీ చేస్తానని ప్రకటన

**వరంగల్,మార్చి4(వెలుతురు):** ప్రముఖ నటుడు, మాజీ మంత్రి, మాజీ ఎమ్మెల్యే బాబు మోహన్ కెఎ పాల్ సార్థంయలోని ప్రజా శాంతి పార్టీలో (చేరారు. సోమవారం పార్టీ చీఫ్ కేఏపాల్ సమక్షంలో బాబుమోహన్ పార్టీ కండువా కప్పుకున్నారు. కొద్ది రోజుల క్రితం బీజేపీకి గుడ్‌బై చెప్పిన మాజీ మంత్రి.. సోమవారం ప్రజాశాంతి పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా



మీడియాతో బాబు మోహన్ మాట్లాడుతూ.. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ప్రజాశాంతి పార్టీ తరపున వరంగల్ నుంచి బరిలోకి దిగనున్నట్లు ప్రకటించారు. త్వరలోనే ప్రచారం ప్రారంభించి కచ్చితంగా విజయం సాధిస్తామని బాబు మోహన్ ధీమా వ్యక్తం చేశారు.

గత నెలలో బీజేపీకి బాబుమోహన్ రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా బీజేపీ నాయకత్వంపై ఆయన తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు కూడా. తనను వాడుకుని బీజేపీ పొమ్మనలేక పొగ పెట్తోందని ఆరోపణలు చేశారు. ఆందోల్ నియోజకవర్గం నుంచి 2018, 2023లో బీజేపీ తరఫున ఎమ్మెల్యేగా బాబుమోహన్ పోటీ చేశారు. అయితే వరంగల్ ఎంపీ టికెట్‌ను మాజీ మంత్రి ఆశించారు. కానీ.. వరంగల్ టికెట్ బాబుమోహన్‌కు ఇచ్చేందుకు కమలంపార్టీ నిరాకరించింది. దీంతో తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ బీజేపీకి బాబు మోహన్ గుడ్‌బై చెప్పేశారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆందోల్ టికెట్‌ను బాబుమోహన్ కుమారుడు ఉదయ్ మోహన్‌కు ఇవ్వాలని బీజేపీ భావించింది. అయితే తమ కుటుంబంలో బీజేపీ చిచ్చు పెడుతోందని మాజీ మంత్రి ఆరోపించారు. దీంతో బీజేపీ చివరి నిమిషంలో ఆందోల్ టికెట్‌కు బాబూమోహన్‌కు ఇవ్వగా.. ఆ ఎన్నికల్లో ఆయన ఓడిపోయారు.

## భువనగిరి అడిషనల్ కలెక్టర్‌పై వేటు

**భువనగిరి,మార్చి4(వెలుతురు):** యాదాద్రి భువనగిరి జిల్లా అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) భాస్కరరావుపై సస్పెన్షన్ వేటు పడింది. ఎన్నికల కమిషన్ ఆదేశాలతో ఆయనను సస్పెండ్ చేస్తూ తెలంగాణ రెవెన్యూ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. భువనగిరి పార్లమెంట్ పరిధిలోని నల్గొండ, జనగామ, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో నాలుగేళ్ల నుంచి విధులు నిర్వహిస్తూ.. ఇంకా మూడేళ్లు పూర్తి కాలేదని తప్పుడు నివేదిక ఇవ్వడంతో విచారణ జరిపిన ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకుంది.

## శ్రీశైలంలో వైభవంగా శివరాత్రి ఉత్సవాలు

**శ్రీశైలం,మార్చి4(వెలుతురు):** శ్రీశైలం మల్లికార్జున స్వామివారి పుణ్యక్షేత్రంలో శివరాత్రి మహోత్సవాలు వైభవంగా జరగుతున్నాయి. ఉత్సవాలను తిలకించేందుకు తెలుగు రాష్ట్రాలతోపాటు కర్ణాటక నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివస్తున్నారు. సోమవారం నల్లమల అడవుల నుంచి భారీ సంఖ్యలో భక్తులు కాలినడకన శ్రీశైలానికి చేరుకుంటున్నారు. నాగులూటి నుంచి పెద్దచెరువు, భీమునికొలను, కైలాస ద్వారం లాంటి దట్టమైన అటవీ ప్రాంతాల నుంచి భక్తులు పాదయాత్ర చేసుకుంటూ శ్రీశైలానికి వేలాదిగా తరలివస్తున్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఇవాళ రాత్రి 7 గంటలకు స్వామి అమ్మవార్లకు మయూర వాహన సేవ, గ్రామోత్సవం నిర్వహించనున్నారు.

## వైకాపాలోకి భారీగా చేరికలు

### జగన్ సమక్షంలో ఆళ్లగడ్డ బిజెపి నేతల చేరిక

**అమరావతి,మార్చి4(వెలుతురు):** ఏపీలో ఎన్నికల వేళ.. అభివృద్ధి మంత్రం వైపు పలు పార్టీ నేతలు ఆకర్షితులవుతున్నారు. గత కొన్నాళ్లుగా ప్రతిపక్షాలకు షాక్ తగిలేలా.. వైఎస్సార్‌సీపీలోకి భారీగా చేరికలు కనిపిస్తున్నాయి. క్షేత్రస్థాయి కేడర్ మొదలు.. మాజీ మంత్రులు, కీలక నేతల దాకా అధికార పార్టీ కండువా కప్పుకుంటున్నారు. ఈక్రమంలో తాజాగా.. ఆళ్లగడ్డ బీజేపీ ఇంఛార్జి భూమా కిషోర్‌రెడ్డి వైఎస్సార్‌సీపీలో చేరారు. సోమవారం తాడేపల్లిలోని సీఎం క్యాంప్ కార్యాలయానికి వచ్చిన ఆయన.. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో పార్టీ కండువా కప్పుకున్నారు. కిషోర్ రెడ్డితో పాటు భూమా వీరభద్రారెడ్డి, గంధం భాస్కర్‌రెడ్డి, అంబటి మహేశ్వరరెడ్డి, పలువురు స్థానిక బీజేపీ నేతలు సైతం వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఆళ్ళగడ్డ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి (నాని), వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ రామసుబ్బారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు. సీఎం క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి శ్రీ వైఎస్ జగన్ సమక్షంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో చేరిన ఆళ్ళగడ్డ బీజేపీ ఇంఛార్జి భూమా కిషోర్ రెడ్డి. కిషోర్ రెడ్డితో పాటు వైఎస్ఆర్‌సీపీలో చేరిన భూమా వీరభద్రారెడ్డి, గంధం భాస్కర్‌రెడ్డి, అంబటి మహేశ్వరరెడ్డి, పలువురు స్థానిక బీజేపీ? నేతలు ఉన్నారు. 'భూమా అఖిల ప్రియ ఓ క్రిమినల్. ఆమె.. ఆమె భర్త కలిసి కిడ్నాప్‌లు, దొంగ తనాలు, కబ్జాలు చేస్తున్నారు. అలాంటి అరాచక వాదులు గెలవకూడదు అని వై ఎస్సార్ కాంగ్రెస్ లో చేరాను. ఆళ్లగడ్డలో వైఎస్సార్‌సీపీ భారీ మెజారిటీతో గెలుస్తుంది. గంగుల నానిని గెలిపించడం కోసం భూమా కుటుంబం పనిచేస్తుంది. భూమా కుటుంబ మొత్తం అఖిల ప్రియకి వ్యతిరేకంగా పనిచేస్తాం. సీఎం జగన్ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమం చూసి పార్టీలో చేరాను. ఏపీలో బీజేపీ నాయకులు టీడీపీ ఇచ్చే సీట్ల కోసం ఎదురు చూస్తున్నారేగానీ.. నేతల, కార్యకర్తల మనోభావాలను పట్టించుకోవడం లేదు' భూమా కిషోర్ అన్నారు.పీసీసీ కిసాన్ సెల్ ప్రెసిడెంట్ జెట్టి గురునాథరావు, జంగారెడ్డిగూడెం మాజీ జెడ్పీటీసీ ముప్పిడి శ్రీనివాస్ సీఎం జగన్ సమంలో వైఎస్సార్‌సీపీలోకి చేరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ పీవీ మిథున్‌రెడ్డి, ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ళ నాని పాల్గొన్నారు.

## పికెకు ఇక్కడ ఏం తెలుసు: జోగి రమేశ్

**విజయవాడ,మార్చి4(వెలుతురు):** ఒక పీకే(పవన్ కల్యాణ్) అయిపోయాడు.. ఇప్పుడు ఇంకొక పీకే(ప్రశాంత్ కిషోర్) వచ్చాడంటూ.. మంత్రి జోగి రమేష్ విసుర్లు విసిరారు. తాజాగా ఏపీ రాజకీయాలపై ప్రశాంత్ కిషోర్ చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ.. మంత్రి జోగి రమేష్ పలు ప్రశ్నలు సంధించారు. ప్రశాంత్ కిషోర్‌కి అసలు ఆంధ్రాలో టీమ్ ఉందా?.. అతను సర్వేలెప్పుడు చేశాడు?. ఐ ప్యాక్ కి ప్రశాంత్ కిషోర్ కి సంబంధం లేదు. ఎల్లో మీడియాలో డబ్బాలు కొట్టేందుకు ఆయనేవో రెండు మాటలు మాట్లాడాడు. ప్రశాంత్ కిషోర్ పెట్టిన పార్టీ ఏమైంది?. ప్రశాంత్ కిషోర్ ని ఎవరూ పట్టించుకోరు. టీడీపీ రాసి ఇచ్చిన స్క్రిప్ట్‌నే పీకే చదువుతున్నారని అంటూ విమర్శలు గుప్పించారు.

## టెన్త్ విద్యార్థుల హాల్‌టిక్కెట్లు విడుదల

**అమరావతి,మార్చి4(వెలుతురు):** ఏపీలో పదో తరగతి పరీక్షల హాల్ టిక్కెట్లు విడుదలయ్యాయి. ఈ హాల్‌టిక్కెట్లను అధికారిక వెబ్‌సైట్ నుంచి విద్యార్థులే నేరుగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. డౌన్‌లోడ్‌కు విద్యార్థి పేరు, జిల్లా పేరు, పాఠశాల పేరు, పుట్టిన తేదీ వివరాలను ఎంటర్ చేయాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు. మార్చి 18 నుంచి 30 వరకు టెన్త్ పరీక్షలు జరగనున్నాయి. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45గంటల వరకు నిర్వహించనున్నారు.

## ఏపీ ప్రభుత్వానికి హైకోర్టులో గట్టి షాక్

### టెట్, డీఎస్సీ పరీక్షల మధ్య నాలుగు వారాల గడువు ఉండాలి

**అమరావతి,మార్చి4(వెలుతురు):** టెట్, డీఎస్సీ పరీక్షలకుసంబంధించి ఏపీ ప్రభుత్వానికి హైకోర్టులో గట్టి షాక్ తగిలింది. టెట్, డీఎస్సీ పరీక్షల మధ్య నాలుగు వారాలు కనీస సమయం ఉండాలని హైకోర్ట్ తీర్పు నిచ్చింది. మార్చ్ 15 నుంచి ఇచ్చిన డీఎస్సీ షెడ్యూల్‌ను ధర్మాసనం సస్పెండ్ చేసింది. టెట్ పరీక్ష ఫలితాలు మార్చి 14న వస్తున్నాయని , మార్చి 15 నుంచి డీఎస్సీ పరీక్షలు పెట్టడంపై హైకోర్ట్‌లో పలువురు విద్యార్థులు పిటిషన్లు దాఖలు చేశారు.

# పికె వ్యాఖ్యలపై రాజకీయ దుమారం

### ప్రశాంత్ వ్యాఖ్యలు అర్థరహితం అన్న వైసిపి

### రాజకీయ బిచ్చడాగు అంటూ మంత్రుల ధ్వజం

**విశాఖపట్నం,మార్చి4(వెలుతురు):**
ఏపీ ఎన్నికల్లో వైసీపీ ఓడిపోతుందని రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ చేసిన కామెంట్లు రాష్ట్ర రాజకీయాల్లో దుమారం రేపుతున్నాయి. 2024 ఎన్నికల్లో ఏ పార్టీ గెలవబోతుందన్న అంశంపై ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ చేసిన వ్యాఖ్యలు ఏపీలో రాజకీయ దుమారాన్ని రేపుతున్నాయి. పీకే వ్యాఖ్యలను ప్రతిపక్ష టీడీపీ, జనసేన కూటమి తమకు అనుకూలంగా సోషల్ మీడియాలో విస్తృతంగా సర్క్యులేట్ చేసుకుంటుండగా అధికార వైసీపీ పీకే వ్యాఖ్యలను తిప్పి కొడుతోంది. పీకే వ్యాఖ్యలకు కౌంటర్‌గా వైసీపీ మంత్రులు, ఎమ్మెల్యేలు ఒక్కొక్కరుగా కౌంటర్లు ఇస్తున్నారు. ముఖ్యంగా ఏపీ మంత్రులు పీకేపై తీవ్రంగా మండిపడుతున్నారు. ప్రశాంత్ కిషోర్ ఏమైనా మాయల ఫకీరా అని ప్రశ్నిస్తున్నారు. బిహార్‌లో రాజకీయ పార్టీ పెట్టి, వివిధ పార్టీలకు పొలిటికల్ వ్యూహకర్తగా పని చేస్తున్న ప్రశాంత్ కిషోర్ కు ఏపీ రాజకీయాలతో ఏంటి సంబంధం అని రాష్ట్ర పరిశ్రమలశాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ ప్రశ్నించారు. హైదరాబాద్‌లో ఆదివారం జరిగిన ఒక కాన్లేవ్ లో ప్రశాంత్ కిషోర్ మాట్లాడుతూ.. ఏపీలో జగన్ ప్రభుత్వం మళ్లీ రాదంటూ చేసిన ప్రకటనపై మంత్రి అమర్నాథ్ ఘాటుగా స్పందించారు. స్థానిక సర్క్యూట్ హౌస్ లో ఆయన మాట్లాడుతూ.. బిహార్లో ప్రశాంత్ కిషోర్ ఓటమిపాలు అవుతాడు అన్నది మా నమ్మకం అన్నారు.

ఆంధ్రప్రదేశ్ ఎన్నికల్లో చంద్రబాబు, పవన్ కళ్యాణ్ కూటమి చిత్తుగా ఓడిపోతుం దనేది పేదవాడి ఫీలింగ్ అని అమర్నాథ్ చెప్పారు. ప్రశాంత్ కిషోర్ మాటలను ఎవరు పరిగణలోకి తీసుకోరని, ఈ రాష్ట్రంలో ఉన్న పేదవాళ్ళ అభిప్రాయాన్ని పరిగణలోకి తీసుకుంటారని అమర్నాథ్ స్పష్టం చేశారు. పీకే చెప్పిన మాటలకు ఎల్లో మీడియా విస్తృత ప్రచారం కల్పించి ప్రజలను ఏమార్చే ప్రయత్నం చేస్తున్నారని మంత్రి అమర్నాథ్ ఆరోపించారు. గడిచిన 5 సంవత్సరాలలో సీఎం జగన్ ప్రభుత్వం రాష్ట్రంలో సంక్షేమ కార్యక్రమాల కోసం రెండున్నర లక్షకోట్ల రూపాయలను ఖర్చు చేసిందని, పేదలందరికీ ప్రభుత్వ ఫలాలు అందేలా చేసిందని అన్నారు. ఈ పథకాలను చూసి ప్రజలు ఓట్లు వెయ్యరంటూ పీకే చేసిన వ్యాఖ్యల్ని తీవ్రంగా ఖండించారు. గత ప్రభుత్వంలో సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను ఏమాత్రం చేయని చంద్రబాబు ఏ విధంగా గెలుస్తాడని ప్రశాంత్ కిషోర్ చెప్తున్నారు? ఈయన ఏమైనా మాంత్రికుడా? మాయల ఫకీరా అని మంత్రి అమర్నాథ్ ప్రశ్నించారు. ప్రశాంత్ కిషోర్ మాటలను ప్రజలు పరిగణలోకి



తీసుకోవాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. గతంలో ఏపీ ఎన్నికల ఫలితాలపై జోస్యం చెప్పి మాజీ ఎంపీ లగడపాటి రాజగోపాల్ రాజకీయ సన్యాసం తీసుకున్నారని మంత్రి అంబటి రాంబాబు అన్నారు.
ఇప్పుడు ప్రశాంత్ కిషోర్ సైతం ఏపీ ఎన్నికల ఫలితాలపై తప్పుడు జోస్యం చెప్పి సన్యాసానికి సిద్ధంగా ఉన్నాడంటూ అంబటి రాంబాబు సెటైర్లు వేశారు. ఈ మేరకు ట్వీట్ చేశారు. మాజీ మంత్రి పేర్ని నాని ప్రశాంత్ కిషోర్ వ్యాఖ్యలకు కౌంటర్ ఇచ్చాడు. ఒక పీకే వల్ల కావడం లేదని చంద్రబాబు మరొక పీకేను తెచ్చుకున్నాడని ఎద్దేవా చేశాడు. పవన్ కళ్యాణ్, చంద్రబాబుతో పాటు పీకే కూడా అబద్దాల పోటీలో ఛాంపియన్ అని అన్నాడు. రాష్ట్రంలో పవన్ కళ్యాణ్ ఏమీ చేయలేకపోతున్నాడని, అందుకే చంద్రబాబు ప్రశాంత్ కిషోర్ ను తెచ్చుకున్నాడని అన్నారు. బీహార్ లో ప్రశాంత్ కిషోర్ ఓడిపోబోతున్నాడని, ఏపీలో చంద్రబాబు, పవన్ కళ్యాణ్ లు చిత్తుగా చిత్తుగా ఓడిపోవడం ఖాయం అని అన్నారు. సంక్షేమం మాత్రమే చేస్తే గెలవరని అంటున్న పీకే మ్యానిఫెస్టోల్లో ఎడాపెడా సంక్షేమ పథకాలు పెట్టమని చంద్రబాబుకు సలహా ఎందుకిచ్చాడని ప్రశ్నించాడు. రాష్ట్రంలో అభివృద్ధి లేకపోతే గత ఐదేళ్లుగా అన్ని రంగాల్లో ముందంజలో ఎలా ఉందని ప్రశ్నించాడు. తాను ,మహామాంత్రికుడిని అని చెప్పుకుంటున్న ప్రశాంత్ కిషోర్ సొంత రాష్ట్రంలో బిహర్లో తన పార్టీని ఎందుకు గెలిపించలేకపోయాడని అన్నారు. పీకే రాజకీయ బిచ్చగాడిగా మారిపోయాడని అన్నారు. ఇంట గెలవని వాడు రచ్చ ఎలా గెలవగలడని అన్నారు.
మరికొన్ని రోజుల్లో జరగనున్న ఏపీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ కచ్చితంగా ఓడిపోతుందన్నారు. ఏపీ సీఎం జగన్ పార్టీ మామూలుగా కాదు, భారీ తేడాతో ఓటమి చెందుతుందని ప్రశాంత్ కిషోర్ వ్యాఖ్యానించారు.

# ఆంధ్రప్రదేశ్ కోసమే టిడిపి-జనసేన పొత్తు

### అభివృద్ధి ఏదో..దోపిడీ ఏదో గుర్తించండి

### కియాను తెచ్చి 12 లక్షల ఉద్యోగాలు ఇచ్చాం

### జగన్ పాలనలో అంతా విధ్వంసమే

### వలంటీర్ల వ్యవస్థను కొనసాగిస్తాం

### పెనుకొండ సభలో చంద్రబాబు వెల్లడి

**పెనుకొండ,మార్చి4(వెలుతురు):**
స్వార్థం కోసం తెదేపా-జనసేన కలవలేదని.. ఆంధ్రప్రదేశ్‌ను రక్షించు కునేందుకే కలిశాయని తెలుగుదేశం అధినేత చంద్రబాబు స్పష్టం చేశారు. పెనుకొండలో నిర్వహించిన ' రా.. కదలిరా' సభలో ఆయన మాట్లాడారు. ఏది అభివృద్ధో..?ఏది దోపిడీనో.. గుర్తించి వచ్చే ఎన్నికల్లో ప్రజలు ఓటేయాలని పిలుపునిచ్చారు. సాగునీరు ఇస్తే చాలు.. రాయలసీమ రైతులు బంగారం పండిస్తారు. అనంతపురం జిల్లా అంటే నాకు ఎంతో ఇష్టం. అత్యంత తక్కువ వర్షపాతం ఉన్నది ఇక్కడే. కరవు జిల్లాను సస్యశ్యామలం చేయాలని తెదేపా హయాంలో సంకల్పించాం. కియా పరిశ్రమ తెచ్చి వేలమందికి ఉపాధి కల్పించాం. గొల్లపల్లి రిజర్వాయర్‌ను 18 నెలల్లో పూర్తి చేశాం. కియాలో ఇప్పటివరకు 12 లక్షల కార్లు తయారయ్యాయి. దీని వల్ల ప్రత్యక్ష, పరోక్షంగా 50 వేల మందికి ఉద్యోగాలు వచ్చాయి. అనంతపురం జిల్లాలో బిందు, తుంపర సేద్యం మరింత పెరగాలి. 2014లో ఈ ప్రాంతం ఎలా ఉంది.. ఇప్పుడెలా ఉంది? మేం అధికారంలో ఉంటే సాగునీరు, పెట్టుబడులు, ఉపాధి పెరిగేవి. అహంకారంతో రాష్ట్రాన్ని విధ్వంసం చేసిన వ్యక్తిని ఇంటికి పంపాలి. స్కీమ్‌ల్లో కూడా స్కామ్‌లు చేసే వ్యక్తి జగన్.. రాయలసీమకు తెచ్చిన పెట్టుబడులు ఏమిటో జగన్ చెప్పాలి. ఈ ఐదేళ్లలో ఏదైనా ప్రాజెక్టు నిర్మించారా? రాయలసీమకు ఏ పార్టీ మేలు చేసిందో ప్రజలు గ్రహించాలి. అభివృద్ధిలో మా పార్టీతో పోల్చుకోవద్దని జగన్‌ను కోరుతున్నాం. వివేకా హత్య కేసులో అనేక పిల్లిమొగ్గలు వేసింది ఎవరు? జాకీ పరిశ్రమ వెళ్లిపోవడానికి కారకులెవని అన్నారు. ధర్మవరాన్ని పీడిస్తున్న కేటుగాడు కేతిరెడ్డి. ఎర్రగుట్టను మింగేసిన వ్యక్తి ఆయన. రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి దందాలు, దౌర్జన్యాలు పెరిగాయి. తోపుదుర్తి లెక్కలన్నీ నా వద్ద ఉన్నాయి. అకౌంట్స్ సెటిల్ చేస్తా. మా కార్యకర్తలను వేధించిన వారిపై చర్యలు తప్పవు. ఈ ఐదేళ్లలో ఒక్కరికైనా ఉద్యోగం వచ్చిందా? నేనిచ్చింది ఐటీ ఉద్యోగాలు.. జగన్ ఇచ్చింది వాలంటీర్ ఉద్యోగాలు. తెదేపా - జనసేన అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా వాలంటీర్ వ్యవస్థ ఉంటుంది. ఎవరి ఉద్యోగం తీసేయం. వాలంటీర్లకు మంచి భవిష్యత్తు ఉంటుంది.. మీకు న్యాయం చేస్తాం. వారిని



వైకాపా కోసం పనిచేయవద్దని కోరుతున్నా'అని చంద్రబాబు అన్నారు. వైసీపీ ప్రభుత్వం తెచ్చిన వలంటీర్ వ్యవస్థపై టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'మేం అధికారంలోకి వస్తే వలంటీర్లను తీసేయం.. ఎవరి ఉద్యోగం తొలగించం. అసలు ఆ ఆలోచనే చేయం. వారికి కచ్చితంగా న్యాయం చేస్తాం. మళ్లీ చెబుతున్నా.. తప్పకుండా వలంటీర్ల వ్యవస్థను కంటిన్యూ చేస్తాం. వలంటీర్లకు మంచి భవిష్యత్ ఉంటుంది. వలంటీర్లు ఎవరూ వైసీపీ కోసం పనిచేయవద్దు..' అని వలంటీర్లకు చంద్రబాబు అభయం ఇస్తూ.. ఒకింత శుభవార్తే చెప్పారు. అంతేకాదు.. టీడీపీ హయాంలో ఎన్నో ఐఐటీ ఉద్యోగాలు ఇస్తే వైసీపీ అధికారంలోకి వచ్చాక కేవలం వలంటీర్ ఉద్యోగాలు ఇచ్చిందని బాబు విమర్శలు గుప్పించారు. బాబు కామెంట్స్‌తో వలంటీర్లలో ఆందోళన.. భయం తొలగినట్లయ్యింది. వాస్తవానికి వలంటీర్ల వ్యవస్థను కొనసాగిస్తామని చంద్రబాబు చెప్పడం ఇదేం మొదటిసారి కాదు. అయితే వైసీపీ మాత్రం వలంటీర్లలో లేనిపోని అనుమానాలు నూరిపోస్తుండటంతో వారిలో భయం మొదలైంది. టీడీపీ గెలిస్తే.. వలంటీర్ల వ్యవస్థ, సంక్షేమ పథకాలు ఇలా ఏవీ రావన్నట్లుగా ఇటీవల కాలంలో పదేపదే వైసీపీ నేతలు ప్రచారం చేస్తున్నారు. దీంతో మరోసారి చంద్రబాబు పెనుకొండ సభావేదికగా కుండబద్ధలు కొట్టారు. సో.. వలంటీర్లకు నిజంగా ఇది తియ్యటి శుభవార్తే అని చెప్పుకోవచ్చు. ఇక టీడీపీ మిత్రపక్షమైన జనసేన అధినేత పవన్‌కల్యాణ్ కూడా పలుమార్లు వలంటీర్లను కొనసాగిస్తామని.. ఎవరి పొట్టకొట్టమని మాటిచ్చిన విషయం అందరికీ తెలిసిందే. సో.. టీడీపీ-జనసేన గెలిస్తే ఇదే వలంటీర్ వ్యవస్థ ఉంటుందన్న మాట. అటు చంద్రబాబు.. ఇటు పవన్ కల్యాణ్ ఇద్దరూ అభయం ఇచ్చారు గనుక.. వలంటీర్లకు ఇక భయమే అక్కర్లేదు.

# బస్సుల కొనుగోళ్లలో ప్రభుత్వానికి మోసం

### రవాణాశాఖకు పన్నుల ఎగవేత..ఆదాయానికి గండి

### నారాయణ అనుచరుల ఇల్లపై దాడుల్లో నగదు స్వాధీనం

### వివరాలు వెల్లడించిన ఎస్పీ తిరుమలేశ్వర్ రెడ్డి

**నెల్లూరు,మార్చి4(వెలుతురు):**
నెల్లూరు నగరంలో మాజీ మంత్రి నారాయణ అనుచరుల ఇళ్లలో జరిగిన పోలీస్ సోదాల విషయంలో ఎస్పీ తిరుమలేశ్వర్ రెడ్డి మీడియాకు వివరాలు తెలియజేశారు. రాజకీయాలకు ఈ సోదాలకు సంబంధం లేదని ఆయన స్పష్టత ఇచ్చారు. నారాయణ విద్యాసంస్థల పేరుతో బస్సుల కొనుగోలు వ్యవహారంలో ప్రభుత్వాన్ని మోసం చేయాలని చూశారని, రవాణా శాఖకు రావాల్సిన ఆదాయానికి గండి కొట్టాలని ప్రయత్నించారని.. అందుకే ఆ కేసుతో సంబంధం ఉన్న అందరి ఇళ్లలో సోదాలు చేపట్టామని తెలిపారు. నారాయణ ఎడ్యుకేషనల్ సొసైటీకి అనుబంధంగా ఇన్స్ పైరా అనే సంస్థ ఉందని తెలిపారు ఎస్పీ తిరుమలేశ్వర్ రెడ్డి. ఆ సంస్థకు పునీత్ అనే వ్యక్తి డైరెక్టర్ గా ఉన్నారని, నారాయణ విద్యాసంస్థల్లో కూడా ఆయన డైరెక్టర్ గా ఉన్నారని చెప్పారు. 2023 జూన్ లో ఇన్స్ పైరా అనే కంపెనీ నారాయణ విద్యా సంస్థలతో ఒక ఒప్పందం కుదుర్చుకుందని అన్నారు ఎస్పీ. ఈ ఒప్పందం ప్రకారం 92 కొత్త బస్సుల కోసం రూ. 20.8 కోట్లకు ఇన్స్ పైరా సంస్థ ఆర్డర్ పెట్టిందని, అయితే ఇన్ వాయిస్ మాత్రం నారాయణ విద్యా సంస్థల పేరు మీద తీసుకున్నారని ఆయన వివరించారు. వాస్తవానికి విద్యా సొసైటీ కి చెందిన వాహనాలకు పన్ను తక్కువగా ఉంటుంది. అందుకే ఇన్స్ పైరా సంస్థ ఇక్కడ నారాయణ విద్యా సంస్థల పేరు వాడుకుందని అంటున్నారు నెల్లూరు జిల్లా ఎస్పీ. అయితే ఈ కేసులో జిల్లా రవాణా శాఖ అధికారికి ఈ గోల్ మాల్ పై సమాచారం అందిందని, ఆ సమాచారం ఆధారంగా తాము విచారణ చేపట్టామని, సోదాలు చేశామని చెప్పారాయన. బస్సులను నారాయణ సంస్థ పేరుతో రిజిస్ట్రేషన్ చేయించినా.. ప్రతి నెలా ఇన్స్ పైరా సంస్థ ఆ బస్సులకు సంబంధించి అ÷-దదెను నారాయణ సంస్థలనుంచి వసూలు చేయడం విశేషం. వాహనాలను ఇన్స్ పైరా కొన్నా కూడా వాటిని నారాయణ సంస్థ కొన్నట్టు రవాణా శాఖకు చూపించారు. మరి వాటి యజమాని నారాయణ విద్యాసంస్థ అయితే.. ఇన్స్ పైరా కు సదరు సంస్థ అదె ఎందుకు చెల్లిస్తోందనేదే ఇక్కడ అసలు ప్రశ్న. అంటే ఇక్కడ గోల్ మాల్ చేసి, ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టారని పోలీసులు తేల్చారు. నెల్లూరు జిల్లా రవాణా శాఖ అధికారులు బాలాజీ నగర్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు రంగంలోకి దిగారు. ఈ వ్యవహారంతో సంబంధం ఉన్నవారి ఇళ్లపై దాడులు చేశారు. ఈ దాడుల్లో కోటీ 81లక్షల రూపాయల సొమ్ము స్వాధీనం చేసుకున్నారు. ఈ సొమ్ముకి సదరు యజమానులు లెక్క చూపించకపోవడం విశేషం. దీన్ని ఆదాయపు పన్ను శాఖకు అప్పగిస్తున్నట్టు తెలిపారు పోలీసులు. తప్పుడు డాక్యుమెంట్ల తో వాహనాలను రిజిస్ట్రేషన్ చేసిన కేసులో పూర్తి స్థాయి విచారణ చేపట్టామన్నారు. ఈ వ్యవహారంలో పునీత్ పై కేసు నమోదు చేశామని, విచారణ కొనసాగుతోందని జిల్లా ఎస్పీ తిరుమలేశ్వర్ రెడ్డి చెప్పారు. డైరెక్టరేట్ ఆఫ్ రెవిన్యూ ఇంటలిజెన్స్ విభాగం ఈ మోసాన్ని గుర్తించిందని తెలిపారు డీటీసీ చందర్. రవాణా శాఖ కమిషనర్ కు ఫిర్యాదు రావడంతో ఆయన ఆదేశాల మేరకు తాము విచారణ చేపట్టామన్నారు. మొత్తం 92 వాహనాలు కొనుగోలు చేశారని, నారాయణ ఎడ్యుకేషనల్ సొసైటీ పేరుపై రిజిస్ట్రేషన్ చేయించి పన్ను ఎగ్గొట్టారని అన్నారు. రూ.10 కోట్లకు పైగా పన్ను చెల్లించాల్సి ఉండగా కేవలం రూ.22.25 లక్షలు మాత్రమే పన్ను కట్టారన్నారు. నారాయణ సంస్థకు నోటీస్ లు ఇచ్చి వివరణ తీసుకుంటున్నామని, అవసరమైతే ఆయా బస్సుల్ని సీజ్ చేస్తామని చెప్పారు డీటీసీ చందర్. బస్సుల రిజిస్ట్రేషన్లలో జీఎస్టీ అక్రమాలకు కూడా పాల్పడినట్టు గుర్తించామని అన్నారు.

Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at **SRI SHANTHI PUBLICCATIONS** H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. **EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609.** Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com